RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక:8 హైదరాబాద్, ఆదివారం, 15 జూన్ 2025 పేజీలు: 12 వెల: 1.00

## సైప్రస్ కు మోడీ.. టార్గెట్ టర్కీ...

న్యూఢిల్లీ, జూన్ 14 (

జీ7 సదస్సుల్లో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్రమోదీ కెనడాకు వెళ్లనున్నారు. మొదట ఈ సదస్సుకు భారత్‌కు ఆహ్వానం అందలేదు. అయితే జీ7 సభ్యదేశాల ఒత్తిడితో కెనడా తప్పనిసరి పరిస్థితిలో భారత్‌ను ఆహ్వానించింది. దీంతో మోదీ కెనడా వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఆయన ఓ వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారు. అతి చిన్న దేశంలోనూ పర్యటన షెడ్యూల్ ఖరారు చేసుకున్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2025 జూన్ 15–16న సైప్రస్‌ను సందర్శించారు, ఇది 23 సంవత్సరాల తర్వాత భారత ప్రధాని చేసిన తొలి పర్యటన. జీ7 శిఖరాగ్ర సమావేశానికి (జూన్ 15–17కెనడా) వెళ్లే మార్గంలో సైప్రస్‌లోనూ పర్యటించాలని నిర్ణయించుకున్నారు. అయితే ఈ సైప్రస్‌తో మనకు పెద్దగా వ్యాపార, సైనిక సంబంధాలు కూడా లేవు. కానీ, మోదీ ఈ దేశంలో పర్యటన ఖరారు చేసుకున్నారు. దీని వెనుక పెద్ద వ్యూహం ఉందన్న చర్చ జరుగుతోంది. టర్కీ–పాకిస్తాన్ ఐక్యతకు చెక్ పెట్టడానికి, టర్కీ శత్రు దేశాలైన సైప్రస్, గ్రీస్, ఆర్మేనియాతో మైత్రిని బలోపేతం చేయడానికి వ్యూహాత్మక చర్యగా నిలిచింది.2025 ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా టర్కీ పాకిస్తాన్‌కు సైనిక, రాజకీయ మద్దతు ఇచ్చింది. టర్కీ డ్రోన్ టెక్నాలజీ, ఆయుధ సరఫరాల ద్వారా పాకిస్తాన్‌తో సహకారాన్ని బలపరిచింది. ఈ నేపథ్యంలో, శత్రువుకు శత్రువు మిత్రుడు అన్నట్లుగా.. టర్కీతో విభేదాలున్న సైప్రస్, గ్రీస్, ఆర్మేనియాతో భారత్ సంబంధాలు రాజకీయంగా కీలకమయ్యాయి.మోదీ సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్‌తో చర్చలు జరుపుతారు. ఆర్థిక, వాణిజ్య, ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరప్ ఎకనామిక్ కారిడార్ (ఎ.ఐఇ)పై దృష్టి సారించారు. ఎ.ఐఇ, టర్కీ ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా, సైప్రస్, గ్రీస్ ద్వారా యూరప్‌ను మధ్యప్రాచ్యంతో కలుపుతుంది. సైప్రస్ ఈ కారిడార్‌లో భాగస్వామ్యం టర్కీకి ఆర్థిక, రాజకీయ ఒత్తిడిని సృష్టిస్తుంది.

టర్కీ శత్రు దేశాలతో మైత్రి..

టర్కీకి సైప్రస్, గ్రీస్, ఆర్మేనియాతో దీర్ఘకాల విభేదాలున్నాయి. 1974 టర్కీ ఆక్రమణ తర్వాత ఉత్తర సైప్రస్ వివాదం కొనసాగుతోంది. భారత్ సైప్రస్ ఐక్యత, సార్వభౌమత్వానికి యూఎన్ తీర్మానాల ద్వారా మద్దతిస్తుంది.తూర్పు మధ్యధరా సముద్ర సరిహద్దులపై టర్కీ–గ్రీస్ వివాదాలున్నాయి. భారత్–గ్రీస్ సైనిక, ఆర్థిక సహకారం బలపడుతోంది, రక్షణ ఒప్పందాలు విస్తరిస్తున్నాయి. ఆర్మేనియా–అజర్‌బైజాన్ నాగోర్నో–కరాబాఖ్ వివాదంలో టర్కీ అజర్‌బైజాన్‌కు మద్దతిచ్చింది. భారత్ ఆర్మేనియాకు ఆయుధ సరఫరా, రాజకీయ మద్దతు ద్వారా టర్కీ ప్రభావాన్ని సమతుల్యం చేస్తోంది.

రాజకీయ, అంతర్జాతీయ ప్రభావం

సైప్రస్ 2026లో ఈయూ కౌన్సిల్ అధ్యక్షత వహించనుంది, ఇది భారత్–ఈయూ సంబంధాలను బలోపేతం చేస్తుంది. సైప్రస్ యూఎన్ సెక్యూరిటీ కౌన్సిల్ శాశ్వత సభ్యత్వం, కాశ్మీర్ విషయంలో భారత్‌కు మద్దతిచ్చింది. పహల్గామ్ దాడిని ఖండించి, ఇయూ స్థాయిలో సరిహద్దు ఉగ్రవాద వ్యతిరేక చర్చలను ప్రోత్సహించింది.లిమాసోల్‌లో మోదీ, క్రిస్టోడౌలిడెస్ వ్యాపార సమావేశంలో పాల్గొన్నారు, రెండు దేశాల వ్యాపారవేత్తలను కలిపారు. సైప్రస్ మోదీకి 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకరియోస్ ఎవిఎ' అవార్డు ప్రదానం చేసింది. సైప్రస్ విభజన రేఖ సందర్శన టర్కీకి రాజకీయ సందేశంగా నిలిచింది.మోదీ సైప్రస్ సందర్శన టర్కీ–పాకిస్తాన్ ఐక్యతకు చెక్ పెట్టడానికి, సైప్రస్, గ్రీస్, ఆర్మేనియాతో మైత్రిని బలోపేతం చేయడానికి వ్యూహాత్మక చర్య. ఎ.ఐఇ, ఇయూ సహకారం ద్వారా భారత్ టర్కీ ప్రభావాన్ని సమతుల్యం చేస్తోంది. ఈ పర్యటన మధ్యప్రాచ్య, యూరప్‌లో భారత్ రాజకీయ, ఆర్థిక స్థానాన్ని బలపరిచింది.

## నీట్ లో తెలుగోళ్లు దుమ్ము లేపేశారు

న్యూఢిల్లీ, జూన్ 14,

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నీట్ యూజీ 2025 పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో తెలుగు



రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) అధికారులు ఈ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు.

వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 4వ తేదీన నీట్ యూజీ పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇటీవల ప్రాథమిక కీ ని విడుదల చేసి, అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం ఎన్‌టీఏ తుది ఫలితాలను వెల్లడించింది. అభ్యర్థులు తమ స్కోర్ కార్డులను ఈమెయిల్ ద్వారా లేదా తమ వ్యక్తిగత లాగిన్ వివరాలతో అప్లికేషన్ నంబర్‌ను ఎంటర్ చేసి చూసుకోవచ్చని ఎన్‌టీఏ సూచించింది.ఈసారి ఫలితాల్లో తెలుగు విద్యార్థులు తమ సత్తా చాటారు. తెలంగాణ నుంచి ఏకంగా 41,584 మంది విద్యార్థులు నీట్‌లో అర్హత సాధించగా, ఆంధ్రప్రదేశ్ నుంచి 36,776 మంది ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణకు చెందిన కాకర్ల జీవన్ సాయికుమార్ జాతీయ స్థాయిలో 18వ ర్యాంకును కైవసం చేసుకోగా, షణ్ముఖ నిషాంత్ 37వ ర్యాంకు, మంగారి వరుణ్ 46వ ర్యాంకు, యంద్రపాటి షణ్ముఖ్ 48వ ర్యాంకు సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ నుంచి దర్భా కార్తీక్‌రామ్ 19వ ర్యాంకు, కొడవటి మోహిత్ శ్రీరామ్ 56వ ర్యాంకు సాధించి ప్రతిభ కనబరిచారు.దేశంలోని వివిధ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంఎస్ వంటి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు.

## కెసిఆర్ తో మరోసారి హరీష్ రావు భేటీ

గజ్వేల్ జూన్ 10

;కాళేశ్వరం కమిషన్ విచారణ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ తో మరోసారి హరీష్ రావు భేటీ అయ్యారు. మంగళవారం ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లిన హరీష్ రావు, కెసిఆర్ తో సమావేశమయ్యారు. రేపు కాళేశ్వరం కమిషన్ ముందు కెసిఆర్ హాజరుకానున్నారు. దీంతో కమిషన్ ముందు చెప్పాల్సిన అంశాలపై హరీశ్ రావుతో కెసిఆర్ చర్చిస్తున్నట్లు సమాచారం. కాగా, నిన్న జస్టిస్ ఘోష్ కమిషన్ ముందు హరీశ్ రావు విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. విచారణ తర్వాత నేరుగా ఫామ్ హౌస్ కు వెళ్లిన హరీష్ రావు, కెసిఆర్ తో దాదాపు 5 గంటల పాటు భేటీ అయ్యారు. కాగా, ఈ నెల 6న బిజెపి ఎంపి ఈటల రాజేందర్ ను కమిషన్ విచారించింది.



## సర్పంచ్, ఎంపీటీసీల లిస్టు ఇవ్వండి: మీనాక్షి నటరాజన్

హైదరాబాద్ జూన్ 14,

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఏడాదిన్నర తరువాతే పదవుల పంపకంపై ముందడుగు వేసింది. తొలుత ఆశావాహులైన కొందరు నేతలకు నామినేటెడ్‌పోస్టులను పార్టీ కట్టబెట్టింది.

కొద్దిరోజుల కిందటే పీసీసీ కార్యవర్గాన్ని అధినాయకత్వం ప్రకటించింది. కొత్తగా మంత్రివర్గ విస్తరణ చేపట్టి ముగ్గురికి క్యాబినెట్‌లో అవకాశం కల్పించింది. తాజాగా తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్గ్రామ స్థాయిలో పార్టీ పటిష్టతపై దృష్టి సారించారు. దీంతోనే శుక్రవారం గాంధీ భవన్‌లో డీసీసీ అధ్యక్షులతో పాటు రాష్ట్ర స్థాయి సంస్థాగత నిర్మాణ పరిశీలకులతో జూమ్ మీటింగ్నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా



ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ హాజరయ్యారు. ఈసందర్భంగా మీనాక్షి నటరాజన్డీసీసీ అధ్యక్షులు, పరిశీలకుల ద్వారా పలు అభిప్రాయాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే గ్రామ పంచాయతీలతోపాటు ఆ తరువాత వరుసగా మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, కొన్ని మునిసిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. వీటిలో సర్పంచ్‌ల పదవీకాలం 2024 ఫిబ్రవరికే ముగియగా.. అప్పటి నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోందన్న విషయాన్ని మీనాక్షి దృష్టికి తెచ్చారు.

స్థానిక సంస్థల తర్వాతే మండల కాంగ్రెస్ పార్టీ.

అయితే, గ్రామాల్లో పార్టీ పదవులపైనే ఆశలు పెట్టుకున్న నేతలు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం సిద్ధం అవుతున్నారు. ఇలాంటి తరుణంలో మండల కాంగ్రెస్పార్టీ నాయకత్వ నియమకాలు చేపడితే ఎలా ఉండనుందని మీనాక్షి డీసీసీ అధ్యక్షులు, పరిశీలకులను అడిగినట్టు తెలిసింది. ఒకవేళ ఇప్పటికిప్పుడు మండల కాంగ్రెస్పార్టీ నాయకత్వాన్ని ప్రకటిస్తే.. పదవులు దక్కని వారితో పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదమే ఎక్కువ ఉన్నదని అధినాయకత్వం ఒక ఆలోచనకు వచ్చినట్టు తెలిసింది. ఎందుకంటే, పదవులు దక్కని వారు వేరేతర పార్టీలో వెళ్లిపోతే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్పార్టీకి ఎదురుదెబ్బ తగిలే అవకాశముందని మీనాక్షి నటరాజన్భావించినట్టు సమాచారం. దీంతోనే ఆమె మండల కాంగ్రెస్పార్టీ నాయకత్వం ఇప్పుడు కాకుండా.. స్థానిక సంస్థల తర్వాతే చేపట్టడమే బెటరని డీసీసీ అధ్యక్షులు, పరిశీలకులతో వ్యాఖ్యానించినట్టు తెలిసింది. దీనికి అందరూ ఏకీభవించడంతో మండల కాంగ్రెస్పార్టీ నియమకాలు జోలికి వెళ్లవద్దని డిసైడ్అయిందని ఆ పార్టీ వర్గీయుల సమాచారం.

2017 నుంచి సర్పంచ్, ఎంపీటీసీల లిస్టు ఇవ్వండి.

ఇదిలాఉంటే.. 2017 సంవత్సరం నుంచి కాంగ్రెస్పార్టీల కొనసాగుతూ సర్పంచ్, ఎంపీటీసీలు గెలిచిన ప్రజాప్రతినిధులు, పోటీ చేసిన అభ్యర్థులు జాబితా ఇవ్వాలని డీసీసీ అధ్యక్షులు, పరిశీలకులను మీనాక్షి నటరాజన్కోరారు. వాస్తవానికి డీసీసీ అధ్యక్షులు, పరిశీలకులను ఏర్పాటు చేసిన అధిష్టానం మండల కాంగ్రెస్పార్టీకి సంబంధించిన ఇదివరకే ఒక్కో మండలం నుంచి నలుగురి చొప్పున పేర్లతో కూడిన జాబితాను సిద్ధం చేశారు. ప్రస్తుతానికి ఇంచార్జి మీనాక్షి నటరాజన్తీసుకున్న నిర్ణయంతో ఆయా జాబితా కాకుండా సర్పంచ్, ఎంపీటీసీలు గెలిచిన ప్రజాప్రతినిధులు, పోటీ చేసిన అభ్యర్థుల పేర్లు త్వరగా పేర్లు అందజేయాలని సూచించినట్లు తెలిసింది.

పదవుల్లో సామాజిక న్యాయం పాటించాం

కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తుందని ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. పార్టీలోనూ ప్రభుత్వంలోనూ పదవుల పంపిణీ సామాజిక న్యాయ పరంగా జరుగుతుందన్నారు.

రాహుల్ గాంధీ మార్గదర్శనంలో "సమాజంలో ఎవరి వాటా వారికే" అనే సిద్ధాంతంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. ఇప్పటివరకు ఇచ్చిన ప్రతి పదవిలోనూ సామాజిక న్యాయం పాటించామని, ఇకపై కూడా పార్టీ కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి సరైన గుర్తింపునిస్తూ ముందుకు తీసుకెళుతున్నామని చెప్పారు. పార్టీ కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, పదవులు లభిస్తాయని స్పష్టంగా పేర్కొన్నారు.

గ్రామ స్థాయిలో పకడ్బందీగా

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పకడ్బందీగా చేపట్టాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేతలకు సూచించారు. మండల, జిల్లా స్థాయి కమిటీల నిర్మాణం సకాలంలో పూర్తిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర పరిశీలకులు, కో-ఆర్డినేటర్లు నిబద్ధతతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను తెలంగాణలో విస్తృతంగా, విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఇతర రాష్ట్రాలకన్నా ముందుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఘనత మనదేనని పేర్కొన్నారు.

## ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ

ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ద్వారకా ప్రాంతంలోని అపార్ట్‌మెంట్‌లో మంటలు వ్యాపించాయి. ఆరో అంతస్తు నుంచి మంటలు ఎగసిపడుతున్నాయి. ఈ మంటల నుంచి తప్పించుకునేందుకు తొమ్మిదో అంతస్తు నుంచి కిందకు ఒక కుటుంబం దూకింది. ఈ సమయంలో కుటుంబంలోని ముగ్గురు మృతిచెందారు. తండ్రితో పాటు ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. ఈ సంఘటన స్థలానికి 8 అగ్నిమాపక యంత్రాలు చేరుకున్నాయి.మంటలను ఆర్పడానికి అగ్నిమాపక అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. స్థానికులు ఈ ప్రమాదంతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు సంఘటన స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. స్థానికులను సంఘటన స్థలం నుంచి దూరంగా పంపించి వేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కేటీఆర్ పై కేసు... భగ్గుమంటున్నకేడర్

హైదరాబాద్, జూన్ 14

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై మరో కేసు నమోదు అయింది. సీఎంను అసభ్యకరమైన వ్యాఖ్యలతో కించపరిచారనే ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందని మండిపడుతున్నారు. కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు ఈ నెల 11వ తేదీన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు బీఆర్కే భవన్‌కు వచ్చిన కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పరుషపదజాలంతో విమర్శలు చేశారు. కేసీఆర్ వెంట్రుక కూడా ఈ చిల్లరగాళ్లు పీకలేరంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కించపరుస్తూ మాట్లాడటమే కాకుండా వివిధ వర్గాలను రెచ్చగొట్టేలా చేశారని తన ఫిర్యాదులో వెంకట్ పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని వెంకట్ ఫిర్యాదుతో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు. సామాజిక మాధ్యమాల్లో వీడియోలను చూసిన పోలీసులు ఎఫ్ఐఆర్‌ఫైల్ చేశారు. ఈ కేసులో నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. కేసీఆర్ ఫార్ములా? ఈ కార్ రేస్ కేసులో విచారణ ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో ఇప్పటికే ఒకసారి అధికారులు



పిలిచి ప్రశ్నించారు. ఇప్పుడు మరోసారి విచారణకు రావాలని నోటీసులు ఇచ్చారు. సోమవారం ఉదయం 10గంటలకు ఏసీబీ ఆఫీస్‌లో విచారించనున్నారు. కేటీఆర్ ఈ కేసులో ఏ1గా ఉన్నారు. మే నెలలోనే విచారణ జరగాల్సి ఉంది. కానీ అప్పుడు కేటీఆర్ విదేశాల్లో ఉన్నందున విచారణకు రావడానికి వీలుకాదని చెప్పారు. దీంతో ఇప్పుడు మళ్లీ నోటీసులు జారీ చేశారు. ఇలా కేసుల మీద కేసులు పెడుతుండటంపై బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి. కక్ష సాధింపులకు ప్రభుత్వం పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ప్రశ్నించే గొంతుకలను ఇలా తొక్కిపెట్టాలని చూస్తోందని విమర్శిస్తున్నారు. ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో శ్రేణులపై కేసులు పెట్టి హింసించిన ప్రభుత్వం ఇప్పుడు అగ్రనాయకులను టార్గెట్ చేస్తోందని ఆరోపిస్తున్నారు నేతలు.

భారత శక్తి
VOICE OF INDIAN

# భారత్ రుద్రాస్త్ర, భార్గవాస్త్ర...

భారత సాయుధ దళాలు ఆధునిక యుద్ధ సాంకేతికతలో గణనీయమైన పురోగతి సాధిస్తున్నాయి. ఇప్పటికే దేశీయంగా అనేక ఆయుధాలు రూపొందించుకోవడంతోపాటు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. ఇదే సమయంలో విదేశాల నుంచి కూడా అవసరమైన ఆయుధాలు కొనుగోలు చేస్తోంది. ఈ క్రమంలో నాగ్‌పూర్‌కు చెందిన సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (రాఆంబ) రూపొందించిన 'రుద్రాస్త్ర' అనే హైబ్రిడ్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ మానవ రహిత విమానం (యూఏవీ)2025, జూన్ 11న రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో విజయవంతంగా పరీక్షించబడింది. దీనిని నిఘా, రక్షణ, గుర్తింపు, కచ్చితమైన దాడుల కోసం రూపొందించారు. ఇది భారత సైన్యానికి బహుముఖ సామర్థ్యాలను అందిస్తుంది. తాజా పరీక్ష భారత రక్షణ రంగంలో స్వదేశీ సాంకేతికత అభివృద్ధి, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి ఒక మైలురాయిగా నిలుస్తుంది.రుద్రాస్త్ర యూఏవీ 50 కిలోమీటర్ల మిషన్ పరిధిలో అద్భుతమైన పనితీరును ప్రదర్శించింది, రియల్?టైమ్ వీడియో ఫీడ్‌ను స్థిరంగా అందించడంతోపాటు, సురక్షితంగా లాంచింగ్ పాయింట్‌కు తిరిగి వచ్చింది. లక్ష్యంపై చక్కర్లు కొట్టే సామర్థ్యంతో దీని మొత్తం పరిధి 170 కిలోమీటర్లకు చేరుకుంటుంది. ఇది 1.5 గంటల పాటు నిరంతరాయంగా గగనతలంలో ప్రయాణించగలదు. పరీక్ష సమయంలో, ఈ యూఏవీ యాంటీ?పర్సనల్ వార్‌హెడ్‌ను అత్యంత కచ్చితత్వంతో లక్ష్యంపై ప్రయోగించి, భూమికి సమీపంలో ఉన్నప్పుడు పేల్చడంలో విజయవంతమైంది. ఈ పరీక్ష భారత సైన్యం నిర్దేశించిన కఠిన ప్రమాణాలను అందుకుంది, ఈ రుద్రాస్త్ర బహుముఖ సామర్థ్యాలను నిరూపించింది.భారత్ డ్రోన్ యుద్ధ సాంకేతికతలో వేగంగా ముందుకు సాగుతోంది. రుద్రాస్త్రతోపాటు, సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ మరో కీలకమైన ఆయుధం, 'భార్గవాస్త్ర' అనే యాంటీ?డ్రోన్ వ్యవస్థను 2025 మే 13న ఒడిశాలోని సీవార్డ్ ఫైరింగ్ రేంజ్‌లో విజయవంతంగా పరీక్షించింది. ఈ వ్యవస్థ డ్రోన్ సమూహాలను నిష్క్రియం చేయడానికి మైక్రో?రాకెట్లను ఉపయోగిస్తుంది, ఇది ఆధునిక యుద్ధంలో డ్రోన్ బెదిరింపులను ఎదుర్కోవడానికి కీలకమైన సాధనంగా నిలుస్తుంది.డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ రుస్తుం సిరీస్ డ్రోన్లను అభివృద్ధి చేస్తోంది, ఇవి మధ్యస్థ ఎత్తులో ఎక్కువ సమయం ప్రయాణించే సామర్థ్యంతో రూపొందించబడ్డాయి. ఇవి నిఘా, యుద్ధం సామగ్రి సరఫరా కోసం ఉపయోగపడతాయి. అదానీ డిఫెన్స్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ వంటి ప్రముఖ సంస్థలు కూడా అధునాతన డ్రోన్ తయారీలో పాల్గొంటున్నాయి. ఇవి సరిహద్దు రక్షణ, యుద్ధ వ్యూహాలను మెరుగుపరుస్తున్నాయి.2025 మేలో జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో, ఇజ్రాయెల్ సాంకేతికత సహాయంతో బెంగళూరులోని ఆల్ఫా డిజైన్ టెక్నాలజీస్ రూపొందించిన స్కైస్ట్రైకర్ కామికేజ్ (ఆత్మాహుతి) డ్రోన్లను భారత సైన్యం విజయవంతంగా ఉపయోగించింది. ఈ డ్రోన్లు పాకిస్థాన్ రాడార్లు, కాన్వాయ్‌లు, ఇతర కీలక స్థావరాలను నాశనం చేశాయి. ఇది భారత్ డ్రోన్ యుద్ధ సామర్థ్యాలను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా చేసింది.రుద్రాస్త్ర యూఏవీ, భార్గవాస్త్ర వంటి స్వదేశీ వ్యవస్థలు భారత రక్షణ రంగంలో సాంకేతిక స్వావలంబన దిశగా దూసుకెళ్తున్నాయి. ఈ వ్యవస్థలు ఆధునిక యుద్ధంలో కీలకమైన డ్రోన్ బెదిరింపులను ఎదుర్కోవడంతోపాటు, నిఘా, కచ్చితమైన దాడులు, సరిహద్దు రక్షణలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి. ఆఖీఆా, రాఆంబ ఇతర సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ, భారత సైన్యాన్ని అత్యాధునిక యుద్ధ సామర్థ్యాలతో బలోపేతం చేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో స్కైస్ట్రైకర్ డ్రోన్ల వినియోగం భారత్?ఇజ్రాయెల్ సాంకేతిక సహకారం ఫలితాలను ప్రదర్శించింది. ఈ విజయాలు భారత్‌ను డ్రోన్ యుద్ధ సాంకేతికతలో ప్రపంచ నాయకుడిగా నిలపడానికి దోహదపడతాయి. అయితే, ఈ సాంకేతికతలను మరింత సమర్థవంతంగా, స్థిరమైన ఉత్పత్తి, శిక్షణతో అమలు చేయడం భవిష్యత్తులో కీలకం.రుద్రాస్త్ర, భార్గవాస్త్ర, స్కైస్ట్రైకర్ వంటి డ్రోన్ వ్యవస్థలు భారత రక్షణ రంగంలో స్వదేశీ సాంకేతికత, అంతర్జాతీయ సహకార సమ్మేళనాన్ని సూచిస్తున్నాయి. ఈ పురోగతులు భారత సాయుధ దళాలను ఆధునిక యుద్ధ సవాళ్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం చేస్తూ, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేస్తున్నాయి.

# గంటలో దర్శనానికి ప్లాన్

తిరుమల, జూన్ 14,

తిరుమల శ్రీవారి దర్శనానికి ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. ప్రతి ఏడాది స్వామి వారిని దర్శించుకునే వారు ఉంటారు. రోజుకు గరిష్టంగా లక్షలాదిమంది.. కనిష్టంగా వేలాది మంది భక్తులు తిరుమల వస్తుంటారు. వారికి దర్శనాలు కల్పించడంతోపాటు నియంత్రించడం టిటిడి కి కష్ట సాధ్యం అవుతుంది. పటిష్టమైన చర్యలు చేపడుతున్న ఎక్కడో చోట లోపాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని సందర్భాల్లో క్యూ లైన్లోకి మించి బయటకు భక్తులు వస్తుంటారు. కొన్ని సందర్భాల్లో అయితే గంటలపాటు కాంప్లెక్స్ లలో భక్తులు వేచి ఉండాల్సి ఉంటుంది. ఇటువంటి తరుణంలో వినూత్న ఆలోచన చేసింది తిరుమల తిరుపతి దేవస్థానం. భక్తులు క్యూ లైన్ లలో ఉండగానే స్వామి వారి దర్శన భాగ్యం కల్పించేందుకు నిర్ణయించింది.సాధారణంగా తిరుమల వెళ్లే భక్తులకు స్వామివారి దర్శనానికి కొన్నిసార్లు 12 గంటల సమయం పడుతుంది. ఆ సమయంలో భక్తుల బాధలు వర్ణనాతీతం. టీటీడీ( పరంగా మంచినీరు, మజ్జిగ వంటి సదుపాయాలు అందిస్తోంది. కానీ క్యూలైన్లలో భక్తులు ఉన్నప్పుడు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. అటువంటి సమయంలో స్వామివారి దర్శనానికి వీలుగా ఏర్పాట్లు చేసింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఇటీవల చైర్మన్ బిఆర్ నాయుడు అధ్యక్షతన బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం కీలక నిర్ణయం తీసుకున్నారు. అందుకు సంబంధించి టీటీడీ ఈవో శ్యామలరావు కార్యాచరణను వేగవంతం చేశారు. ముఖ్యంగా భక్తులు వేచి ఉండే కంపార్ట్మెంట్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల మధ్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారుఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కెమెరాలు ద్వారా తిరుమల వచ్చే భక్తుల రద్దీ ని అంచనా వేయనున్నారు టీటీడీ అధికారులు. తద్వారా భక్తులకు దర్శన సమయాన్ని నిర్దిష్టంగా ఇవ్వనున్నారు. ప్రస్తుతం గంటకు ఎంతమంది శ్రీవారిని దర్శించుకుంటున్నారనే సమాచారం టిటిడి వద్ద లేదు. ఆ వివరాలు అందుబాటులోకి వస్తే దళారులు, కొందరు ఉద్యోగుల సహకారంతో ఇష్టారాజ్యంగా క్యూ లైన్లోకి వచ్చే సంస్కృతికి బ్రేక్ పడుతుంది. జియో సంస్థ ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫేషియల్ రికగ్నిషన్ ను ఉపయోగించి భక్తుల మొక్క చిత్రాలు నమోదు చేస్తుంది. తద్వారా గంటల వ్యవధిలోనే తిరుమల శ్రీవారి దర్శనం పూర్తి చేసుకునే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోంది తిరుమల తిరుపతి దేవస్థానం. ఇదే విషయాన్ని తాజాగా వెల్లడించారు టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడు.

# ఏపీలో నాలా చట్టం రద్దు..

విజయవాడ, జూన్ 14,

ఏపీ రెవెన్యూ వ్యవస్థలో కీలక మార్పులు రానున్నాయి. నాలా చట్టం రద్దుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. దీనిపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ? లోతుగా అన్ని విషయాలను పరిశీలిస్తోంది. తుది ముసాయిదా ప్రతిపాదనల రూపకల్పనకు కేబినెట్ సబ్ కమిటీ ఆదేశాలు ఇచ్చిందివ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్పిడి చేసుకునేందుకు ఉద్దేశించిన ఏపీ అగ్రికల్చర్ ల్యాండ్(కన్వర్షన్ ఆఫ్ నాన్ అగ్రికల్చరల్ పర్పసెస్) యాక్ట్ 2006ను రద్దు చేసేందుకు విధివిధానాలు రూపొందించనున్నారు. ఈ మేరకు మంత్రివర్గం ఉపసంఘం ఆదేశాలను జారీచేసింది.వ్యవసాయేతర అవసరాలకు భూములను మార్పిడి చేసుకునేందుకు నాలా చట్టం వల్ల ఇప్పటి వరకు అనేక రకాల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలోనే దీన్ని రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు? మూడో కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ప్రకటించారు. ఇదే విషయంతో పాటు రెవెన్యూ శాఖలో తీసుకురావాల్సిన అంశాలపై కేబినెట్ సబ్ కమిటీ కూడా ఏర్పాటైంది.ఆరుగురు మంత్రులతో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో మూడోసారి భేటీ అయ్యింది. రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన ఈ భేటి జరిగింది. ఇందులో అనగాని సత్యప్రసాద్ తోపాటు మంత్రులు పయ్యావుల కేశవ్, పి.నారాయణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు నాలాను రద్దు చేసి ప్రజలు ట్యాక్స్ కట్టేస్తే ఆటోమేటిక్ గా భూ మార్పిడి జరిగేలా ముసాయిదా విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రులు చెప్పారు. భూ మార్పిడి అత్యంత సులభంగా జరగాలని అభిప్రాయపడ్డారు. కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా ఎలా చేయాలనే దానిపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.తదుపరి సమావేశంలో అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలపై చర్చించనున్నారు. నిర్ణయించిన విధివిధానాలను మంత్రివర్గం ముందు పెడతామని మంత్రులు చెప్పారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ?. ప్రజలకు ఇబ్బందిగా మారిన నాలాను రద్దు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అంతేకాక నాలా ట్యాక్స్ కూడా ఎక్కువగా ఉందని పలు సంఘాల నుండి అభ్యంతరాలు వచ్చాయన్నారు. ఆ ట్యాక్స్ ను కూడా ఎంతమేరకు తగ్గించవచ్చో ప్రతిపాదనలు ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. వీలైతే ఈ ప్రతిపాదనలను జూన్ 19న జరిగే మంత్రివర్గ సమావేశంలో పెట్టి చర్చిస్తామని తెలిపారు.

# ఖరీఫ్ ప్రణాళికలు రెడీ

ఏలూరు, జూన్ 14, (

ఖరీఫ్ పంటలను తుఫాన్ల నుంచి రక్షించుకునేలా పంటకాలాన్ని ముందుకు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు కార్యాచరణ మొదలుపెట్టారు. ఇందుకు అనుగుణంగా గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాలకు ఈ ఏడాది ముందుగానే సాగునీరు విడుదల చేశారు.. పశ్చిమ గోదావరి, ఏలూరు, కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ, కృష్ణా జిల్లాల్లో భూములకు కాలువల ద్వారా ఇప్పటికే నీరు విడుదల చేశామని అధికారులు తెలిపారు. జూలై మొదటివారంలో గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు నీరు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు.రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వరి, కందులు, వేరుశనగ, ప్రత్తిసాగు చేస్తుండగా... వేరుశనగ, ప్రత్తి సాగు తగ్గుతూ వస్తోందని పేర్కొన్నారు. కందుల సాగుమాత్రం పెరిగిందని? వరి సాగు స్థిరంగా కొనసాగుతోందని అధికారులు చెప్పారు 20 ఏళ్లుగా పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్ 14 తుఫాన్లను ఎదుర్కొంది. వీటిలో 5 తుఫాన్లు అక్టోబర్‌లో, 6 తుఫాన్లు నవంబర్‌లో, 3 తుఫాన్లు డిసెంబర్‌లో రాష్ట్రంపై ప్రభావం చూపాయి. అక్టోబర్‌లో వచ్చే తుఫాన్లు ఎక్కువగా ఉత్తర కోస్తా, తూర్పుగోదావరి జిల్లాలకు నష్టం కలిగించాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో తుఫాన్ల ప్రభావం తగ్గేలా ఖరీఫ్ సాగు ఉండాలని అధికారులకు సీఎం సూచించారు365 రోజులు సాగుభూములు పచ్చగా ఉండేలా చూడాలని... ఇందుకోసం 3 పంటల విధానం తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు? అధికారులకు సూచించారు. వచ్చే ఏడాది వేసవిలో ఉత్తర కోస్తా, గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాల్లోని 5 లక్షల ఎకరాల్లో వేసవి పంటలు వేయాలని చెప్పారు. అనంతపురం వంటి జిల్లాల్లో 365 రోజుల్లో కేవలం 4 నెలలే పంటలు సాగు చేసి, 8 నెలల పాటు భూములు ఖాళీగా వదిలేస్తున్నారని...దీనివల్ల భూసారం దెబ్బతింటోందని ప్రస్తావించారు. అలాకాకుండా మిగిలిన 8 నెలలు కూడా ఏదో ఒక పంట సాగు చేసే పరిస్థితులు కల్పించాలని చెప్పారు.వచ్చే వేసవిలో జలవనరుల లభ్యత ఉన్న 141 మండలాల్లోనూ పంటల సాగు జరిగేలా రైతుల్ని సన్నద్ధం చేయాలన్నారు. ఇందులో 19 మండలాలు రిజర్వాయర్లు, 57 మండలాలు చెరువులు, 65 మండలాలు భూగర్భ జలాలపై ఆధారపడి ఉన్నాయని... వీటిని వినియోగించుకుని దిగుబడులు సాధించాలన్నారు. అలాగే వరిలో అధిక డిమాండ్ ఉన్న సన్నరకాలను పండిచేలా రైతులను ప్రోత్సహించాలని దిశానిర్దేశం చేశారు.హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళు పర్చూరు ఏఎంసీలో ప్రారంభించామని, దీనిపై రైతుల్లో సంతృప్తి వ్యక్తమైందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. హెచ్డీ బర్లీ స్థానంలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కోకో, మామిడి కొనుగోళ్ల వివరాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. మరోవైపు వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర ద్వారా కొత్తగా వ్యవసాయ శాఖకు సంబంధించి 3 సేవలు అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు.ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని సీఎం చంద్రబాబు సూచించారు. భూసారాన్ని కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఎక్కడా ఎరువుల కొరత లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంపై తాజా సమాచారం ఉండాలన్నారు. రాష్ట్రంలో గత ఏడాది పంటకాలంలో 39 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా, ఈ ఏడాది దానిని 35 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గించేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

# ఏ.డీ./డీఐ పిఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన పద్మజ

బద్వేలు జూన్ 14,

వైయస్సార్ కడప జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ జిల్లా సహాయ సంచాలకులు (ఏ.డి.)గా పద్మజ బాధ్యతలను స్వీకరించారు.అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్ పద్మజ మాట్లాడుతూ..



చిత్తూరు జిల్లా లో సహాయ సంచాలకులు (ఏ.డి.)గా విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం సాధారణ బదలీపై కడప జిల్లాకు రావడం జరిగిందన్నారు. ఈ జిల్లాలో ఏ.డీ.గా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సలహాలు, సూచనలు పాటిస్తూ.. శాఖా పరంగా, జర్నలిస్టుల సంక్షేమానికి, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, అధికార కార్యక్రమాలను మీడియా ద్వారా మరింత విస్తృతం చేస్తామన్నారు. ఈ కార్యాలయంలో అందరూ బాధ్యతాయుతంగా కలిసికట్టుగా కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ జిల్లా అభివృద్ధిలో తమవంతు భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.ఈ సందర్భంగా ఏ.ఈ.ఐ.ఈ శ్రీనివాస రావు, డివిజనల్ పిఆర్వో సునీల్ సాగర్, పిఆర్వో రవికుమార్,ఏవీఎస్ నాగయ్య, రికార్డ్ అసిస్టెంట్ ఈశ్వరయ్య, ఇతర సిబ్బంది ఏడికి అభినందనలు తెలియజేశారు.

# అంగరంగ వైభముగా స్వామి వారి నిత్య కల్యాణం

సింహాచలం

ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింప జేశారు నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల,గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచ రాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన,పుణ్యాహ వచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు కంకణ ధారణ నూతన యజ్ఞోపవీత సమర్పణ,జీలకర్రబెల్లం, మాంగళ్య ధారణ,తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు స్వామివారి ప్రసాదాలను అందజేశారు అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

# అప్పన్న సేవలో ప్రముఖులు

సింహాచలం

శనివారం విశాఖనగర మేయర్ పీలా శ్రీనివాసరావు ఎంఎల్ సి మంతెన సూర్య నారాయణ రాజు,ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్ మారీ టైన్ బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య స్వామివారిని దర్శించు కున్నారు వీరికి ప్రోటోకాల్ సహాయకార్య నిర్వహణాధి కారి నక్కన ఆనందకుమార్ ఆలయ ధ్వజస్తంభం వద్ద స్వాగతం పలికి నాదస్వర వేద మంత్రాలతో ఆలయం లోనికి తీసుకువెళ్లే ముందుగా కప్పస్తంభము ఆలింగనము తదుపరి బేడా మండపము ప్రదక్షణ తదుపరి స్వామివారి దర్శనము అనంతరము వేద పండితులచే వేద ఆశీర్వ చనము అనంతరము ప్రోటో కాల్ సహాయ కార్యనిర్వహణ అధికారి స్వామివారి పటము ప్రసాదాలను బహుకరించారు

# విద్యుత్ వైర్లు తగలడంతో టిప్పర్ దగ్ధం: డ్రైవర్ మృతి

సంగారెడ్డి

కాజిపల్లి గ్రామంలో ఉన్న బిల్వాని కంకర క్రెషర్లో అగ్నిప్రమాదం సంభవించింది. హైటెన్షన్ విద్యుత్ వైర్లు టిప్పర్ కు తగలడంతో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. ఘటనలో టిప్పర్ పూర్తిగా దగ్ధం అయింది. మంటల్లో

చిక్కుకుని డ్రైవర్ రాంసుజన్ మృతి చెందాడు. మృతుడు మృతుడు మధ్యప్రదేశ్ కు చెందిన వ్యక్తి. ఐడీఏబొల్లారం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పోలవరం ప్రాజెక్ట్ ను సందర్శించిన సి డబ్ల్యూ సి బృందం

పోలవరం, జూన్ 14:

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతాన్ని శనివారం కేంద్ర జలసంఘం బృందం సందర్శించింది. జలసంఘం సభ్యుడు యోగేష్ పైథాంకర్ చీఫ్ ఇంజనీర్ హెచ్ ఎస్ సెనేగర్, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ చీఫ్ ఇంజనీర్ రమేష్ కుమార్లతో కూడిన బృందం ప్రాజెక్ట్ ను సందర్శించింది.పోలవరం ప్రాజెక్ట్ లో జరుగుతున్న డయాఫ్రమ్ వాల్, బాట్రస్ డామ్, గ్యాప్ 1 పనులు, ఎగువ, దిగువ కాఫర్ డామ్,స్పిల్ వే లను బృందం పరిశీలించింది.బట్రస్ డామ్, డయాఫ్రమ్ వాల్ నిర్మాణ తీరు గురించి జలవనరుల శాఖ అధికారులు ఎవనిటతీజీ బృందానికి వివరించారు. నిర్దేశిత లక్ష్యం మేరకు ప్రాజెక్టు పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని అధికారులను వారు కోరారు .కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనులు చేస్తున్నాయని జలవరుల శాఖ అధికారులు వివరించారు.

ఈ బృందం వెంట పోలవరం ఈఎన్సి కే నరసింహమూర్తి, ఈఈలు డి శ్రీనివాస్, కే బాలకృష్ణ, డిఈలు అనీల్ కుమార్, శ్రీరాం పటేల్,మల్లికార్జున్, ఏఈఈలు అనీల్ కుమార్, పద్మ కుమార్, సురేష్, అరుణ్, కుమారస్వామి, పోలవరం ప్రాజెక్టు ఎం ఈ ఐ ఎల్ జిఎం గంగాధర్, డిజిఎం మురళి పమ్మి , పాండే, వెంకటేష్ ఉన్నారు.

# చైన్ స్నాచర్ గుట్టు రట్టు

గుంటూరు

చైన్ స్నాచర్ ను పోలీసులు అరెస్టు చేసారు. అమీర్ బేగ్ పలు చైన్ స్నాచింగ్, బైక్, హత్య నేరాలలో నిందితుడు.. మహిళలు వృద్ధులే టార్గెట్ గురువారం రోజున మాత్రమే నేరాలకు పాల్పడటం విశేషం. సెప్టెంబర్2024నుంచి చైన్ స్నాచింగ్ నగరంలో సాయంత్రం సమయంలో జరుగుతున్నాయి. 7 చోట్ల చైన్ స్నాచింగ్, 2చోట్ల బైక్ దొంగతనాలను ఒక్కరు గా నే నేరాలకు పాల్పడుతున్నారు.గతంలోనే 22 చైన్ స్నాచింగ్ కేసులలో ముద్దాయిగా ఉన్న ఇతను వ్యసనాలకు బానిసగా మరి విడతల వారిగా దొంగతనాలకు అలవాటు పడి ఇలా చేస్తున్నాని ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడించారు.ఎస్పీ మాట్లాడుతూ నిందితుడినుంచి 30లక్షల విలువచేసే 300గ్రాముల బంగారు ఆభరణాలు,ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకొన్నామన్నారు.

# పోలీసుల నోటీసులపై స్పందించిన దర్శి వైకాపా ఎమ్మెల్యే

ఒంగోలుదర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ తనకు పోలీసుల నోటీసులపై స్పందించారు. నేను హైదరాబాద్లోనే ఉన్నా.. ఎక్కడికీ పారిపోలేదని అన్నారు. విచారణకు ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తా. జగన్ పర్యటనలో శాంతిభద్రతలు కాపాడలేకపోయానని, నాకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. జగన్ పర్యటనకు అన్ని అనుమతులూ తీసుకున్నాం. శాంతిభద్రతలు కాపాడాల్సింది పోలీసులు.. నేను కాదని అన్నారు.

## దమ్ముంటే నిరూపించండి వైసీపీకి లోకేష్ మరో సవాల్

అమరావతి: తల్లికి వందనం డబ్బుల్లో రూ.2వేలు తన ఖాతాలో పడుతున్నట్లు చేస్తున్న ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలని, లేకుంటే చట్టప్రకారం ముందుకు వెళతానని విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ వైసీపీకి సవాల్ విసిరారు. "తల్లికి వందనం పథకంలో రూ.2 వేలు లోకేష్ ఎకౌంటులో పడుతున్నాయని ఫేక్ ప్రచారం చేస్తున్నారు. మీకు 24 గంటలు టైం ఇస్తున్నా.. దమ్ముంటే, అది నిరూపించండి. లేదంటే తప్పు అయిపోయిందని ఆ స్టేట్మెంట్ వెనక్కి తీసుకోండి. లేదంటే, మీ పైన చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి. మీ ఫేక్ ప్రచారంపై కఠినమైన చర్యలు ఉంటాయి" అని వైసీపీని మంత్రి లోకేష్ హెచ్చరించారు.

## రైల్వే రిజర్వేషన్ కోసం ప్రయాణికుల కష్టాలు

విజయవాడ విజయవాడలో రైల్వే రిజర్వేషన్కోసం ప్రయాణికులు నానా కష్టాలు పడుతున్నారు. రిజర్వేషన్ కోసం వచ్చిన ప్రయాణికులకు అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. ప్రయాణికులు రద్దీగా ఉన్నా ఆ రెండు కౌంటర్లు కు మాత్రమే అనుమతులు ఇవ్వడంలో రిజర్వేషన్ కోసం క్యూలైన్లో వేచి ఉన్న ప్రయాణికుల మధ్య ఘర్షణకు దారి తీస్తున్నాయి. ఇంత జరిగినా అధికారులు చోద్యం చూస్తున్నారు. తాజాగా శనివారం నాడు ఒక ప్రయాణికుని తోటి ప్రయాణికులు చితకబాదారు. రిజర్వేషన్ కోసం ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అదనపు కౌంటర్ లో ఉన్న రిజర్వేషన్ కౌంటర్లు పని చేయడంలేదు. అదనపు కౌంటర్లు అందుబాటులోకి తేవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## తాళ్లరేవు ప్రభుత్వ ఆసుపత్రిలో ఘోరం

కాకినాడతాళ్లరేవు ప్రభుత్వ ఆసుపత్రి లో దారుణం జరిగింది. డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో స్వీపరు డెలివరీ చేయడంతో బిడ్డ మృతిచెందిన ఘటన చోటు చేసుకుంది. చినబొడ్డు వెంకటాయపాలెంకు చెందిన చెక్కా మాధురి నెలలు నిండడంతో పురుపోసుకోవడానికి ప్రభుత్వ ఆసుపత్రికి రాగా, డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో స్వీపరు డెలివరీ చేసింది. అందువల్ల బిడ్డ మృతిచెందిందని తమకు న్యాయం చేయాలంటూ బాధితురాలి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

## లారీ ఆర్టీసీ బస్ ఢీ

ఖమ్మం ఖమ్మం జిల్లాకామేపల్లి మండలం మద్దిగూడెం సమీపంలో ఆర్టీసీ బస్సు... సిమెంట్ యాష్ లారీ ఢీకొనడంతో ఇరువురు డ్రైవర్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. బస్ లోని ప్రయాణికులకు గాయాలైనాయి. వారిని చికిత్స నిమిత్తం ఖమ్మం వైద్యశాలకు తరలించారు. ఇల్లందు మీదుగా కోదాడ వెళుతున్న లారీని ఖమ్మం నుండి ఇల్లందు వస్తున్న ఆర్టీసీబస్ ఢీకొట్టింది. లారీ ముందు ఉన్న వాహనాన్ని ఓవర్ టెక్ చేయబోయి ఆర్టీసీ బస్ ను ఢీ కొట్టాడు. లారీ డ్రైవర్, బస్ డ్రైవర్ లు ఇద్దరు క్యాబిన్ లో ఇరుక్కున్నారు. అతికష్టం మీద డ్రైవర్ల ను బయటకు తీసి చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల కు తరలించారు. బస్ లో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈప్రమాదంతో ఇరువైపులా నిలిచిపోయిన వాహనాలు ట్రాఫిక్ ని పోలీసులు క్రమబద్దీకరించారు.

## బావిలో పడి చుక్కల దుప్పి మృతి

నిర్మల్ దస్తురాబాద్ మండలం ఆకొండ పెట్ గ్రామ శివారులో కుక్కలు తరమగా చుక్కల దుప్పి వచ్చి వ్యవసాయ బావి లో పడింది. స్థానికులు సమాచారం ఇచ్చినప్పటికీ ఫారెస్ట్ అధికారులు సమయానికి రాలేదు. పట్టించుకోలేదు. స్థానికులు బైటకు తీసేలోపే ప్రాణాలు చుక్కల దుప్పి వదిలింది. స్థానికంగా సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్ న్యామనుద్దీన్ అధికారులు ఉండక పోవడంతోనే చుక్కల దుప్పి బలైందని గ్రామస్తుల ఆరోపణ.సెక్షన్ ఆఫీసర్ ను వివరణ కోరగా మాట దాటు వేస్తున్నారని అన్నారు. ఇలాంటి అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్ చేస్తున్నారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం...

విజయవాడ, జూన్ 14

అగ్రిగోల్డ్ బాధితులకు గుడ్న్యూస్. దశాబ్దాల పోరాటానికి త్వరలో న్యాయం జరగనుంది. కడుపుకట్టుకుని కూడబెట్టుకున్న సొమ్ము.. మళ్లీ తిరిగి ఇచ్చేందుకు సర్వం సిద్ధమవుతోంది. మరి బాధితులకు ఏవిధంగా నష్టపోయిన సొమ్ము అందించనున్నారు. దీనికి ప్రభుత్వ కార్యాచరణ ఎలా ఉండబోతోంది..? తెలుసుకుందాం..ఆస్తుల పునరుద్ధరణ ద్వారా ఊరట లభించింది. ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ద్వారా జప్తు చేసిన అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులను బాధితులకు పంపిణీ చేయడానికి కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ ఆస్తుల మార్కెట్ విలువ సుమారు రూ. 6 వేల కోట్లుగా అంచనా వేయడం జరిగింది. ఈడీ హైదరాబాద్ జోన్ కార్యాలయం, అగ్రిగోల్డ్ గ్రూప్ కంపెనీలు నడిపిన పాంజీ స్కీమ్ బాధితులకు సంబంధించి రూ.611 కోట్ల విలువైన ఆస్తులను పునరుద్ధరించడం ద్వారా మరోసారి విజయాన్ని సాధించింది. అటాచ్మెంట్ సమయంలో వీటి విలువ రూ.611 కోట్లు కాగా, ప్రస్తుత మార్కెట్ విలువ రూ.1,000 కోట్లు మించిపోయే అవకాశం ఉందిఈ ఏడాది మే నెలలో ఈడీ, మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) 2002 సెక్షన్ 8(8) కింద ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఇందులో అటాచ్ చేసిన స్థిర, చర ఆస్తులను ఆంధ్రప్రదేశ్ సీఐడీకి విడుదల చేసి, ఆస్తులను బాధితులకు తిరిగి అప్పగించే నిమిత్తంగా ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్మెంట్ డిపాజిటర్ల పరిరక్షణ చట్టం (ఏపీపీఐడీఎఫ్ఈ), 1999 ప్రకారం పునరుద్ధరించాలని కోరింది. హైదరాబాద్లోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు, ఈ పిటిషన్ను జూన్ 10, 2025న ఆమోదించింది. ఈ మేరకు 397 స్థిర ఆస్తుల పునరుద్ధరణకు మార్గం సుగమం అయింది. వీటిలో 380 ఆస్తులు ఆంధ్రప్రదేశ్లో, 13 తెలంగాణలో, 4 కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్నాయి. వీటిలో వ్యవసాయ భూములు, నివాస, వాణిజ్య స్థలాలు, అపార్ట్మెంట్లు ఉన్నాయిఅగ్రిగోల్డ్ గ్రూప్పై ఈడీ 2018లో దర్యాప్తు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, అండమాన్ & నికోబార్ లలో నమోదైన పలు ఎఫ్ఐఆర్ల ఆధారంగా ఈ కేసు విచారణకు వచ్చింది. అగ్రిగోల్డ్ కంపెనీలు అసలైన రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో పాంజీ స్కీమ్ నడిపి దాదాపు 19 లక్షల ఖాతాదారుల నుండి రూ.6,380 కోట్లను వసూలు చేశాయి. 130కి పైగా కంపెనీలను ఏర్పాటు చేసి ప్రజల వద్ద నుండి 'ప్లాట్ అడ్వాన్స్' పేరుతో డిపాజిట్లు వసూలు చేశారు. వేలాది కమిషన్ ఏజెంట్లను నియమించి ప్రజలను మోసం చేశారు. ఈ డబ్బులను వారు ప్రజలకు తెలియకుండా పవర్, డైరీ, ఆరోగ్యం, ఎంటర్టైన్మెంట్, వ్యవసాయ రంగాల్లో పెట్టుబడులు పెట్టారు. ఒప్పందం ప్రకారం డబ్బును వెనక్కి ఇవ్వడంలో విఫలమయ్యారు.ఆస్తుల విలువ: ఈడీ దర్యాప్తులో భాగంగా దాదాపు రూ.4141.2 కోట్ల విలువైన స్థిర, చర ఆస్తులను అటాచ్ చేసింది. 2020 డిసెంబర్లో అవ్వ వెంకట రామారావు, అవ్వ శేషు నారాయణ రావు, అవ్వ హేమ సుందర వర ప్రసాద్ను అరెస్ట్ చేసింది. 2021 ఫిబ్రవరిలో 14 మందిపై ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. 2024 మార్చిలో మరో 22 మందిపై సప్లిమెంటరీ చార్జ్షీట్ సమర్పించారు.అంతకు ముందు 2025 ఫిబ్రవరిలో రూ.3,339 కోట్ల విలువైన ఆస్తులను బాధితులకు పునరుద్ధరించారు (ప్రస్తుత విలువ రూ.6,000 కోట్లు). తాజా పునరుద్ధరణతో కలిపి మొత్తం రూ.3,950 కోట్ల విలువైన ఆస్తులు బాధితులకు తిరిగి అప్పగించబడ్డాయి. వాటి ప్రస్తుత మార్కెట్ విలువ రూ.7,000 కోట్లకు పైగా ఉంటుంది. ఈ చర్యలు నేరస్థుల వద్ద నుండి దోచుకున్న ఆస్తులను తిరిగి న్యాయబద్ధంగా బాధితులకు అప్పగించడంలో ఈడీ తీసుకున్న ప్రాముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు.అగ్రిగోల్డ్ స్కామ్ బాధితులకు ఈడీ ఆస్తుల పంపిణీ ప్రక్రియ ఒక చారిత్రక అడుగుగా నిలుస్తుంది. రూ. 7,000 కోట్లకు పైగా విలువైన ఆస్తులను బాధితులకు అందించే ఈ ప్రక్రియ, దశాబ్దకాలంగా కొనసాగుతున్న న్యాయ పోరాటానికి ఒక సానుకూల మలుపు. రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు, ఈడీ, సీఐడీ సమన్వయంతో ఈ ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారా బాధితులకు త్వరిత న్యాయం అందుతుందని ఆశిస్తున్నారు. ఈ కృషి, ఆర్థిక మోసాల బాధితులకు న్యాయం అందించడంలో ఒక ఆదర్శంగా నిలుస్తుంది, అలాగే భవిష్యత్తులో ఇలాంటి స్కామ్లను నిరోధించేందుకు కఠిన చర్యల అవసరాన్ని గుర్తు చేస్తుంది.

# ట్రెండింగ్ లో కేసీఆర్ జగన్ కం బ్యాక్ ...

హైదరాబాద్, జూన్ 14

అధికారం కోసం రాజకీయ పార్టీలు ఏమైనా చేస్తాయి. ఎలాంటి పనులకైనా పాల్పడుతుంటాయి. ఎందుకంటే అధికారం అనేది మత్తు లాంటిది. అధికారమనేది మంత్రదండం లాంటిది. దానివల్ల వెనకేసుకోవచ్చు.. దాచుకోవచ్చు.. గిట్టని వాళ్లను పాదాల కింద తొక్కవచ్చు. అందువల్లే రాజకీయ నాయకులు అధికారం కోసం అర్రులు చాస్తూ ఉంటారు.వెనకటి కాలంలో అధికారం కోసం రాజకీయ నాయకులు విస్తృతంగా ప్రచారాలు నిర్వహించేవారు. కార్యకర్తలతో మంతనాలు జరిపేవారు. పై స్థాయి నాయకులతో భేటీలు నిర్వహించేవారు. కానీ ఇప్పుడు రాజకీయాల ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది కదా. రాజకీయాలు చేసే తీరు పూర్తిగా వేరే తీరు సంతరించుకుంది కదా. అందువల్లే రాజకీయ నాయకులు తమ సిద్ధాంతాలను మార్చేసుకున్నారు. తమ వ్యూహాలకు వేరే విధంగా పదును పెట్టుకున్నారు. సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత రాజకీయ నాయకులు మరింతగా మారిపోయారు. ఒకరకంగా చెప్పాలంటే ప్రజలతో సంబంధాలు నెరిపే కంటే.. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ జాబితాలో ఈ నాయకుడు ఆ నాయకుడు అని తేడా లేదు.. అందరూ అలానే ఉన్నారు.అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు గుర్తుకురారు. కేవలం వారి సొంత ప్రయోజనాలు మాత్రమే నాయకులకు గుర్తుకు వస్తుంటాయి. అధికారం దూరమైతే వారికి ప్రజలు గుర్తుకు వస్తుంటారు. ముందుగానే చెప్పినట్టు ఈ కాలంలో సామాజిక మాధ్యమాల వినియోగం పెరిగిపోయింది.. సోషల్ మీడియా లేకుంటే రాజకీయ నాయకులకు నిమిషం కూడా గడవలేని పరిస్థితి నెలకొంది. అందువల్లే వారు సోషల్ మీడియాలో తమ కిరాయి సైన్యంతో రకరకాల ప్రచారాలు చేయిస్తున్నారు. అధికారంలో ఉన్న పార్టీకి ఏదో జరిగిపోతుందని.. ప్రజలు మొత్తం తీవ్రమైన దుఃఖంలో ఉన్నారని.. విపరీతమైన కష్టంలో ఉన్నారని.. ఈ సమయంలో తమ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ఆ రాజకీయ పార్టీ నాయకులు సోషల్ మీడియాలో పెడ బొబ్బలు పెడుతున్నారు. అంతేకాదు తమ సోషల్ మీడియా సైన్యంతో రకరకాల వీడియోలు రూపొందించి పోస్ట్ చేస్తున్నారు.. వాస్తవానికి ప్రజలు తిరస్కరిస్తేనే కదా అధికారాన్ని కోల్పోయింది.. ప్రతిపక్ష స్థానానికి పరిమితమైంది.. మరి ఆ మాత్రం సోయి ఆ రాజకీయ పార్టీల నాయకులకు ఎందుకు లేకుండా పోయింది.. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను ఏ విధంగా ఇబ్బంది పెట్టారు.. ఏ విధంగా హింసించారు అనేది ఆ నాయకులకు గుర్తుకు రాదా.. పోనీ గుర్తుకు ఉండదా.. ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక వీడియోను కొంతమంది తెగ సర్కులేట్ చేస్తున్నారు. ఆ వీడియోలో రెండు తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులు కెసిఆర్, వైయస్ జగన్మోహన్ రెడ్డి ఉన్నారు. గతంలో వీరిద్దరూ ముఖ్యమంత్రులుగా పనిచేసినప్పుడు.. భాయీ భాయీ అన్నట్టుగా తిరిగేవారు. అంతేకాదు ఒకరికి ఒకరు సహాయం కూడా చేసుకున్నారు. ఈ క్రమంలో వారిద్దరూ మళ్లీ అధికారంలోకి రావాలని.. వారిద్దరి కోసం రెండు తెలుగు రాష్ట్రాలు ఎదురుచూస్తున్నాయని కొంతమంది గతంలో ఉన్న దృశ్యాలను వీడియోలుగా రూపొందించి సోషల్ మీడియాలో సర్కులేట్ చేస్తున్నారు. అంతేకాదు వీరిద్దరూ తెలుగు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా రావాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.. వాస్తవానికి ఈ మాటలు అంటున్నది ప్రజలు కాదు.. సామాన్యులు అంతకన్నా కాదు. కేవలం ఈ పార్టీల పెయిడ్ సోషల్ మీడియా గ్రూపులు..ముందుగానే చెప్పినట్టు ప్రజలతో సంబంధాలను పెంచుకోవడానికి నేటి కాలంలో రాజకీయ నాయకులు ఇష్టం చూపించడం లేదు. ఆసక్తిని ప్రదర్శించడం లేదు. కోటలాటి గృహాలలో ఉండుకుంటూ? ఇనుప కాంచన నిర్మించుకుంటూ అందులో నివసిస్తున్నారు. అలాంటి వారికి అధికారాన్ని తిరిగి తెప్పించడానికి కొంతమంది సోషల్ మీడియాలో గంగ వెర్రులు ఎత్తుతున్నారు. లేనిపోని ప్రచారం చేసి ఏదో జరిగిపోతుంది అనే భ్రమ కల్పిస్తున్నారు.

## అన్ని గ్రామపంచాయితీలలో కాంగ్రెస్ గెలవాలి

ఖమ్మం

రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని రఘునాథపాలెం మండలంలోని 37 గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని రఘునాథపాలెం మండలంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అందుకు అనుగుణంగా అందరు కృషి చేయాలని . పదవులు అందరికి రావని, పని చేసే ప్రతి కార్యకర్త కాలర్ ఎగరవేసుకునేలా చేస్తానని ఏ ఒక్కరు కంగారు పడవద్దని, కష్టపడే వాళ్లకు పదవులు వచ్చే అవకాశం ఉందని భరోసా ఇచ్చారు. మీరు పదవులలో కూర్చుంటే మీరు నాకు ఇచ్చిన స్థానానికి విలువ ఉంటుందని, రాహుల్ గాంధీ నాయకత్వంలో కులగణన జరిగిందని, కులగణన చేయగలిగిన దమ్ము ధైర్యం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికే ఉందని, రాహుల్ గాంధీ ఆలోచనలతో దేశ ప్రధాని మోదీ కులగణన చెయ్యక తప్పడం లేదని, రేపు కర్నాటక లో కులగణన జరుగనుందని, ఎస్సీ జనాభా నిష్పత్తి ఆధారంగా ఉద్యోగాలు కూడా ఇస్తా అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారని, అభివృద్ధి గురించి నాకు గుర్తు చేయమే అని అప్పడం అవ్వకపోవడం నేను చూసుకుంటానని, నేను గెలిచిన తర్వాత రోజు విడిచి రోజు మీ మధ్యలో ఉంటున్నానని, నాకు మీరు ఇచ్చిన గౌరవం జన్మ జన్మలకు మర్చిపోనని, మీ గ్రామాల్లో ప్రతి గ్రామానికి మంచి నీళ్లు ఇచ్చిన ఘనత నాదే,ఇప్పటికే 5, 6 వందల కోట్ల నిధులు తీసుకుని వచ్చా రఘునాథపాలెం మండలానికి, ఇంకా ఎన్ని వందల కోట్లు అయినా తీసుకుని వస్తానని, 21 వేల కోట్లు రైతు బంధు కింద ఇచ్చామని అన్నారు. గత ప్రభుత్వం తీసుకు వచ్చిన పథకాలతో పాటు కొత్త పథకాలు కూడా అందిస్తున్నామని,ఉద్యోగస్తులు వారి బాకీలు, వారికి 5 డీఏ లు పెండింగ్ ఉన్నాయి వారికి 10 వేల కోట్లు ఇవ్వాల్సి ఉందని, అన్ని గత ప్రభుత్వం చేసి పోయిన ఘనతేనని అన్నారు. , అయిన అన్ని సంక్షేమ పథకాలు ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ముందుకు వెళ్తున్నారని, మీనాక్షి నటరాజన్ వచ్చిన నాటి నుండి కష్టపడే వారికి పదవులు ఇవ్వాలని నిర్ణయించారని, మొన్న ఇచ్చిన మంత్రి పదవులలోనూ అందరికీ అవకాశం ఇచ్చామని, పదవులు ఊరికే రావు కష్టపడే వారికే వస్తాయని అన్నారు.

మీరు ఏ గ్రామానికి రమ్మంటే ఆగ్రామానికి వస్తానని, మీరు ఐక్యంగా లేకుంటే మీ మధ్యలో బిఆర్ఎస్ వాళ్ళు గొడవ పెట్టే వాళ్ళు ఎగేసుకుని పోతారని ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి తుమ్మల అన్నారు.

## గచ్చిబౌలి లో పలు పబ్బులపై ఎస్ఓటి దాడులు

హైదరాబాద్

గచ్చిబౌలిలోని పలు పబ్బులపై సైబరాబాద్ ఎస్వోటీ అధికారులు దాడులు నిర్వహించారు.ఎస్ఎల్ఎన్ టెర్మినల్ మాల్ లోని పబ్బుల్లో డ్రగ్స్ తనిఖీలు నిర్వహించారు. మాదకద్రవ్యాలను పసిగట్టే శునకాలను వినియోగించారు. ఈ తనిఖీల్లో నలుగురికి డ్రగ్స్ పాజిటివ్ గా తేలింది. డీజే ప్లేయర్ శివ సైతం డ్రగ్ పాజిటివ్ వచ్చినట్టు నిర్ధారించారు. రఙ.

## పాలకోడేరులో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు పర్యటన

### అనుమతుల్లేని భవంతిని కూల్చేయాలని ఆదేశం

భీమవరం

పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరులోని మంగయ్య చెరువు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా అర సెంటు స్థలంలో నిర్మిస్తున్న భవనాన్ని కూల్చేయాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అధికారులను ఆదేశించారు.

పాలకోడేరులో సీసీ రోడ్ల ప్రారంభోత్సవా నికి విచ్చేసిన ఆయన పక్కనే నిర్మిస్తున్న భవనాన్ని చూసి అధికారులను ప్రశ్నించారు.

గ్రామకార్యదర్శి గోపి సమాధానమిస్తూ ఈ భవనానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, అయినా గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగిని చంద్రావతి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించేసారని తెలిపారు.

అనుమతులు లేకుండా బిల్డింగ్ నిర్మిస్తుంటే మీరేం చేస్తున్నారని రఘురామ మండిపడ్డారు. ఈ బిల్డింగును వెంటనే కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు.

## తాడిపత్రిలో హై టెన్షన్

అనంతపురం

తాడిపత్రిలో మరోసారి హై టెన్షన్ వాతావరణం నెలకొంది. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రి కి రావడానికి సిద్ధమయారు. ఆయనను అడ్డుకోవడానికి తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసి ప్రభాకర్ రెడ్డి,టిడిపి నాయకులు,జెసి అనుచరులు సిద్దమయ్యారు,. ఈ నేపథ్యంలో జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటి వద్దకు టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రికి రాకుండా తిమ్మంపల్లి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. నోటీసులు ఇవ్వాలని పెద్దారెడ్డి రోడ్డు పైనే బైఠాయించారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారికి టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.వీఐపీ ప్రారంభ దర్శనంలో శ్రీవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు మంత్రి నారాయణ ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ ఎన్ సుబ్రమణ్యన్,మాజీ మంత్రి వోపిదేవి వెంకటరమణ.దర్శించుకున్నారు.దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

# కరెంట్ కు తల్లికి వందనానికి లింక్...

విజయవాడ, జూన్ 14, (

రాష్ట్రవ్యాప్తంగా తల్లికి వందనం నిధులు జమ చేసినట్లు చెబుతోంది కూటమి ప్రభుత్వం. రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల మందికి పైగా అర్హులు ఉన్నట్లు తేల్చింది. కానీ రకరకాల కారణాలు చెబుతూ ఈ జాబితాలో చాలా వరకు కోత పడింది. ముఖ్యంగా 300 యూనిట్ల విద్యుత్ వినియోగం అంటూ అనర్హుల జాబితాలో చేర్చడం ఆందోళన కలిగిస్తోంది. అసలు విద్యుత్ బిల్లుల విషయంలో అస్పష్టత కొనసాగుతోంది. ట్రూ అప్ చార్జీలు పెరిగాయని ఒకసారి.. తగ్గాయని మరోసారి.. ఇలా విద్యుత్ చార్జీల్లో వ్యత్యాసం కనిపించింది. అయితే ఇది సర్వసాధారణ చర్యగా భావించిన సామాన్యులకు ఇప్పుడు తల్లికి వందనం రూపంలో షాక్ తగిలింది. మీరు నిర్దేశించిన యూనిట్ల కంటే అధికంగా విద్యుత్ వినియోగించారంటూ తల్లికి వందనం పథకంలో కోత విధించారు. దీనికి తోడు సాంకేతిక సమస్యలు, ఆధార్ సీడింగ్ అంటూ కొత్త మెలికలు పెట్టి భారీగా కోత విధిస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబోమంటూ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారువిద్యుత్ వినియోగం300 యూనిట్ల కంటే అధికంగా ఉంటే జగన్ సర్కార్ అమ్మ ఒడి పథకాన్ని నిలిపివేసింది. అప్పట్లో దీనిని తప్పు పట్టింది కూటమి. కరెంటు ఎక్కువ కాలిస్తే పథకం నిలిపివేస్తారా అని నిలదీసింది. ఇప్పుడు అదే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చింది. కరెంటు ఎక్కువగా వినియోగిస్తే పథకం ఇవ్వలేమంటూ తేల్చేసింది. అయితే సామాన్యుడికి విద్యుత్ చార్జీల విషయంలో అవగాహన లేదు. అందుకే విద్యుత్ వినియోగం విషయంలో ఏం చేయాలో పాలు పోక.. వచ్చిన బిల్లును కట్టుకుంటూ ముందుకు సాగాడు. కానీ తీరా ఇప్పుడు పథకం అమలు విషయానికి వచ్చేసరికి షాక్ తగిలేలా కూటమి సర్కార్ విద్యార్థుల తల్లిదండ్రులకు చేదు వార్త వినిపించింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా తల్లుల ఖాతాలో సీఎం చంద్రబాబుతో పాటు ఆయన కుమారుడు లోకేష్ తల్లికి వందనం నిధులు జమ చేశారు. కానీ సాయంత్రానికే ప్రతి గ్రామంలో పదిమందికి తగ్గకుండా విద్యుత్ వినియోగం అధికం చేశారన్న నెపంతో పథకాన్ని నిలిపివేశారు. దీంతో కొందరు తల్లులకే వందనమా అంటూ సెటైర్లు పడుతున్నాయి. ఒక ఏడాది సాయాన్ని ఇప్పటికే హరించారు. ఇప్పుడు వస్తుందనుకున్న తల్లికి వందనం పథకం రాకపోయేసరికి సగటు లబ్ధిదారుడు కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహంగా ఉన్నాడు. కనీసం ముందస్తుగా మార్గదర్శకాలు, వినతులు స్వీకరించి ఉంటే ఇటువంటి సాంకేతిక సమస్యలు అధిగమించే అవకాశం ఉంది. కానీ ఉన్నపలంగా మార్గదర్శకాలు జారీ చేయకుండా.. కొందరి లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేసి.. 300 యూనిట్ల విద్యుత్ వినియోగం పేరిట కొత్త విధించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.మరికొందరు 300 యూనిట్ల విద్యుత్ వినియోగించలేదని పథకానికి అనర్హులు పేరిట తేల్చేయడంపై కూడా విమర్శలు వస్తున్నాయి. ఇదేమని సచివాలయాలకు వెళ్తుంటే.. విద్యుత్ కార్యాలయాలకు పంపిస్తున్నారు. విద్యుత్ కార్యాలయాల వద్దకు వెళితే అంతా సరిగ్గా ఉంది సచివాలయాలకు వెళ్ళండి అంటూ సూచిస్తున్నారు. దీంతో సామాన్యుడికి అర్థం కావడం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో లేని నిబంధనలు.. ఇప్పుడు తెరపైకి రావడం పై ఎక్కువ మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ ఎక్కువ కాల్చితే.. పథకాలు నిలిపివేస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు విద్యుత్ చార్జీలు పెరిగాయి. కుటుంబ అవసరాల కోసం విద్యుత్ వినియోగం కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో కొంతమంది అధికంగా విద్యుత్ వినియోగించారు. సాధారణంగా వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువ. దీంతో ఏదాది ప్రాతిపదికగా తీసుకొని విద్యుత్ వినియోగాన్ని లెక్కించలేదు. 250- 300 యూనిట్ల మధ్య విద్యుత్ వినియోగించిన వారిని సైతం అనర్హులుగా తేల్చడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీనికి తోడు సాంకేతిక సమస్యలు ఉండనే ఉన్నాయి. తల్లికి వందనం అనేది విద్యా శాఖ తో పాటు సచివాలయాలు, ఆపై విద్యుత్ శాఖ, రవాణా శాఖ వంటి అంశాలతో ముడిపడి ఉంది. కానీ ఇవేవీ పరిగణలోకి తీసుకోని ప్రభుత్వం ఉన్నపలంగా తల్లికి వందనం పేరిట లబ్ధిదారుల ఖాతాలో నిధులు జమ చేసింది. వాస్తవానికి 69 లక్షల మంది లబ్ధిదారులు ఉంటే.. 45 లక్షల మందికే ఇవ్వడం ఏమిటనేది ఇప్పుడు ప్రశ్న. ఏడాదిగా పథకం అమలు చేయలేదు. తీరా ఇప్పుడు ఇచ్చారంటే నిబంధనల పేరిట కొర్రీలు పెడుతుండడం మాత్రం నిజంగా ప్రజలకు ఇబ్బందులకు గురి చేయడమే. మరి వాటిని సరిచేసి లబ్ధిదారులకు అందిస్తారో.. లేకుంటే ప్రజాగ్రహానికి గురి అవుతారో తేల్చుకోవాల్సింది ప్రభుత్వమే.

# ఏపీలో టాలీవుడ్ కు మంచి రోజులేనా ఇవాళ సీఎంతో పెద్దల భేటీ

విజయవాడ, జూన్ 14,

: ఆంధ్ర ప్రదేశ్ లో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఎట్టకేలకు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఏపీ సీఎం చంద్రబాబును కలవనున్నారు. వాస్తవానికి అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే ముఖ్యమంత్రిని సినీ ప్రముఖులు కలవడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఏపీలో మాత్రం ఆ పరిస్థితి కనిపించలేదు. తెలుగు చిత్ర పరిశ్రమ ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భం లేదు. అయితే సినీ పరిశ్రమకు చెందిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు మాత్రం సినీ పెద్దలు కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు. పనిలో పనిగా తెలుగు చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించే ప్రయత్నం చేశారు. అయితే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించుకుందామని సినీ పరిశ్రమ పెద్దలతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. త్వరలో మీరంతా సీఎం చంద్రబాబును కలవాలని సూచించారు. అయితే ఇటీవల హరిహర వీరమల్లు సినిమా విడుదల ప్రకటన వచ్చింది. అంతకంటే ముందే సినిమా థియేటర్ల బంద్ ప్రతిపాదన వచ్చింది. దీంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కార్యాలయం నుంచి ప్రత్యేక ప్రకటన వచ్చింది. చిత్ర పరిశ్రమ కోసం తాను కృషి చేస్తుంటే తనకి రిటర్న్ గిఫ్ట్ ఇస్తారా? అంటూ పవన్ కళ్యాణ్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు తర్వాత జరిగిన పరిణామాలతో ఈ నెల 15న సినీ పరిశ్రమ పెద్దలు ఏపీ సీఎం చంద్రబాబును కలిసేందుకు అపాయింట్మెంట్ తీసుకున్నారు.ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో చిత్ర పరిశ్రమ విస్తరించే ప్రయత్నం జరగడం లేదు. కేవలం హైదరాబాద్ కు సినిమా షూటింగులు పరిమితం అయ్యాయి. ఆంధ్రప్రదేశ్ కేవలం సినిమా మార్కెట్ కు పరిమితం అయింది. విశాఖలో షూటింగులు జరుగుతున్నా హైదరాబాద్ స్థాయిలో మాత్రం సాగడం లేదు. అవుట్ డోర్ షూటింగ్ లలో భాగంగా గోదావరి జిల్లాల్లో సైతం మునుపటి మాదిరిగా జరగడం లేదు. విజయవాడ తో పాటు తిరుపతి పరిసర ప్రాంతాలు షూటింగులకు అనుకూలంగా ఉన్నా సినీ నిర్మాతలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అటు విశాఖ మన్య ప్రాంతం సినిమా షూటింగులకు అనుకూలం. అయితే ఏపీలో సినీ పరిశ్రమ విస్తరణకు ఇదే సరైన సమయం. ఎందుకంటే ఏపీ ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి కూడా ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. అందుకే ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సినీ పరిశ్రమ విస్తరణకు.. ఆ రంగ ప్రముఖులకు కీలక సూచనలు ఇస్తే మంచిదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోందిసినిమా మాధ్యమం పై ఆధారపడి వేలాది మంది బతుకుతున్నారు. అలాగే ఇదో ఎంటర్టైన్మెంట్రంగంగా ఉంది. ప్రజలకు వినోదం పంచుతోంది. అయితే సినిమాల మాటున దోపిడీ జరుగుతోందన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. ప్రధానంగా సినిమా థియేటర్ల లో టికెట్ల ధరలు సామాన్యుడికి అందనంత దూరంలో ఉన్నాయి. అక్కడ లభించే కూల్ డ్రింక్స్, ఆహార పదార్థాలు కొనుగోలు చేయాలంటే సామాన్యుడికి వీలుపడదు. సెలవు రోజున సగటు చిన్న కుటుంబం సినిమాకు వెళ్తే.. జేబులో వెయ్యి రూపాయలు ఉండాల్సిందే. అంతలా బాదుడు ఉంటోంది. ఒక సినిమా పది రోజులు ప్రదర్శిస్తేనే హిట్ టాక్ వచ్చే రోజులు ఇవి. అందుకే ఆ కొద్ది రోజుల్లోనే ప్రేక్షకుడి నుంచి బాదుడు తప్పడం లేదు. అందుకే థియేటర్లకు రాయితీలు ఇవ్వాలి. ఆపై సినిమా షూటింగులకు తగ్గట్టు ఏపీని విస్తరించాలి. స్థానిక కళాకారులకు ప్రోత్సాహం ఇవ్వాలి. ఇవి చేస్తేనే ఏపీలో సినీ పరిశ్రమ విస్తరిస్తుంది. నలుగురికి ఉపాధి దొరుకుతుంది.రాష్ట్ర విభజనజరిగి 11 సంవత్సరాలు అవుతోంది. కానీ ఇంతవరకు తెలుగు సినీ పరిశ్రమ విస్తరణ జరగలేదు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన తప్ప కార్యరూపం దాల్చలేదు. సినీ పరిశ్రమ ద్వారా తెలంగాణకు ఆదాయం వస్తుంటే.. మార్కెట్ విస్తరణకు మాత్రం ఏపీ ఉపయోగపడుతోంది. చిన్న సినిమాల నుంచి పెద్ద సినిమాల వరకు ఎవరికీ వారే సినిమా టిక్కెట్ల ధర పెంపునకు ఏపీ ప్రభుత్వ అనుమతి తీసుకుంటున్నారు. కానీ ఏపీలో చిత్ర పరిశ్రమ విస్తరించాలన్న ప్రయత్నం జరగడం లేదు. ఏపీలో చిత్ర పరిశ్రమ విస్తరణకు అవసరమైన అనుకూల పరిస్థితులు ఉన్నాయి. కానీ ఎక్కడో ప్రయత్న లోపం జరుగుతోంది. ఆపై సినీ పరిశ్రమ నుంచి కూడా మద్దతు కరువవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఏపీ సీఎం చంద్రబాబుకు సినీ పరిశ్రమ పెద్దలు కలవనుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ కలయిక మర్యాదపూర్వకంగా కాకుండా.. ఏపీలో పరిశ్రమ విస్తరణ, సగటు ప్రేక్షకుడకు అదనపు బాదుడు లేకుండా వినోదం పంచడం వంటి చర్యలపై దృష్టి పెడితే ఎంతో మేలు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## నేడు మండల కేంద్రంలో యోగాంధ్ర కార్యక్రమం

తుగ్గలి: జూన్ 14,

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని మండల కేంద్రమైన తుగ్గలి నందు



నిర్వహిస్తున్నట్లు తుగ్గలి ఎంపీడీవో విశ్వమోహన్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం నందు,మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాలు నందు మరియు తుగ్గలి తహసిల్దార్ కార్యాలయం నందు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. ఈ సందర్భంగా యోగేంద్ర కార్యక్రమానికి వివిధ శాఖల మండల స్థాయి అధికారులు,ప్రభుత్వ ఉద్యోగులు,ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన తెలియజేశారు. మే 21 నుంచి జూన్ 21 వరకూ 'యోగాంధ్ర' పేరిట ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు మీకు అభినందనలు శుభాకాంక్షలు: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ జూన్ 14,

మీరు ఇందిరమ్మ ఇల్లు నించుకోవడానికి ప్రభుత్వం విడతల వారిగా 5 లక్షల రూపాయలు సహాయం చేస్తుంది. ఇళ్ల నిర్మాణం



కోసం 8 ట్రాక్టర్ల ఇసుక ఉచితంగా ఇస్తుంది. ఇల్లు నిర్మాణాన్ని 400-600 పిట్లు లోపే ఇల్లు నిర్మించాలి. ఇళ్లు కట్టుకునే ఆర్థిక స్థోమత లేకపోతే మహిళా సంఘాల నుండి మీకు లక్ష రూపాయల రుణం అందిస్తుంది. 10 సంవత్సరాల తర్వాత ప్రజా పాలన ప్రభుత్వం లో ఇందిరమ్మ ఇల్లు వస్తున్నాయి. మీకు శుభాకాంక్షలు. ఎటువంటి ఆటంకాలు లేకుండా మీరు ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకోవాలి.

## ఆలేరు ఎమ్మెల్యే ఇంట్లో వ్యక్తి ఆత్మహత్య

హైదరాబాద్ జూన్ 14,

తెలంగాణ ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇంట్లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎమ్మెల్యే ఇంట్లో పనిచేసే గంధమల్ల రవి ఐలయ్య ట్లోని 3వ అంతస్తులో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొంతకాలంగా గంధమల్ల



రవి విషయమై వారం రోజుల క్రితం ఐలయ్య ఇంట్లో గొడవ జరిగినట్లు సమాచారం. గంధమల్ల రవి ఆత్మహత్య కారణాలు ఇంకా బయటకు రాలేదు.

## డీఐ పిఆర్వో/ఏ.డి కు ఆత్మీయ వీడ్కోలు, సన్మానం

### బదిలీపై వెళ్తున్న డివిజనల్ పిఆర్వో, సీనియర్ అసిస్టెంట్ లకు వీడ్కోలు

బద్వేలు

శ్రీ సత్యసాయి జిల్లా డీఐపిఆర్వోగా బదిలీపై పుట్టపర్తికి వెళుతున్న.. కడప జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ డీఐపిఆర్వో పి. వేణుగోపాల్ రెడ్డిని ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

కడప కాలెక్టరేట్ ప్రాంగణంలోని సమాచార పౌరసబంధాల శాఖ కార్యాలయంలో.. డీఐపిఆర్వోగా పనిచేసి సత్యసాయి జిల్లాకు బదిలీపై పి. వేణుగోపాల్ రెడ్డికి, డివిజనల్ పిఆర్వో మస్తాన్ సాహెబ్ లకు, అన్నమయ్య జిల్లాకు బదిలీపై వెళ్తున్న సీనియర్ అసిస్టెంట్ జయశాంత శరీఫా లకు ఆ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా ఆత్మీయ వీడుకోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయనకు పుష్పగుచ్చాలు అందించి దుశ్శాలువ, జ్ఞాపికలతో సన్మానించారు.

ఈ సందర్భంగా.. పలువురు అధికారులు, సిబ్బంది వారి మనోభావాలను వ్యక్తం చేస్తూ బదిలీ అయిన వారితో వారికి విధి నిర్వహణలో వారితో అనుభవాలు, అనుబంధాన్ని వ్యక్తం చేశారు. ఎలాంటి విమర్శలు, వివాదాలకు తావు లేకుండా.. శాఖాధిపతిగా డీఐ పిఆర్వో వేణుగోపాల్ రెడ్డి చేసిన సేవలు, డివిజనల్ పిఆర్వోగా మస్తాన్ సాహెబ్, సీనియర్ అసిస్టెంట్ జయశాంత శరీఫా లు విధుల్లో చేసిన సేవలను కొనియాడారు. బదిలీపై వెళుతున్న ప్రాంతాల్లో విధుల్లో అత్యున్నత సేవలను అందించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా డీఐపిఆర్వో వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కడప కార్యాలయంలో విధి నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. మీ అందరి సహకారం, సమన్వయంతో ఇంతకాలం.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా తన అధికార విధులను నిర్వర్తించగలిగానన్నారు. ప్రతి అధికారికి బదిలీ అనేది సర్వ సాధారణమే అయినా.. ఇన్ని సంవత్సరాల పాటు ఈ కార్యాలయంలో అందరితో కలిసి పనిచేసిన అనుభవం ఒక కుటుంబ వాతావరణాన్ని తలపించిందన్నారు. ఈ ప్రాంత వాతావరణం, ఇక్కడి మీడియా మిత్రుల అభిమానం, అధికారులు సిబ్బంది సమన్వయ సహకారం.. తనకు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు.

ఈ సందర్భంగా డీఈఐఈ శ్రీనివాసరావు, డివిజనల్ పిఆర్వో సునీల్ సాగర్, పిఆర్వో రవికుమార్, ఏవీఎస్ నాగయ్య, రికార్డ్ అసిస్టెంట్ ఈశ్వరయ్య,ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, టైపిస్టులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ అవార్డ్స్‌లో గద్దర్ మిస్సింగ్

హైదరాబాద్, జూన్ 14, (

ఏం చేసినా వివాదమే.. ఏదో ఒక లోపమే.. సోషల్ మీడియాలో రభస అవుతున్నది. ప్రధాన మీడియా దెప్పి పొడుస్తోంది. అయినప్పటికీ రేవంత్ ప్రభుత్వం ఏమీ చేయలేకపోతోంది. చివరికి ప్రభుత్వానికి చీమకుట్టినట్టుగా కూడా ఉండడం లేదు.. ఇలా ఎందుకు జరుగుతోందో అర్థం కావడం లేదు. ప్రభుత్వ వైఫల్యమా? విపరీతమైన నిర్లక్ష్యమా? అనేది అంతు పట్టడం లేదు .

అప్పుడెప్పుడో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నంది అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ఆ తర్వాత ఇప్పటివరకు ఆ పురస్కారాలను ఇచ్చింది లేదు. కెసిఆర్ ప్రభుత్వం మొత్తానికే ఆ అవార్డులను కోల్డ్ స్టోరేజ్ లో పడేసింది. దాదాపు దశాబ్ద కాలంగా తెలుగు చిత్ర పరిశ్రమకు ప్రభుత్వం తరపున అవార్డులు ఇచ్చింది లేదు. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించి పురస్కారాలు అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తెలంగాణలో వాగ్గేయకారుడుగా.. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన గద్దర్ స్మృత్యర్థం అవార్డును ప్రకటించారు రేవంత్ రెడ్డి. గద్దర్ పేరు మీద ఉత్తమ చిత్రాలకు, ఉత్తమ నటినటులకు, సాంకేతిక నిపుణులకు, ఇతర బృందాలకు పురస్కారాలను అందిస్తామని వెల్లడించారు. అంతేకాదు అవార్డుల కమిటీని కూడా ఏర్పాటు చేశారు. సినీ నటి జయసుధ, ప్రఖ్యాత నిర్మాత దిల్ రాజులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి ఉత్తమ చిత్రాలు, ఉత్తమ నటీనటులు, ఇతర సాంకేతిక బృందాలకు అవార్డులను ప్రకటించింది ప్రభుత్వం. శనివారం అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. ప్రభుత్వం చేసిన తప్పు వివాదంగా మారింది. సోషల్ మీడియాలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. గద్దర్ అవార్డుల ప్రధానోత్సవానికి సంబంధించి ముద్రించిన ఆహ్వాన పత్రికలో రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దిల్ రాజు ఫోటోలను మాత్రమే ప్రచురించారు. గద్దర్ అవార్డుకు సంబంధించిన ప్రతిమను కూడా అందులో ప్రముఖంగా చూపించారు. అయితే టీజీఎఫ్ఏ పేరుమీద ఈ ఆహ్వాన పత్రికను ముద్రించారు. అయితే ఈ ఆహ్వాన పత్రికలో గద్దర్ ఫోటోను ముద్రించడం మర్చిపోయినట్టున్నారు. ఆహ్వాన పత్రిక ఒక్కసారిగా వెలుగులోకి రావడంతో వివాదం మొదలైంది. అసలే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి.. బజార్లో నిలబెట్టడానికి భారత రాష్ట్ర సమితి శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తోంది. ఈలోగా ఈ ఆహ్వాన పత్రిక విషయం వెలుగులోకి రావడంతో సోషల్ మీడియాలో భారత రాష్ట్ర సమితి నెగిటివ్ ప్రచారానికి శ్రీకారం చుట్టింది.. ఇన్నేళ్లపాటు అవార్డులు ఎందుకు ఇవ్వలేదు? అనే విషయాన్ని పూర్తిగా మర్చిపోయి? అధికారంలో ఉన్నప్పుడు గద్దర్ కు అపాయింట్మెంట్ ఇవ్వని విషయాన్ని పక్కనపెట్టి.. రేవంత్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఇంత జరుగుతున్నప్పటికీ.. ఇంతలా నెగటివ్ ప్రచారం చోటు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం తరపునుంచి ఇంతవరకు ఒక్కరు కూడా మాట్లాడలేదు. అఫ్ కోర్స్ ఇటీవల కాలంలో భారత రాష్ట్ర సమితి ఎన్ని రకాలుగా ఆరోపణలు చేసినా.. ఏ స్థాయిలో విమర్శలు చేసినా.. కాంగ్రెస్ పార్టీ నుంచి స్పందన ఉండటం లేదు. ఆ పార్టీలో అధికార ప్రతినిధులు ఉన్నామంటే ఉన్నారు. పదవుల కోసం పైరవీలు చేయడం తప్ప.. ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేయడం తప్ప.. వారు పార్టీ కోసం చేస్తున్నది ఏమీ లేదని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఇక ఎప్పటి లాగానే భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియాలో రెచ్చిపోతోంది. యధావిధిగా కాంగ్రెస్ పార్టీ నిశ్శబ్దంగా ఉండిపోతుంది. పాపం చేసింది కూడా చెప్పుకోలేని దుస్థితి కాంగ్రెస్ పార్టీది. చేసే పనిలో ఫర్ఫెక్షన్ వదిలేసి వివాదాల పాలయ్యే దారుణం ఆ నాయకత్వానిది.. పాపం రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఎప్పుడు తన తప్పులు సరిదిద్దుకుంటుందో.. ఎప్పుడు వివాదాలకు ఆస్కారం ఇవ్వకుండా చూసుకుంటుందో..

## తల్లికి వందనం పథకం అమలకు శ్రీకారం మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్

బ్రహ్మంగారిమఠం

ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం అమలుకు మా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందనిఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అందరికీ తల్లికి వందనం పథకాన్ని సీఎం చంద్రబాబు నాయుడు గారు అమలు చేస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 67 లక్షల ఇరవై ఏడు వేల 164 మంది విద్యార్థులకు 8,745 కోట్ల రూపాయలు తల్లుల ఖాతాల్లో మా ప్రభుత్వం జమ చేయనుందన్నారు. ఒకటవ తరగతి మరియు ఇంటర్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థులకు కూడా తల్లికి వందనం అమలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థుల్లో ఎవరికైనా జాబితాలో పేరు లేకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకుంటే వెంటనే పథకం వర్తింపజేస్తాం అని సీఎం తెలిపారన్నారు

. ఇప్పటికే ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా పింఛన్ల పెంపు ,అన్నా క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, దీపం పథకం -2 అమలు చేస్తున్నామని మైదుకూరు శాసనభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు.

# బద్వేల్ లో నకిలీ ఇంటి పట్టాలు అనుబంధ పత్రాల అలజడి

## పేదల ఇంటి స్థలాల్లో డాన్ ఆకృత్యాలు

బద్వేలు జూన్ 14,

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో లేడీ డాన్ ఆకృత్యాలు ఇటీవల మరింత పెరిగిపోయాయి నకిలీ ఇంటి పట్టాలు నకిలీ అనుబంధ పత్రాలు

నకిలీ వాస్తవ సర్టిఫికెట్లు తయారు చేయించి అసలు హక్కుదారుల పై జులూమ్ చేస్తున్నారు అధికార పార్టీ అండతో డాన్ ఇటీవల మరింత రెచ్చిపోతున్నారు బద్వేల్ మండలంలోని ఒక గ్రామానికి చెందిన ఆ డాన్ ఎవరు అనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. బద్వేలుపట్టణంలోని పలు సర్వే నెంబర్లలో ఈ డాన్నకిలీ ఇంటి పట్టాలు నకిలీ అనుబంధ పత్రాలునకిలీ వాస్తవ పత్రాలు తయారు చేయించి హక్కుదారులపై ప్రతాపం చూపుతున్నారు ఈ విషయం సంబంధిత అధికారులకు బాగా తెలుసు ముఖ్యంగా ద్వేల్ పట్టణం నోబుల్ స్కూల్ సమీపంలోని 1779-1 సర్వే నెంబర్లు తాజాగా నకిలీ అనుబంధ పత్రం నకిలీ వాస్తవ సర్టిఫికెట్ పుట్టుకు వచ్చింది 62 ప్లాట్ నెంబర్ పేరుతో నకిలీ అనుబంధ పత్రం నకిలీ వాస్తవ సర్టిఫికెట్ పుట్టించారు ఈ ప్రాంతంలో మూడు సెంట్లు 30 లక్షల రూపాయలు పైగా విలువ చేస్తుంది విలువైన ఇంటి స్థలాలపై నకిలీ ఇంటి పట్టాలు నకిలీ అనుబంధ పత్రాలు నకిలీ వాస్తవ పత్రాలు తయారు చేస్తున్నారు ఇదంతా లేడీ డాన్ ఘనత అని చెప్పాలి ముఖ్యంగా కొన్ని సంవత్సరాల క్రితం పదవి విరమణ చేసిన బద్వేలు మండల



తాసిల్దార్ పేరుతో వీటిని పుట్టించడం విశేషం. 62 ప్లాట్ నెంబర్ సంబంధించి 24-6-2010 లో అనుబంధ పత్రం ఒక మహిళ పేరుతో ఇచ్చినట్లు తయారు చేయించారు 2020 లో వాస్తవ సర్టిఫికెట్ ఇచ్చినట్లు మరో నకిలీ సర్టిఫికెట్ తయారు చేశారు విశేషం ఏమంటే నకిలీ వాస్తవ సర్టిఫికెట్ ఇచ్చినట్లు సంతకం చేసిన బద్వేలు మండల తాసిల్దార్ పది సంవత్సరాల క్రితమే పదవి విరమణ చేశారు ఆ తాసిల్దార్ సంతకంతో నకిలీ అనుబంధ పత్రము వాస్తవ సర్టిఫికెట్ పుట్టుకు రావడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుందిఇలాంటి నకిలీ అనుబంధ పత్రాలు నకిలీ వాస్తవ సర్టిఫికెట్లు ఎన్నో ఉన్నాయి ఇందుకు ప్రధాన కారణం లేడీ డాన్ అని తెలుస్తుంది సంబంధిత అధికారులు నిజాయితీగా ఆ డాన్ పై చర్యలు తీసుకొని హక్కుదారులకు న్యాయం చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు

# ఇంకా కీలక శాఖలకు సీఎం దగ్గరే...

హైదరాబాద్, జూన్ 14,

ప్రాంతీయ పార్టీలకు ఆయా రాష్ట్రాల రాజధానులలో కార్యాలయాలు ఉంటాయి. ప్రాంతీయ పార్టీలో వ్యక్తిస్వామ్యం నడుస్తుంది కాబట్టి.. ఆయన చెప్పినట్టుగానే పదవుల కేటాయింపు జరిగిపోతుంది. ఇది మనదేశంలో అత్యంత సర్వసాధారణమైన విషయం. అదే జాతీయ పార్టీ అయితే ఢిల్లీలో కార్యాలయాలు ఉంటాయి.. చాలామంది పెత్తనాలు సాగుతూ ఉంటాయి కాబట్టి.. ప్రతి విషయంలోనూ మంతనాలు జరుగుతూ ఉంటాయి.జాతీయ పార్టీలో నాయకులు ఒక్కో తీరుగా ఉంటారు. అందరిని సమన్వయం చేసుకొని.. అందరిని మచ్చిక చేసుకొన్న తర్వాతే పదవులు లభిస్తాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో ఈ సంస్కృతి ఎప్పటి నుంచో ఉంది. అందువల్లే ఆ పార్టీలో ఏదైనా సాధ్యమే అనే నానుడి కూడా పుట్టింది. ముఖ్యమంత్రిలను కీలుబొమ్మలు లాగా మార్చి.. వారితో ఆటలాడించే పార్టీగా కాంగ్రెస్ కు జాతీయ రాజకీయాలలో మంచి పేరే ఉంది. అక్కడ దాకా ఎందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక సందర్భాలలో ముఖ్యమంత్రులను మార్చి కాంగ్రెస్ పార్టీ తన పేరును మరొకసారి సార్థకం చేసుకుంది. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత రోశయ్యను ముఖ్యమంత్రిని చేసింది. ఆ తర్వాత కొద్ది రోజులకు రోశయ్యను పక్కనపెట్టి కిరణ్ కుమార్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టింది. బహుశా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రిగా సేవలు అందించిన రికార్డు కిరణ్ కుమార్ రెడ్డి సొంతం చేసుకున్నారు.. సరిగ్గా 11 సంవత్సరాల క్రితం తెలుగు రాష్ట్రం విడిపోయింది.. రెండు ముక్కలైంది. ఇందులో తెలంగాణ రాష్ట్రంలో రెండు పర్యాయాలు భారత రాష్ట్ర సమితి అధికారాన్ని అనుభవించింది. ఇక ఆంధ్రప్రదేశ్లో ఒకసారి టిడిపి.. మరొకసారి వైసిపి అధికారంలోకి వచ్చాయి. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం అధికారాన్ని దక్కించుకుందితెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ఏడాది పరిపాలన విజయవంతంగా పూర్తి చేసుకుంది. రెండవ ఏడాదిలోకి అడుగు పెట్టింది. ఇటీవల మంత్రివర్గ విస్తరణ కూడా చేపట్టింది. అందులో ముగ్గరికి మంత్రి పదవులు లభించాయి. వారంతా కూడా బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే. ఈ క్రమంలో వారికి కేటాయించిన శాఖల విషయంలో అనేక మతలబు జరిగింది. కనుక సందర్భంలో ముఖ్యమంత్రి వద్ద ఉన్న మున్సిపల్ శాఖను తనకు కావాలని కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రి కోరినట్లు తెలుస్తోంది. ఇదే విషయంపై ఢిల్లీలో భారీ స్థాయిలో మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. అయితే ముఖ్యమంత్రి హస్తిన వెళ్లిన తర్వాత ఒక్కసారిగా సీన్ మారిపోయిందని.. తన వద్ద ఉన్న కార్మిక శాఖ, ఎస్సీ , ఎస్టీ, దివ్యాంగులు, పశుసంవర్ధక శాఖలను మాత్రమే ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒప్పుకున్నట్టు తెలుస్తోంది. తన వద్ద ఉన్న విద్య, హోం, మున్సిపల్ శాఖలను ఇవ్వడానికి ఒప్పుకోనట్లు తెలుస్తోంది. వాస్తవానికి తన వద్ద ఉన్న శాఖలను కొత్త మంత్రులకు ఇస్తానని హస్తినలో విలేకరులతో జరిగిన చిట్ చాట్ లో రేవంత్ రెడ్డి వెల్లడించారు. దీంతో తమకు కీలక శాఖలు దక్కుతాయని.. కొత్తగా ఏర్పడిన మంత్రులు భావించారు. కానీ అది అంత సులభం కాదని రేవంత్ రెడ్డి నిరూపించారు. కాకపోతే అధిష్టానం అనుమతి తీసుకుని తనకు అనుకూలంగా వ్యవహారాల సాగేలా రేవంత్ పావులు కదిపారు. దీంతో కొత్తగా ఏర్పడిన మంత్రులకు నామమాత్రంగా శాఖలు దక్కాయి. మంత్రి పదవవైతే దక్కింది చాలు.. శాఖల సంగతి తర్వాత అన్నట్టుగా.. ఆ మంత్రుల శైలి ఉన్నట్టు తెలుస్తోంది.

# జూలై 1న బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవం

జూలై 1న బల్కంపేట ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం , 2న రథోత్సవం జరగనున్నట్లు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తో కలిసి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా జరుగుతునట్లే ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా కళ్యాణం జరుగుతుందని అన్నారు... కల్యాణినికి రాష్ట్ర నుండి కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా లక్షలో భక్తులు వస్తారు.. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగాకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి , వాటర్ వర్క్స్ , విద్యుత్ , పోలీస్ , ఫైర్ , అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు..ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కేతినేని సరళ , ఆలయ ఈవో కృష్ణ , సూపరింటెండెంట్ హైమావతి , ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మలక్పేట్ ఇన్స్పెక్టర్ నరేష్, ఎస్ఐ నవీన్ ల పై ఏసీపీ కి ఫిర్యాదు చేసిన బిజెపి నాయకులు

హైదరాబాద్

మలక్పేట్ పోలీసు స్టేషన్ పరిధిలోని నమోదైన కేసుల పై నిర్లక్ష్యం వహిస్తున్న ఇన్స్పెక్టర్ నరేష్, ఎస్ఐ నవీన్ ల పై బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్ మాలక్పేట్ ఏసీపీ సుబ్బిరామ రెడ్డికి ఫిర్యాదు చేశారు. గతంలో ఓ ఆక్సిడెంట్ కేసులో నిర్లక్ష్యం వహించడమే కాకుండా ఇచ్చిన ఫిర్యాదు లేదని చెప్పాడని ఆవేదన చెందారు. నిన్న జరిగిన అక్రమ నిర్మాణం పై పలు మార్లు అపార్మెంట్ వాసులు ఎస్ ఐ నవీన్ కు ఫిర్యాదు చేసిన నిర్లక్ష్యం వహించాడని, ముందుగానే పట్టించుకుంటే బహ్మానందం పై దాడి జరిగేది కాదని తెలిపారు. అపార్మెంట్ దాడి కేసులో నలుగురు ని అరెస్టు చేశారు... కానీ అపార్మెంట్ లో అక్రమ భవనం నిర్మాణానికి పునుకున్న బిల్డర్ మసియుద్దీన్ పై కేసు నమోదు చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు

# పేర్ని నానికి మతిభ్రమించింది

మచిలీపట్నం

పేర్ని నాని నకిలీ పట్టాల వ్యవహారంలో మంత్రి కొల్లు రవీంద్ర మీడియా సమావేశం నిర్వహించారు. అరెస్ట్ భయంతో పిచ్చి పిచ్చి ప్రేలాపనలు మాట్లాడుతున్నాడు. చరిత్రలో చూశాం.. అవాకులు చవాకులు పేలిన అనేక మంది కాలగర్భంలో కలిసిపోయారు. తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు బురదజల్లే కార్యక్రమాలకు పాల్పడుతున్నాడని విమర్శించారు. ఎన్నికల్లో తన కొడుకుని గెలిపిచుకోవడం కోసం పడరానిపాట్లు పడి, చేయరాని తప్పులు చేశారు. దొంగ పట్టాలు సృష్టించి అమాయక పేద ప్రజలకు పంచి పెట్టి మోసం చేశారని అన్నారు.

ఆ నాడు తహశీల్దార్ కార్యాలయంలో అర్థరాత్రి పూట దొంగ పట్టాలు తయారు చేయడాన్ని మేం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నాం. స్ట్రీట్ ఫీల్డ్ పేరుతో పట్టాలు ఇచ్చి పేదలను మోసం చేశావ్. నాడు నువ్వు ఇచ్చిన దొంగ పట్టాలపై విచారణ జరుగుతుంటే గజ గజ వణికిపోతున్నావ్. తండ్రీ కొడుకులు ఇద్దరూ పారిపోయి హైకోర్టుకు వెళ్లి ముందస్తు బెయిల్ పిటీషన్ కు పిటీషన్ వేశావ్. ఎన్నికల కోడ్ వచ్చే వరకు తహశీల్దార్ గా సునీల్ ఉన్నాడని చెబుతున్నావ్.. ఎక్కడ ఉన్నాడో చెప్పు. కోడ్ వచ్చిన సమయంలో సునీల్ అనపర్తిలో ఉన్నాడు. నీకు నీ భార్య మీద అంత ప్రేమ ఉంటే పేదల బియ్యం బొక్కేవాడివా..? నీ గోడౌన్ నుండి కాకినాడ పోర్టుకు వెళ్లిన ప్రతి లారీ సీసీ ఫుటేజ్ టోల్ గేట్ల దగ్గర సీసీ కెమెరాలలో రికార్డ్ అయ్యాయి. న్యాయాధికారి ఆదేశాలతోనే నీ భార్యను విచారించారని అన్నారు.

ప్రెస్ మీట్ లు పెట్టి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్న నిన్ను చూసి రాష్ట్ర ప్రజలంతా ఒక బఫూన్ లా చూస్తున్నారు. నీలాంటి వాళ్లు రాజకీయాల్లో అనర్హుడివి.. నీపై అనర్హత వేటు వేయాలి. గతంలో 6400 టిడ్కో ఇళ్లు కడితే పేదలు ఇవ్వడానికి మీకు ఎందుకు మనసు రాలేదు. ఇళ్ల స్థలాల పేరుతో భూములు కొని కమిషన్లు కొట్టుకున్న వ్యక్తి పేర్ని నాని. గ్రామాల్లో స్మశానాలను సైతం కాజేశారు. మెడికల్ కాలేజ్ భూముల కొనుగోళ్లలో అవినీతి జరిగిందని కాగ్ మొట్టికాయలు వేయడం నిజం కాదా..? గిలకలదిండిలో సీఆర్జెడ్ భూములు ఇస్తే పట్టాలు రావని ఆ నాడు పోరాడం. కలెక్టర్ ని కోర్టు భూములు ఎక్కే పరిస్థితి తీసుకొచ్చావ్. ఆ నాడు నేను చేసిన పోరాట ఫలితంగానే నువ్వు అక్కడి పేదలకు భూములు కొని ఇచ్చారు. ఆ భూముల కొనుగోళ్లలోనూ కమిషన్లు కొట్టుకున్నారు. బందరుకోటలో గతంలో నువ్వు ఇచ్చిన దేవనబోయిన రాము భూములకు ఇప్పటికీ పట్టాలు రాని పరిస్థితి. బందరు పోర్టును నేనే కట్టా.. నేనే కట్టా అంటున్నావ్. ఆనాడు మేం చేసిన ఉద్యమ ఫలితమే బందరు పోర్టు. 2006లో బందరు పోర్టును రాజశేఖరరెడ్డి గోగులేరుకు తరలిస్తే నాకు అభ్యంతరం లేదని సంతకం పెట్టిన వ్యక్తివి నువ్వు. ఆ తర్వాత మేం చేసిన ప్రజా ఉద్యమానికి దిగి వచ్చి మా అమ్మ మీద ఒట్టు.. పెదపట్నంలోనే పోర్టు అన్న వ్యక్తివి కూడా నువ్వే. 2014 ఎన్నికల్లో పోర్టు పనులు ప్రారంభించకపోతే కోనేరుసెంటర్ లో మోకాళ్లపై నిలబడి ముక్కును నేలకు రాసి రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న వ్యక్తి నువ్వు కాదా..? పిచ్చి పిచ్చి వాగుడు వాగిన వ్యక్తి పేర్ని నాని. 2014లో మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ల్యాండ్ పూలింగ్, ల్యాండ్ పర్చేజింగ్, భూసేకరణ పాలసీల కింద భూములు సేకరించాం. భూముల సేకరణలో అనేక ఇబ్బందులు పెట్టావ్. రెండు సార్లు జగన్ ని తీసుకొచ్చి భూములు ఇవ్వకుండా అడ్డుకునే ప్రయత్నం చేశావ్. వీటన్నింటినీ అధిగమించి పోర్టు పనులు ప్రారంభిస్తే 2019లో అధికారంలోకి వచ్చిన మీరు ఆ పనులు ఆపివేశారు. అప్పటి ఎంపీ బాలశౌరి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి కొంత నిధులు తెస్తే ఎన్నికల ముందు పోర్టు పనులు ప్రారంభించారు. నేడు ఆ పనులను 67% మేం పూర్తి చేశాం. 2026 జూన్ తర్వాత పోర్టును ఆపరేషన్ లోకితీసుకువస్తామని అన్నారు.

# అహ్మదాబాద్ ఘటనపై ఎన్నో అనుమానాలు

# పక్షి ఏమైనా ఢీ కొట్టిందా

గాంధీనగరం, జూన్ 14,

మూలుగా మనం బైక్ మీద ప్రయాణిస్తున్నప్పుడు.. అనేక జాగ్రత్తలు తీసుకుంటాం. హెల్మెట్ పెట్టుకుంటాం, టైర్లలో గాలి ఉందో, లేదో చూసుకుంటాం. పెట్రోల్ ను చెక్ చేసుకుంటాం.. ఇక త్రి చక్ర, నాలుగు చక్రాల వాహనాలలో ప్రయాణిస్తున్నప్పుడు మరింత జాగ్రత్తగా ఉంటాం అలాంటిది ఒక దేశం నుంచి మరొక దేశానికి వెళ్తున్నప్పుడు.. అది కూడా అంతర్జాతీయ విమానం ప్రయాణిస్తున్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఏ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలి? కానీ ఇవేవీ పాటించలేదా? విమానాన్ని పరిశీలించలేదా? నిర్లక్ష్యంగా వదిలేశారా? ప్రయాణికుడు తాను పరిశీలించిన లోపాలను ట్విట్టర్ వేదికగా విమానయాన సంస్థకు తెలియజేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయిందా? ఇప్పుడు ఇవే ప్రశ్నలను నిపుణులు లేవ నెత్తుతున్నారు. జరిగిన దారుణంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.. టేక్ ఆఫ్ ఆయన విమానం వెంటనే కూలిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. గతంలో పైలట్ పనిచేసిన అనుభవం ఎహసాన్ ఖలీద్ అనే వ్యక్తికి ఉంది. ఈ ప్రమాదాన్నిపద్యంలో ఆయన స్పందించారు. విమానానికి ల్యాండింగ్ గేర్ కిందికి ఎలా ఉంటుందని ఆయన విస్మయ వ్యక్తం చేశారు. ఆ గేర్ కిందికి ఉండడం పట్ల అనుమానం వ్యక్తం చేశారు. విమానం నడుపుతున్న పైలట్ ఏటీసీకి "మేడే కాల్" ఇచ్చారంటే అందులో వ్యవస్థ విఫలమైనట్టేనని పేర్కొన్నారు.. అసలు ల్యాండింగ్ గేర్ కిందకు ఉండడమే అర్థం కావడం లేదని ఆయన పేర్కొన్నారు. "విమానం గాల్లో ఎగిరిన వెంటనే ల్యాండింగ్ గేర్ దానంతట అదే లోపలికి వెళ్ళిపోతుంది. కూలిన విమానానికి సంబంధించిన ల్యాండింగ్ గేర్ కిందకు ఉంది. ఈ ప్రకారం ఇంజన్ విఫలం చెందినట్టే భావించాలని" ఖలీద్ చెప్తున్నారు. " లోహ విహంగం శక్తిని కోల్పోయింది. దానికి ఇంజన్లో తలెత్తిన లోపం కూడా కారణం కావచ్చు. సాధారణంగా విమానానికి సంబంధించి రెండు ఇంజన్లు ఒకేసారి వైఫల్యం చెందే అవకాశాలు ఉండదు. ఒకవేళ అంతటి స్వల్పకాలంలో ఏదైనా పక్షి ఢీకొంటే కూడా ఇంజన్లు విఫలమయ్యే అవకాశం లేదని" ఎహసాన్ ఖలీద్ పేర్కొన్నారు.అమెరికాలో ఏరో స్పేస్ సేఫ్టీ కన్సల్టెంట్ గా పనిచేస్తున్న ఆంటోనీ బ్రిక్ హౌస్ కూడా ఖలీద్ మాదిరిగానే అనుమానాలను వ్యక్తం చేశారు. టేక్ ఆఫ్ అయిన విమానానికి ల్యాండింగ్ గేర్ అసహజంగా ఉండడం ఈ ప్రమాదానికి కారణమని ఆయన భావించారు. విమానం ఉన్నట్టుండి ఒకేసారి కూలిపోతున్నప్పుడు.. ఆ దృశ్యాలను చూస్తే రన్వే వైపు ప్రయాణిస్తున్నట్టుగా కనిపించిందని ఆయన పేర్కొన్నారు.. " అంతమంది ఉన్న విమానం ప్రయాణించడానికి పూర్తి సంసిద్ధతతో ఉందా? విమానాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేశారా? విమానానికి కీలకమైన రెక్కల స్లాట్, ఫ్లాప్ లు సరైన మార్గంలోనే ఉన్నాయా? అవి విమానం ఎగరడానికి సహకరిస్తున్నాయా? విమానం కూలిపోయిన తర్వాత కనిపిస్తున్న దృశ్యాలను చూస్తుంటే అలాగే అనిపిస్తోంది. విమానాలను నడిపే క్రమంలో ల్యాండింగ్, టేక్ ఆఫ్ అనేవి అత్యంత జాగ్రత్తగా చేపట్టాల్సిన దశలు.. గాల్లో ఎగిరిన అభిమానాలు 200 నుంచి 650 అడుగులకు పైగా ఎత్తుకు చేరుకోలేనప్పుడు పైలెట్లు కచ్చితంగా టేక్ ఆఫ్ ఆపేస్తారు. అలాంటప్పుడు చివరి దశలో ఉండగానే ఈ సమస్య ఉత్పన్నమై ఉంటుందని"అమెరికా ఏవియేషన్ సేఫ్టీ కన్సల్టెంట్ జాన్ ఎం కాక్స్ ప్రకటించారువిమానానికి సంబంధించిన రెండు ఇంజిన్ లు విఫలం కావడం లేదా పక్షి ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని నిపుణులు అంచనాబిస్తున్నారు.. విమానం కూలిపోతున్నప్పుడు.. ఆ దృశ్యాలను చూస్తుంటే ఇంజన్లు శక్తిని అందించడంలో విఫలమైనట్టు తెలుస్తోంది. ఇదే అభిప్రాయాన్ని విమానయాన శాఖలో వైట్ బాడీ పైలెట్లుగా పనిచేస్తున్న వ్యక్తులు వ్యక్తం చేశారు. ఒక ఇంజన్ గనుక విఫలమైతే విమానం ఊగిపోతుంది.. కానీ అక్కడ అలాంటి పరిస్థితి లేదు. పైగా అభిమానం స్థిరంగానే ఉంది. ఈ ప్రకారం చూసుకుంటే రెండు ఇంజన్లు విఫలమైనట్టే అనుకోవాలి. రెండు ఇంజన్లలో థ్రస్ట్ లేదని ఓ కమాండర్ వెల్లడించారు. అనుకోకుండా పక్షులు ఢీకొంటే వెంటనే ఇంజన్లలో మంటలు ఏర్పడి ఉండవచ్చని.. అందువల్లే విమానం తన రెండు శక్తిని కోల్పోయి ఉంటుందని సీనియర్ పైలెట్లు చెబుతున్నారు.. ఒక ఇంజన్ విఫలం కావడం వల్ల.. లాండింగ్ గేర్ పైకి రాకపోవడం వల్ల.. రెండవ ఇంజన్ కూడా పూర్తిస్థాయిలో శక్తిని ఉత్పత్తి చేయలేకపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని..ఆ సీనియర్ పైలెట్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం

రాయచోటి, జూన్ 14

డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు పిలుపునిచ్చారు.శుక్రవారం గాలివీడు మండలం వెలిగల్లు ప్రాజెక్టు జలాశయం సమీపంలోని పార్కులో నిర్వహించిన యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా... జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనపై రూపొందించిన ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ (ఈగిల్) ప్రచార పోస్టర్లను అధికారులతో కలిసి డిఆర్ఓ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూముఖ్యంగా దేశ, రాష్ట్ర భవిష్యత్తుకు అవసరమైన యువత డ్రగ్స్ బారిన పడకుండా చూడడం మనందరి బాధ్యత అన్నారు. డ్రగ్స్ తయారుచేసిన, పండించిన, కలిగి ఉన్న, ఉత్పత్తి చేసిన, అమ్మినా, కొన్నా, రవాణా చేసిన, వినియోగించిన, ఎగమతి దిగుమతి చేసినా, గిడ్డంగి సదుపాయం కల్పించిన కూడా చట్ట రీత్యా నేరమన్నారు. ఈ తరహాలో నేరస్థులకు సహకరించిన, ఆర్థిక సహాయం చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుని విధంగా ఈగల్ టీంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరిసర ప్రాంతాలలోని ఎవరైనా వ్యక్తులు మాదకద్రవ్యాలను వినియోగిస్తున్న, రవాణా చేస్తున్న టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందివ్వాలన్నారు. రేపటి సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని డిఆర్వో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డిఓ శ్రీనివాస్, డ్వామా పీడీ వెంకటరత్నం, జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం, మండల స్పెషల్ అధికారి, తాసిల్దార్ భాగ్యలత, ఎంపీడీవో జవహర్ బాబు, వివిధ శాఖల జిల్లా మరియు మండల స్థాయి అధికారులు, వెలిగల్లు ఇరిగేషన్ సిబ్బంది, ఉపాధి సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.ప్రతి వ్యక్తి నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని జిల్లా రెవిన్యూ అధికారి మధుసూదన్ రావు పేర్కొన్నారు.యోగాంధ్ర- 2025 జిల్లాస్థాయి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గాలివీడు మండలం వెలిగల్లు ప్రాజెక్టు జలాశయం సమీపంలోని పార్కులో పర్యాటక శాఖ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అత్యంత ఆహ్లాదకర వాతావరణంలో జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం, ఆర్ అండ్ బి ఈ ఈ వాసుదేవ రెడ్డి లతో కలిసి జిల్లా రెవిన్యూ అధికారి మధుసూదన్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ.... ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా జరుపుకోవడం జరుగుతుందని , కానీ ఈసారి జరిగే 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవం గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరియు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మన రాష్ట్రంలో విశాఖపట్నం నందు జరుపుకోవడం ఒక ప్రత్యేకతను సంతరించుకుంటోందన్నారు. అందులో భాగంగా మన గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఆదేశాల మేరకు మే 21 నుండి జూన్ 21 వరకు ప్రతి జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు.

# సచివాలయ ఉద్యోగులకు సొంత మండలాల్లో పోస్టింగ్ లేదు

బ్రహ్మంగారిమఠం.

గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో వారి సొంత మండలంలో పోస్టింగ్ ఇవ్వరాదని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ ప్రక్రియకు సంబంధించి గురువారం జారీచేసిన మార్గదర్శకాల్లో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. 2025 మే 31 నాటికి ఒకే సచివాలయంలో ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారికి బదిలీ తప్పనిసరి. స్థానచలనం కల్పించిన ఉద్యోగుల వివరాలు హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్లో జులై 10లోగా అప్లోడ్ చేయాలి.బదిలీల తరువాత సచివాలయాల్లో నిర్దేశించిన దానికంటే అధికంగా ఉన్న ఉద్యోగులు తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆయా చోట్లే కొనసాగనున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం కలెక్టర్లకే పూర్తి అధికారాలు కల్పించింది. ఈ నెల 30లోగా ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించింది.

బదిలీల్లో వీరికి ప్రాధాన్యం

అంధులు.

మానసిక వికలాంగులైన పిల్లల తల్లిదండ్రులు.

గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకుపైగా పనిచేసిన వారు.

40 శాతానికి పైగా అంగవైకల్యం ఉన్నవారు.

క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ మార్పిడి సమస్యలు ఉన్నవారు.

కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు పొందిన వారు.

భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైతే వీలైనంత వరకు సమీప ప్రాంతాల్లో వారిని నియమించాలి.

వీరందరివీ రిక్వస్ట్ ట్రాన్స్ఫర్లుగా పరిగణించి ప్రయాణ భత్యాలు వర్తింపజేయాలి.

ఐటీడీఏల్లో మొదట ఖాళీలు నింపాలి.

అంతర్గత, వెనుకబడిన ప్రాంతాల్లో ఖాళీల భర్తీకి ప్రాధాన్యమివ్వాలి.

ఐటీడీఏ ప్రాంతాల నుంచి బదిలీ అయిన వారి స్థానంలోకి వేరొకరు వచ్చి చేరాకే రిలీవ్ చేయాలి.

హేతుబద్ధీకరణ, బదిలీలు ఒకేసారి..

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల హేతుబద్ధీకరణ, బదిలీలను ప్రభుత్వం ఒకేసారి చేపట్టింది. హేతుబద్ధీకరణకు సంబంధించిన జీవోలు (నంబర్లు 1, 3, 4) అనుసరించి బదిలీలు చేయాలని కలెక్టర్లకు సూచించింది. జనాభా పరంగా సచివాలయాలను ప్రభుత్వం పలు కేటగిరిలుగా విభజించింది. 'ఏ' కేటగిరి సచివాలయాల్లో ఆరుగురు, 'బీ'లో ఏడుగురు, 'సీ'లో ఎనిమిది మంది ఉద్యోగులను ఉంచాలని నిర్ణయించింది. వీరిని స్పెసిఫిక్ పర్పస్ (టెక్నికల్), జనరల్ పర్పస్ ఫంక్షనరీలుగా గుర్తించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను బదిలీల్లో కలెక్టర్లు పాటించనున్నారు.

డిప్యుటేషన్లపై మిగులు ఉద్యోగులు

హేతుబద్ధీకరణ, బదిలీల ప్రక్రియ పూర్తయ్యాక సచివాలయాల్లో మిగులు ఉద్యోగులను ఇతర ప్రభుత్వ శాఖలకు డిప్యుటేషన్లపై పంపనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 వేల నుంచి 15 వేల మంది మిగులు ఉద్యోగులు ఉంటారని అంచనా. వీరందర్నీ ప్రస్తుతానికి అవే సచివాలయాల్లో కొనసాగిస్తారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో అవసరాల మేరకు వీరిని దశలవారీగా డిప్యుటేషన్లపై పంపాలని నిర్ణయించారు. గత వైకాపా ప్రభుత్వం ఒక్కో సచివాలయంలో 8 నుంచి 12 మంది ఉద్యోగులను నియమించింది. హేతుబద్ధీకరణలో ఆ సంఖ్యను 6 నుంచి 8కి కూటమి ప్రభుత్వం తగ్గించింది. మరోవైపు సొంత మండలాల్లో పోస్టింగ్ ఇవ్వరాదన్న నిబంధనను తొలగించాలని ఆయా ఉద్యోగ సంఘాల నేతలు వేర్వేరు ప్రకటనల్లో ప్రభుత్వాన్ని కోరారు.

# విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెస్తున్న లోకేష్

రాజమహేంద్రవరం :

ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే విధంగా విద్యావ్యవస్థలో సమూల మార్పులకు మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు (వాసు) చెప్పారు. సిటిలో అప్ గ్రేడ్ అయిన అన్నపూర్ణమ్మపేట సీనియర్ నేషనల్ బేసిక్ స్కూల్, వి ఎల్ పురం శ్యామలాంబ మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్, మోరంపూడి స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్ ను శుక్రవారం ఉదయం ఆయన పంపిణీ చేసారు. ఆయా పాఠశాలల్లో అప్ గ్రేడ్ చేసిన తరగతి గదులను ప్రారంభించి ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రయివేటు పాఠశాలల్లో సీట్లకు సిఫార్సు లేఖల కోసం తల్లిదండ్రులు వస్తూ ఉంటారని గుర్తుచేసారు. అయితే వచ్చే రెండు మూడేళ్ళలో ప్రభుత్వ పాఠశాలల్లో కూడా సీటు కోసం సిఫార్సు చేయమని తమ దగ్గరకు లేఖల కోసం వచ్చేలా విద్యావ్యవస్థలో మార్పులు రాబోతున్నాయని అన్నారు. ఆ దిశగా మంత్రి లోకేష్ మార్పులు తెస్తున్నారని ఆయన అన్నారు. గతంలో ఇచ్చిన విద్యాకిట్లకు ఇప్పటికీ ఎంతో తేడా ఉందని ఎమ్మెల్యే వాసు చెబుతూ, గతంలో జగనన్న బొమ్మలు ఉండేవని, ఇప్పుడు పాలకుల బొమ్మలు కాకుండా రాష్ట్రపతిగా చేసిన ఉపాధ్యాయుడైన డా సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతొ ఆయన బొమ్మ వేసి కిట్లు ఇప్పుడు ఇస్తున్నామని అన్నారు. గతంలో యూనిఫారంలు, బ్యాగులు ఏమాత్రం నాణ్యత లేకుండా ఉండేవని, ఇప్పుడు అత్యంత నాణ్యత గల బ్యాగులు, యూనిఫారంలు ఇస్తున్నామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఇక ఇప్పటివరకు పాఠశాల స్థాయిలోనే మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం ఉంటేనే బాగా చదువుతారని భావించి జూనియర్ కాలేజీల్లో కూడా మధ్యాహ్నం భోజన పథకం మంత్రి లోకేష్ ప్రవేశపెట్టినట్లు ఆయన చెప్పారు. గతంలో జగనన్న గోరుముద్ద వంటి పేర్లతో పథకాలు పెడితే, కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరుతొ మధ్యాహ్నం భోజన పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందని ఎమ్మెల్యే వాసు హర్షధ్వానాల మధ్య చెప్పారు.

# పామాయిల్ రైతాంగానికి కేంద్రం భరోసా

## కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

## రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి

## రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

రంగారెడ్డి

ఫామాయిల్ సాగు చేసే రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. వికసితు కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లాలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి పర్యటించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని కల్లెం జంగారెడ్డి గార్డెన్ లో జరిగిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మే 29 నుంచి జూన్ 12వ తేదీ వరకు దేశవ్యాప్తంగా వికసిత్ కృషి సంకల్పయాత్ర కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలను రైతాంగాన్ని వివరిస్తున్నామన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాధారణ పంటలతో కాకుండా ఆదాయాన్ని ఇచ్చే పంటలపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ప్రధానంగా దేశవ్యాప్తంగా పామ్ ఆయిల్ సాగు పెరుగుతోందని చెప్పారు. మూడు ఎకరాల్లో సాగు చేసే రైతు సంవత్సరానికి మూడు లక్షల రూపాయలకు పైగా ఆదాయం సమకూరే అవకాశము ఉందని తెలిపారు. అందుకు కేంద్ర ప్రభుత్వం మార్కెటింగ్ వసతి కూడా కల్పిస్తుందని గుర్తు చేశారు. వరి, మక్కా ఉత్పత్తుల్లో రికార్డు స్థాయిలో భారతదేశం నిలుస్తోందని వివరించారు. ప్రధానంగా ఆహార భద్రత, పోషకాహారం, ఆదాయం సమకూరే పంటలపై కేంద్రీకరించాలని రైతులకు సూచించారు. టమాట పండించే రైతులకు సైతం కేంద్ర ప్రభుత్వం మార్కెటింగ్ వసతి కల్పించడంతో పాటు రవాణా చార్జీలు కూడా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందని రైతాంగం ఆదాయాన్ని ఇచ్చే పంటలపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఈ రైతు వ్యవసాయ రంగంలో నష్టపోకుండా ఉండేందుకే కేంద్రం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకుంటుందని వివరించారు. ప్రధానమంత్రి ప్రారంభించిన కృషి సంకల్ప అభియాన్ మే 29 నుండి జూన్ 12 వరకు కొనసాగించినట్టు చెప్పారు. సుమారుగా 1.5 కోట్ల మంది రైతులతో ముఖాముఖి ప్రత్యక్ష సంభాషణ కొనసాగిస్తూ 700 జిల్లాలు 2000 పైగా శాస్త్రీయ పరికరాల బృందాలతో నూతన సాంకేతిక, ప్రభుత్వ పథకాలపై సమాచారాన్ని రైతులందరికీ తెలియజేస్తున్నామన్నారు. రైతుల నుంచి అభిప్రాయాలను తెలుసుకొని ఒక నూతన ఆవిష్కరణ డాక్యుమెంటేషన్ ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. సందర్శించారు. దేశంలో నరేంద్ర మోడీ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు.

తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వరి ధాన్యాల ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం భారతదేశనికే మార్గదర్శకంగా నిలుస్తుదని గుర్తు చేశారు. తెలంగాణలోనూ పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగంలో రైతులకు వెన్నుదలుగా నిలిచేందుకు 35 వేల కోట్ల రూపాయలను రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. వ్యవసాయ రంగానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వాలు సద్వినియోగం చేసుకోకపోవడం వల్ల రైతుల నష్టపోయారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం భువ కేంద్ర ప్రభుత్వంతో కలిసి వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ భగీరథ్ చౌదరి, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి, ఐసిఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జాట్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఏకే నాయక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డీకే యాదవ్ పాల్గొన్నారు.

# ఇంటర్ అర్హతతో ఎస్ఎస్‌సీలో ఉద్యోగాలు..

హైదరాబాద్ జూన్ 10

నిరుద్యోగ అభ్యర్థులకు గుడ్ న్యూస్. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ సీ, గ్రేడ్ డీ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ధరఖాస్తులు ఆహ్వానిస్తోంది. దాదాపు 261 ఉద్యోగాల నియామకానికి అధికారులు నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. ఈ నోటిఫికేషన్ కు ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఖాళీల సంఖ్య: 261

విద్య అర్హత: స్టెనోగ్రాఫర్ గ్రేడ్ సీ పోస్ట్ కు ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. అదేవిధంగా ఇంగ్లీష్ లేదా హిందీ భాషలో భాషలో స్టెనోగ్రఫీ వచ్చి ఉండాలి.

వయసు: 18-30 ఏళ్ల లోపు ఉండాలి

దరఖాస్తుకు ప్రారంభ తేది: 6 జూన్ 2025

దరఖాస్తుకు చివరి తేది: 26 జూన్ 2025

ఫీజు చెల్లింపుకు చివరి తేది: 27 జూన్ 2025

దరఖాస్తు సవరణకు డేట్స్: 1జులై నుంచి జూలై 2 వరకు

ఎగ్జామ్ డేట్స్: 2025 ఆగస్ట్ 6 నుంచి ఆగస్ట 11

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.100గా, ఇక ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ, ఎక్స్ సర్వీస్ మెన్, మహిళా అభ్యర్థులకు ఎలాంటి ఫీజు లేదు.

ఎగ్జామ్: జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ నుంచి 50 మార్కులు, జనరల్ అవేర్నెస్ నుంచి 50 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ నుంచి 100 మార్కులు. మొత్తం 200 మార్కులకు గాను పరీక్ష ఉంటుంది.

పరీక్ష వ్యవధి: 2 గంటలు ఉంటుంది.

ఉద్యోగ ఎంపిక ప్రక్రియ: స్టెనోగ్రఫీ స్కిల్ టెస్ట్, కంప్యూటర్ బేస్ డ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు

దరఖాస్తు విధానం: ఆన్ లైన్

# హరీష్‌రావుకు హైకోర్టులో ఊరట

హైదరాబాద్ జూన్ 10

మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుకు హైకోర్టులో ఊరట లభించింది. హరీష్‌రావుపై దాఖలైన ఎన్నికల పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఎన్నికల సమయంలో తప్పుడు వివరాలను వెల్లడించాడని చక్రధర్‌గౌడ్ హైకోర్టులో పిటిషన్ వేశాడు. మంగళవారం చక్రధర్ గౌడ్ వేసిన పిటిషన్ పై కోర్టు విచారణ చేపట్టింది. హరీష్‌రావు తరుపున మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ రాంచందర్‌రావు వాదనలు వినిపించారు. పిటిషనర్ ఎలాంటి ఆధారాలు నిరూపించకపోవడంతో న్యాయస్థానం.. పిటిషన్ ను కొట్టివేస్తున్నట్లు తెలిపింది.

# వైసీపీ ఆరోపణలు నిరూపిస్తే ఎమ్మెల్యే, మంత్రి పదవికి రాజీనామా చేస్తా

మంగళగిరి

వైసీపీ ఆరోపణలు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే, మంత్రి పదవికి రాజీనామా చేస్తానని, నిరూపించలేకపోతే పులివెందుల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా అంటూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత జగన్ కు సవాల్ విసిరారు.

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ వైసీపీ ఆరోపిస్తున్నట్లు 'తల్లికి వందనం' నిధులు లోకేష్ జేబులోకి వెళ్లినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా, నిరూపించలేకపోతే పులివెందుల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయగలరా? అని జగన్ కు సవాల్ విసిరారు.

విద్య విలువ తెలిసిన నాయకుడు నారా లోకేష్ అయితే.. విద్యకు ప్రాధాన్యతనిచ్చిన ప్రభుత్వం ఎన్డీయే ప్రభుత్వం అన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి అమ్మఒడి ఇచ్చి మాట నిలబెట్టుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందంగా ఉన్నారు. 67లక్షల 27వేల 164 మందికి తల్లికి వందనం అందజేశాం. దాదాపు 8,745 కోట్లు తల్లికి వందనం కింద డైరెక్టుగా తల్లుల అకౌంట్లలోకి నిధులు జమ అయ్యాయి. తల్లిదండ్రులు, పిల్లలు చాలా ఆనందంగా ఉన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు కట్టుకుంటూ తల్లికి వందనం ఇవ్వడం గొప్ప విషయం. ఇందులో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ బాబుల కృషి ఎనలేనిది. తల్లికి వందనం పథకానికి 10వేల 091 కోట్లు వ్యయం చేయనున్నాం. పాఠశాలల అభివృద్ధి కోసం 13వేల 046 కోట్లు వెచ్చించాం. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం అందజేస్తున్నాం. ఒక్కరుంటే 13వేలు, ఇద్దరుంటే 26వేలు, ముగ్గురుంటే 36వేలు, నలుగురుంటే 52వేలు, ఐదుగురుంటే 65వేలు అందజేశాం. ఒక కుటుంబంలో ముగ్గురు ఆడబిడ్డలున్నారు, వారికి తల్లికి వందనం అందడంతో పత్రికా ముఖంగా వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. 5మందికి 65వేలు తల్లికి వందనం అందడంతో వారు చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ లకు ఫోన్లు చేసి మా బిడ్డలకు సహకరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నారు. గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో జగన్ "నాచెల్లెమ్మలు, నా ఆడపడుచులు, వారి బిడ్డలకు నేను మేనమామ"అని చెప్పుకున్నారు. అధికారంలోకి వచ్చాక కంసమామగా మారారు. ఎన్నికలకు ముందు జగన్ ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి అమ్మఒడి ఇస్తామని చెప్పి అధికారంలోకి రాగానే మోసం చేశారు. ఒకరికే ఇచ్చి పరిమితులు పెట్టారు. ఎన్డీయే ప్రభుత్వం పరిమితులు పెట్టలేదు, ఎంతమంది ఉంటే అంతమంది పిల్లలకు అమ్మఒడి అందజేసింది. 2022-23లో జగన్ రూ.42లక్షల 61వేల మందికే అమ్మఒడి ఇచ్చారు. మొత్తం రూ.5వేల 500 కోట్లే ఇచ్చారు.

# దోర్నాల గ్రామంలో బొక్కల లారీలు పట్టివేత - ఉద్రిక్తత వాతావరణం

వికారాబాద్

ధరూర్ మండలం దోర్నాల గ్రామంలో మరియసిడ్స్ కంపెనీకి చెందిన బొక్కల లారీలు స్థానిక ప్రజలు అడ్డుకుని పట్టుకున్నారు. ఈ లారీలు చుట్టుపక్కల గ్రామాల్లో రసాయన మాలిన్యాలను కలిమి వేస్తున్నాయంటూ గ్రామస్తులు ఆరోపించారు. దీనివల్ల దోర్నాల, చుట్టు పక్కల ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు వారు తెలిపారు. రాత్రివేళ రహస్యంగా బొక్కల లారీలు కంపెనీ కు తీసుకువచ్చే సమయంలో, స్థానికులు అప్రమత్తమై లారీలను అడ్డగించారు. వెంటనే పెద్ద సంఖ్యలో గ్రామస్తులు గుమిగూడటంతో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని నియంత్రించారు.

ప్రజలు అధికారులను దుయ్యబట్టారు ? ఎంతకాలంగా దీనిపై ఫిర్యాదులు చేస్తూ వచ్చినా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు కలెక్టర్ వచ్చి మాకు హామీ ఇస్తేనే ధర్నాను విరమించుకుంటామని తెలియజేశారు. మలినాల వల్ల భూమి ఉత్పాదకత తగ్గిపోవడం, మంచినీటి కలుషితం కావడం, చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నట్లు వారు ఆరోపించారు మరియు చాల మంది వృద్ధులు కూడా చనిపోయి అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటన ధరూర్ మండలాన్ని కుదిపేసింది. ప్రజలు పారిశుధ్య శాఖ, కాలుష్య నియంత్రణ మండలి తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# స్వచ్చన్నంగా రక్తదానం చేయండి: దేశాయ్ నెట్వర్క్ అధినేత, టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్

## మెగా రక్తదాన శిబిరం

## స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న యువత

నందవరం(

మండలం గ్రామ పంచాయతీ ఆవరణంలో శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా బివి జయ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దేశాయ్ నెట్వర్క్ యూత్ వారి మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేశాయి నెట్వర్క్ అధినేత టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్ మాట్లాడుతూ ప్రపంచ



రక్తదాతల దినోత్సవం సందర్భంగా,అన్ని దానాల్లోకెల్లా రక్తదానం మిన్న, రక్తదానం.మహాదానం అంటూ ఎన్ని ప్రచారాలు చేసినా, స్పందన మాత్రం కొందరిలోనే కనిపిస్తోంది. రక్తదానం చేయాలని ఉన్నా కొన్ని అపోహలు, మనకెందుకులే అన్న భావనతో చాలా మంది రక్తదానం చేసేందుకు ఇష్ట పడడంలేదు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండగా, ప్రస్తుతం సేకరిస్తున్న రక్తం ఆపదలో ఉన్నవారికి సరిపోవడంలేదు. విపత్కర పరిస్థితుల్లో మేమున్నామంటూ కొంతమంది రక్తదాతలు ముందుకొచ్చి దానం చేయడంతోపాటు అడపాదడపా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాల్లో పాల్గొంటూ అపాయంలో ఉన్నవారిని ఆదుకుంటున్నారు. ఇటువంటి సమయంలో స్వచ్ఛంద సంస్థలు, యువకులు చొరవచూపి రక్తదానానికి ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

18-60 సంవత్సరాల మధ్య వయస్సు గల ఆరోగ్యవంతమైన వ్యక్తులు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం చేయడానికి ముందు దాతలు తమ రక్తాన్ని తెలుసుకోవడం,సమీప రక్త బ్యాంక్‌లో నమోదు చేసుకోవడం ముఖ్యం. ఈ రోజు రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు, వళ్ళు జ్యూన్ అందజేస్తున్నారు, ఇది దాతలను మరింత ప్రోత్సహిస్తున్నారు. ప్రపంచ ర క్త దా త ల దినోత్సవం 2025 స వ రా జ ం లో రక్తదానం యొక్క ప్రాముఖ్యతను మరోసారి గుర్తుచేస్తోంది."రక్తం ఇవ్వండి, ఆశను ఇవ్వండి" అనే థీమ్‌తో, ఈ రోజు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి,ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిస్తోంది. రక్తదానం ఒక చిన్న చర్య కాదు. ఇది సమాజంలో సమరస్యాన్ని,జీవన ఆశను నింపే గొప్ప దానం. ఇటువంటి సమయంలో స్వచ్ఛంద సంస్థలు, యువకులు చొరవచూపి రక్తదానానికి ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ కార్యక్రమంలో మల్లెలప్రిన్డ్ రాజ్ , మండల క్లస్టర్ ఇంచార్జ కాసిం వలి, రైస్ మిల్ నారాయణరెడ్డి, శివ ,కాసిం, విశ్వనాథ్,సత్తిరెడ్డి,వీరేష్,పార్టీ నాయకులు కార్యకర్తలు దేశాయ్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

# మంచి విష్ణు బ్రాహ్మణ సమాజానికి తక్షణమే క్షమాపణ చెప్పాలి

మల్కాజిగిరి

మంచు విష్ణు నటిస్తున్న కన్నప్ప సినిమాలోని కొన్ని సన్నివేశాలు బ్రాహ్మణులను కించపరిచే విధంగా ఉన్నాయని , తక్షణమే కన్నప్ప సినిమాను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి బ్రాహ్మణ సంఘాలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా సనాతన ధర్మం పరిరక్షణ సంఘం అధ్యక్షుడు ప్రియతమ రామకృష్ణ మాట్లాడుతూ గతంలో కూడా మంచు కుటుంబము ఇలానే బ్రాహ్మణులను కించపరిచే విధంగా సినిమా చేపట్టి పాపం మూటకట్టుకున్నారని , దాని కారణంగానే వారి కుటుంబ కుక్క చింపిన విస్తరాకు లాగా మారిందని ఇప్పటికి మంచు కుటుంబానికి బుద్ధి రాలేదని వ్యాఖ్యానించారు. కన్నప్ప సినిమాలోని కొన్ని సన్నివేశాలు బ్రాహ్మణులను కించపరిచే విధంగా ఉన్నాయని , ప్రభుత్వం తక్షణమే ఈ సినిమా విడుదలను నిలిపివేయాలని లేనియడల రానున్న రోజుల్లో బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు.

# గుంటూరు జిల్లా జైలుకు కొమ్మినేని

గుంటూరు

అమరావతి మహిళలపై అసభ్య వ్యాఖ్యల కేసులో అరెస్టయిన సాక్షి ఛానల్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు ను పోలీసులు గుంటూరు జిల్లా మంగళగిరి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. అనంతరం గుంటూరు జిల్లా జైలుకు ఆయనను తరలించారు. హైదరాబాద్‌లో కొమ్మినేనిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

# బస్ భవన్ ను ముట్టడించిన బీఆర్ఎస్వీ

హైదరాబాద్

టి.జి.ఎస్.ఆర్.టి.సి విద్యార్థులు , సామాన్యుల బస్ పాస్ చార్జీలు పెంచిన నేపథ్యంలో బి.ఆర్.ఎస్.వి ఆధ్వర్యంలో ఆర్.టి.సి క్రాస్ రోడ్ లోని బస్ భవన్ ను ముట్టడించారు...

ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్.వి రాష్ట్ర అధ్యక్షుడు గేల్లు శ్రీనివాస్ యాదవ్ , విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ధర్నా చేస్తున్న బి.ఆర్.ఎస్.వి నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి నాంపల్లి , చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ లకు తరలించారు.

# బీబీపేట్ గ్రామంలో చిరుత హల్చల్

సంగారెడ్డి

కల్హేర్ మండలం బిబిపేట్ గ్రామంలో టెన్షన్ నెలకొంది. మాజీ జడ్పిటిసి గుండు మోహన్ ఇంట్లోకి చిరుత చొరబడింది. ఘటనలతో గ్రామస్థులు ఆందోళనలో వుండిపోయారు. పెద్దపెద్ద శబ్దాలతో పులిని బయటకు పంపే ప్రయత్నాలు చేసారు. గ్రామస్థులు సమాచారం ఇచ్చిన ఘటన స్థలానికి ఫారెస్ట్ అధికారులు చేరుకున్నారు. ..

======================

# అగ్నివీర్ సైనికుడు మురళీ నాయ్ కుటుంబానికి పవన్ కళ్యాణ్ ఆర్థిక సహాయం

ఆపరేషన్ సిందూర్ లో వీర మరణం పొందిన అగ్నివీర్ సైనికుడు శ్రీ మురళీ నాయక్ కుటుంబాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరామర్శించి రూ. 25 లక్షలు ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు శనివారం ఉదయం మురళీ నాయక్ తల్లితండ్రులకి పవన్ కళ్యాణ్ పంపించిన రూ. 25 లక్షల చెక్కును తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కల్లి తండాకు వెళ్ళి అందచేశారు. ఈ కార్యక్రమంలో అహుడ ఛైర్మన్ టి.సి.వరుణ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, జనసేన పార్టీ నేతలు పత్తి చంద్రశేఖర్, కాయగూరల లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

========================

# టీపీసీసీ ఛీఫ్ ను కలిసిన మంత్రి శ్రీహరి

హైదరాబాద్

గాంధీ భవన్ లో పీసీసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో మంత్రి వాకిటి శ్రీహరి మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ నాకు మంత్రి పదవి ఇచ్చినందుకు బాధ్యత గా నిర్వహిస్తా. నాకు మంత్రిగా అవకాశం ఇచ్చిన సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డికి,పీసీసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు జీవితాంతం రుణపడి ఉంటా. నేను చచ్చే వరకు ప్రజల్లో ఉండి, ప్రజలకు సేవ చేస్తా మక్తల్ ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానని అన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకే రాష్ట్రంలో కులగణన చేసిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి. రాజాకీయల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న వ్యక్తి పీసీసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్. నేను మంత్రి కావడానికి బహబూబ్నగర్ ఎమ్మెల్యేలందరు సపోర్ట్ చేశారు...వారికి ప్రత్యేక ధన్యవాదాలని అన్నారు.

# పిడుగు పాటుతో మృతి చెందిన కుటుంబాలను ఆదుకుంటాం: ఎమ్మెల్యే



ఉట్నూర్ జూన్ 13 (భారత శక్తి): ఆదిలాబాద్ జిల్లా గాదిగూడా మండలంలోని పిప్పిరి గ్రామంలో నలుగురు మంది, బేల మండలంలోని సొన్నాస్, సాంగ్విడి గ్రామంలో ఇద్దరు పిడుగు పాటుతో మృతి చెందటం దురదృష్టకరమని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.గాదిగూడ,బేల మండలాల్లో పిడుగు పాటుతో 6 మంది అక్కడికక్కడే మృతి చెందటం తీవ్రంగా కలిచివేసిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

వర్షాలు కురుస్తున్న సమయంలో రైతులు పంట పొలాలలో వెల్లకూడదని సూచించారు.రిమ్స్ ఆసుపత్రిలో పిడుగు పాటుతో తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యాన్ని అందించాలని దాక్టర్లకు ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మృతుల పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు.

# టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్యేవెడ్మ బొజ్జు పటేల్ కు సన్మానం



ఉట్నూర్,జూన్14(భారత శక్తి): ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కు కాంగ్రెస్ అధిష్టానం రెండోసారి టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ను కాంగ్రెస్ జిల్లా నాయకులు డాక్టర్ దాసన్న ప్రభాకర్ శుక్రవారం హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు దాసరి ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ను శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషి తో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ప్రజల మన్ననలు పొందడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ అధిష్టానం బొజ్జు పటేల్ కు రెండోసారి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గా నియమించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి పార్టీ అధిష్టానానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ దాసన్న ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

# %AI% సాయంతో వేగంగా వెంకన్న దర్శనభాగ్యం

తిరుపతి జిల్లా ప్రతి నిధి/బెంగళూరు నగరం, జూన్ 14 (భారత శక్తి):- %గా×% సాయంతో తిరుమల కొండపై శ్రీవారి దర్శనాన్ని గంటలోపే పూర్తి చేసుకునేలా సన్నాహాలు చేస్తున్నామని టీటీడీ చైర్మన్ బి. ఆర్. నాయుడు వెల్లడించారు. చైర్మన్ బాధ్యతలు చేపట్టిన తరువాత తిరుమల కొండపై భారీగా ప్రక్షాళన చేస్తున్నామన్నారు.

రానున్న రోజుల్లో టీటీడీ రూపురేఖలు మరింతగా మార్చేస్తామన్నారు. ఆయన బెంగళూరు నగరంలో తెలుగు విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు ఆయన వ్యాఖ్యానించారు.



# రాజ్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ %&% ప్రెసిడెంట్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ స్టేట్ చేతుల మీదుగా బ్లడ్ డోనర్ అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్




(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జూన్ 14: హైదరాబాదులోని రాజ్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ %ఆ% ప్రెసిడెంట్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ స్టేట్ చేతుల మీదుగా కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఎంతో ప్రతిష్టాత్మకమైన బెస్ట్ బ్లడ్ డోనర్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక కామారెడ్డి జిల్లా కలెక్టర్ కు మాత్రమే ఈ అవార్డు రావడం గమనార్హం. గత సంవత్సరంనుండి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులుగా చేసిన సేవలకు గాను ముఖ్యంగా జిల్లాలో ఎక్కువ సంఖ్యలో రక్తదాన శిబిరాలు ప్రభుత్వపరంగా నిర్వహించడం వలన ఈ ప్రత్యేక అవార్డు పొందడం జరిగింది. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో జిల్లా రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ ఎం. రాజన్నతో కలిసి జిల్లా అధికారులు అందరితో రక్తదాన విషయంలో సమీక్ష జరిపేవారు. ప్రతి జిల్లా అధికారులు వారి సిబ్బంది తప్పక రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని మోటివేట్ చేయడం మూలంగా ప్రతి నెల రెండు ప్రభుత్వ శాఖల అధికారులు సిబ్బంది విరివిగా రక్తదానం చేసేవారు. ఇలా సేకరించిన రక్త యూనిట్లను జిల్లాలోని పేద ప్రజల ఆరోగ్య అవసరాల కొరకు వినియోగించేవారు. అవార్డును స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా ప్రజల ఆరోగ్య అవసరాల దృష్ట్యా విరివిగా రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తాన్ని సేకరించి ప్రజల ఆరోగ్య అవసరాల నిమిత్తం అందించినందుకు చేసిన కృషికిగాను గవర్నర్ అవార్డు రావడం గర్వకారణమని, జిల్లా కలెక్టర్ గా, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులుగా ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, రక్తాన్ని స్వీకరించడంలో తనతో పాటు కృషిచేసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్, స్టేట్ ఎంసీ మెంబర్ సంజీవరెడ్డి, ఐఆర్సిఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులకు, జిల్లా అధికారులు, జిల్లా ప్రజలు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇకముందు కూడా ఈ సేవలను కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.

# భూ నిర్వాసితులకు పరిహారం పంపిణీ

## పది మందికి నష్టపరిహారం చెక్కులు అందించిన కలెక్టర్

వేములవాడ, జూన్ 14 (భారత శక్తి): వేములవాడ పట్టణంలో రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు శనివారం చెక్కులు పంపిణీ చేశారు. వేములవాడ తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్న సందర్భంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులకు జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, వేములవాడ ఆర్డీవో రాధాబాయి చెక్కులు పంపిణీ చేశారు. వేములవాడలోని 10 మందికి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ ఘాతంతో ఆవు మృతి



ఉట్నూర్ రూరల్, జూన్ 14 (భారత శక్తి):ఉట్నూర్ మండలంలోని గంగాపూర్ లో పెందూరు ప్రభాకర్ కి చెందిన ఆవు విద్యుత్ షాక్ తో మృతి చెందింది. ఆవు యజమాని అధికారులకు సమాచారం ఇవ్వగా మండల ఇంచార్జి పశువైద్యాధికారి డా.విజయ్ కుమార్ సంఘటన స్థలానికి సందర్శించి పంచనామా నిర్వహించారు, ఆవు పొలంలో మేస్తు విద్యుత్ స్తంభంఎర్తింగ్ వైర్ కు తగిలి కరెంట్ షాక్ కి గురి చెందినట్లు నిర్ధారించారు. ఆవు నిండు గర్భిణి గా గుర్తించి దీని విలువ సగటుగా 50 వేలు ఉంటుందని ఆవు యజమాని పెందూరు ప్రభాకర్ తెలిపారు. విద్యుత్ శాఖ ద్వారా నష్టపరిహారం చెల్లించాలని యజమాని అధికారులకు కోరారు.

# కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మృతులకు క్రొవత్తులతో నివాళులు

ఉట్నూర్ జూన్14(భారత శక్తి): అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో ప్రయాణికుల మృతి అదేవిధంగా ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలో పిడుగుపాటుకు మృతి చెందిన మృతులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉట్నూర్ లోని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ క్యాంపు కార్యాలయంలో మృతులకు శాంతి ఆత్మ శాంతి చేకూరాలని కొవ్వతులతో నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ విమాన ప్రమాదంలో ప్రయాణికులు,చేనులో పనిచేస్తున్న కూలీలపై పిడుగు పడి మృతి చెందడం బాధాకరమని వారన్నారు. ఈ కార్యక్రమంలోఉట్నూర్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు అబ్దుల్ ఖయ్యూం, జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జై వంతరావు ఆదిలాబాద్ ఆర్టిఏ సభ్యులు దూట రాజేశ్వర్, బ్లాక్ అధ్యక్షులు ఇక్బాల్, ఉట్నూర్ సహకార చైర్మన్ సామ ప్రభాకర్ రెడ్డి, నాయకులు మరసుకొల తిరుపతి,కొత్తపల్లి మహేందర్, బిరుదుల లాజర్, జాదవ్ జగదీష్,హాజీం సార్, తులసమ్,రాధాబాయి, పరమేశ్వర్, సుశీల్ కుమార్, కొల్లూరి స్వామి,హనుమంత్, అచ్చ దేవానందం జావిద్ అన్సారి, తదితరులు పాల్గొన్నారు.



# పోగొట్టుకున్న 13 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగింత

## -ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు 2276 మొబైల్ ఫోన్లను రికవరీ

## -వివరాలు వెల్లడించిన అడిషనల్ డీసీపీ లా%ఆ% ఆర్డర్




ఖమ్మం (ప్రతినిధి (భారత శక్తి), జూన్ 14:పోగొట్టుకున్న13 మొబైల్ ఫోన్లను (సి ఈ ఐ ఆర్) సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి బాధితులకు అప్పగించినట్లు అడిషనల్ డీసీపీ లా%ఆ%ఆర్డర్ ప్రసాద్ రావు తెలిపారు.పోగొట్టుకున్న,చోరీకి గురైన మొబైల్ ఫోన్ ను బాధితులు సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో మొబైల్ ఫోన్ ట్రాక్ చేసిన ఐటి సెల్ బృందం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచనలతో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో యజమానులకు అడిషనల్ డీసీపీ చేతుల మీదుగా అప్పగించారు.ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ...సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ విధానంతో సుమారు నాలుగు లక్షల విలువ గల 13 ఫోన్లను ట్రేస్ చేసి, నిజమైన యజమానులకు అప్పగించినట్లు తెలిపారు.ఒక్కొక్క మొబైల్ ఫోన్ యాభై వేల నుండి 10 వేల రూపాయలు ఖరీదు గల ఫోన్లను ట్రాక్ చేయడం జరిగిందన్నారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఇప్పటికే 4483 మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు %జఞ×% పోర్టల్ ఫిర్యాదులు నమోదు కాగా 2276 ఫోన్ల ట్రాక్ ను గుర్తించి మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుత జీవన శైలిలో మొబైల్ ఫోన్ అత్యంత కీలక వరికరం అయ్యిందని, ఏదైనా సమాచారం తెలుసుకోవాలన్న...నగదు లావాదేవీలు చేయాలన్న మొబైల్ ఫోన్ పైనే ఆదారపడేంతగా ప్రాధాన్యం సంతరించుకుందని అన్నారు. మొబైల్ ఫోన్ ఎక్కడైనా పోగొట్టుకున్న /చోరీకి గురైతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించనవసరం కష్టమేనని అన్నారు. పోయిన ఫోన్ లను వెతికి పెట్టడానికి పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందన్నారు. సెల్ ఫోన్ల రికవరీ లో కీలకంగా వ్యవహరించిన ఐటి సెల్ ఎస్సై సత్యనారాయణ, టెక్నికల్ బృందాన్ని ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ అభినందించారు.

# కామారెడ్డి జాతీయ లోక్ అదాలత్‌లో కీలక లీగల్ సర్వీసెస్ లకు పరిష్కారం

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జూన్ 14: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డిఎల్ఎస్ఎ), కామారెడ్డి 2025 జూన్ 14న జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో కామారెడ్డి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డిఎల్ఎస్ఎ) ఒక ముఖ్యమైన విజయాన్ని నమోదు చేసింది. దాదాపు ?1.40 కోట్ల విలువైన ఒక మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్ కేసు సామరస్యపూరితంగా పరిష్కరించబడింది. ఈ







విజయవంతమైన పరిష్కారం కామారెడ్డి జిల్లాలో లోక్ అదాలత్ వ్యవస్థను న్యాయ ప్రాప్తిలో ప్రభావవంతమైన మాధ్యమంగా నిలబెట్టింది.

కేసు నేపథ్యం

ఈ కేసులో మరణించిన ప్రభుత్వ ఉద్యోగి శ్రీ తల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తాడ్వాయి గ్రామం సమీపంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నప్పుడు జరిగిన ప్రమాదంలో మరణించిన ఘటనకు సంబంధించింది. మృతుని కుటుంబం శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ సహా పలువురు ప్రతివాదులపై కోర్టులో క్లెయిమ్ దాఖలు చేసింది.వారు మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ (ఎంఏసిటి), జిల్లా కోర్టును న్యాయవాదులు శ్రీ టి. దేవరాజ్ గౌడ్, శ్రీ నంద రమేశ్, శ్రీ జె.పి. శ్రవణ్ గౌడ్ ద్వారా ఆశ్రయించి, ?2 కోట్ల పరిహారం కోరారు.

మధ్యవర్తిత్వం పరిష్కారం

కామారెడ్డి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సౌజన్యంతో చేపట్టిన చర్చలు, సమన్వయ కృషి ఫలితంగా, రెండు పక్షాలు ఒక సామరస్యపూరిత ఒప్పందానికి వచ్చాయి. ఇందులో ప్రతివాదులు ?1.40 కోట్లను నష్ట పరిహారంగా చెల్లించేందుకు అంగీకరించడంతో, ఈ కేసు జాతీయ లోక్ అదాలత్ ద్వారా విజయవంతంగా పరిష్కరించబడింది.

మాన్యతలు, అభినందనలు

ఈ విజయవంతమైన పరిష్కారంలో భాగంగా, గౌరవనీయ ప్రధాన జిల్లా న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, ఈ కేసులో పాత్ర వహించిన న్యాయవాదులను, సహకరించిన ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులను హృదయపూర్వకంగా అభినందించారు. ఈ పరిష్కారం ద్వారా బాధిత కుటుంబానికి సకాలంలో న్యాయం లభించడమే కాక, ప్రజలకు సత్వర, సరళమైన న్యాయవిచారణ అందించడంలో లోక్ అదాలత్ వ్యవస్థ ఎంత ప్రభావవంతంగా ఉందో స్పష్టమైంది.కామారెడ్డి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రజలందరిని తమ వివాదాలను జాతీయ లోక్ అదాలత్ వేదికగా త్వరితగతిన, తక్కువ ఖర్చుతో పరిష్కరించుకునేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు.

# రైతుల కోణంలో విత్తన చట్టం రూపకల్పనకు సలహాలు అందించాలి: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

## కలెక్టరేట్ లో విత్తన చట్టం ముసాయిదా బిల్లుపై కమిటీ సమావేశాన్ని నిర్వహించిన చైర్మన్



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), జూన్ 14:రైతులకు మేలు చేసే కోణంలో విత్తన చట్టం రూపకల్పనకు సలహాలు అందించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు.శనివారం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో విత్తన చట్టం ముసాయిదా బిల్లుపై కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ఖమ్మం ఉమ్మడి జిల్లా పరిధిలోని వ్యవసాయ అధికారులు, విత్తన డీలర్లు, రైతు సంఘాల ప్రతినిధులతో నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ నకిలి విత్తనాల కారణంగా రైతులు అనేక నష్టాలు పొలవుతున్నారని, ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కలిసి తెలంగాణ రాష్ట్ర పరిధిలో చట్ట ప్రకారం రైతులను ఆదుకునేందుకు విత్తన చట్టం ముసాయిదా బిల్లు తయారు చేసిందని అన్నారు.విత్తన చట్ట ముసాయిదా బిల్లుపై రైతుల అభిప్రాయాలను తెలుసుకొని, ఎటువంటి అంశాలు చేరిస్తే రైతులకు మేలు జరుగుతుందో తెలుసుకునేందుకు ప్రతి ఉమ్మడి జిల్లా పరిధిలో సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు. పత్తి, మిర్చి సాగు చేసే రైతులు చాలా కాలంగా నష్టపోతున్నారని అన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగాలనే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. రైతులు లేబుల్ లేని విత్తనాల ప్యాకెట్లు, లూజ్ విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దని అన్నారు. ప్రతి జిల్లాలో రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో పెట్టడం జరిగిందని అన్నారు. రైతులు అధికారులతో సమన్వయం చేసుకొని నకిలీ విత్తనాలు అరికట్టేందుకు కృషి చేయాలని అన్నారు. లిరైతు సంక్షేమ కమీషన్ సభ్యులు ఆర్. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ గతంలో రైతు తన విత్తనం ఉత్పత్తి చేసుకొని పంటలు పండించేవారని, నేడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని అన్నారు. గతంలో ములుగు జిల్లాలో నకిలీ మొక్కజొన్న విత్తనాల ద్వారా 4 వేల ఎకరాలలో పంట నష్టం జరిగితే రైతులకు 4 కోట్ల రూపాయల పరిహారం సంబంధిత కంపెనీ ద్వారా అందించడం జరిగిందని అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది జరిగిన రైతు సంక్షేమ కమీషన్ కు ఫిర్యాదు అందిస్తే వారి తరఫున సంపూర్ణ పోరాటం చేయడం జరుగుతుందని అన్నారు. గతంలో పేదలు తిన్న ఆహారం నేడు ధనవంతులు తింటున్నారని తెలిపారు. వరి పంటతో పాటు పప్పు దినుసులకు కూడా బోనస్ ఇవ్వాలని కోరారు. గత సంవత్సరం 21 వేలు ఉన్న మిర్చి పంట ఈ సంవత్సరం 12 వేలకు పడిపోయిందని, దీని వల్ల రైతులు నష్టపోయారని తెలిపారు.కార్యక్రమంలో న్యాయవాది సునీల్ మాట్లాడుతూ విత్తన చట్టం కోసం రాష్ట్ర ప్రభుత్వం ముసాయిదా బిల్లు తయారు చేసేందుకు కమిటీ ఏర్పాటు చేసిందని అన్నారు. ఒప్పంద వ్యవసాయం పేరిట రకరకాల సాగు జరుగుతోందని అన్నారు. కొత్త చట్టం లో రైతుల కోణంలో ఎటువంటి నిబంధనలు ఉంటే బాగుండాలో సూచనలు అందించాలని అన్నారు. విత్తనాల ప్రకటనలపై రెగ్యులేషన్ ఉండాలని, విత్తన ఉత్పత్తి రైతుల హక్కుల గురించి కూడా చట్టంలో పొందుపర్చాలని అన్నారు. నాణ్యత లోపాల వల్ల రైతుకు నష్టం కలిగితే పరిహారం పొందే విధానం ఉండాలని అన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతు వినియోగదారుడు అవుతారని నష్టపోతే, వినియోగదారుల ఫోరం వెళ్ళవచ్చని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. రైతుకు కలిగిన మానసిక శోభకు కూడా పరిహారం కోరవచ్చని అన్నారు. రఘునాధపాలెం గ్రామానికి చెందిన రైతు రఘురాం మాట్లాడుతూ ప్రైవేట్ కంపెనీలు తీసుకుని వచ్చే విత్తనాల జెనెటిక్స్ పరిశీలించాలని అన్నారు. నష్ట పరిహారం పరిస్థితి రాకుండా చూడాలని, విత్తనాలను పరిశీలించి ధృవీకరణ చేసినవి మాత్రమే రైతులకు అమ్మేలా చూడాలని అన్నారు. విత్తనాల ప్యాకేట్ పై క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి స్కాన్ చేస్తే ఎక్కడ పరీక్షించి సర్టిపై చేశారు వివరాలు వచ్చేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు.వైరా ప్రాంతానికి చెందిన రైతు బి. రాంబాబు మాట్లాడుతూ విత్తనాలు ఉత్పత్తి చేసే రైతులకు సంబంధిత కంపెనీలు సరిగ్గా చెల్లింపులు చేయడం లేదని, దీనిపట్ల కూడా విత్తన చట్టంలో పరిష్కారం చూపాలని అన్నారు. కంపెనీలు కొంతమంది ఏజెంట్ లకు డబ్బులు పంపితే రైతులకు పంచకుండా ఉంటున్నారని, విత్తనాల కంపెనీ నుంచి నేరుగా రైతులకు చెల్లింపులు వచ్చేలా చూడాలని అన్నారు.మంచుకొండ ప్రాంతానికి చెందిన రైతు సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని విత్తనాల కంపెనీలకు ఆర్ అండ్ డీ సెంటర్ లు ఎక్కడ ఉన్నాయో ఆన్ లైన్ లో వివరాలు అందించాలని, సంబంధిత కంపెనీ విత్తనాలు సరిగ్గా పనిచేయని పక్షంలో కంపెనీ యజమాని, డిస్ట్రీబ్యూటర్ , శాస్త్రవేత్తలపై కేసులు నమోదు చేసేలా చట్టం తయారు చేయాలని అన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు మాట్లాడుతూ కంపెనీలు వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు విత్తనాలు అందిస్తే పారదర్శకంగా ఉంటుందని అన్నారు. విత్తనాల ఉత్పత్తి కోసం రైతుల దగ్గరికి వస్తున్న మధ్య వర్తుల గుర్తింపు కోసం కలెక్టరేట్ లో ప్రత్యేక రిజిస్ట్రేషన్ సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆయిల్ పామ్ పంట ను కూడా విత్తన చట్టం పరిధిలోకి తీసుకు రావాలని అన్నారు.కొణిజెర్ల మండల వ్యవసాయ అధికారి నాగార్జున మాట్లాడుతూ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందించేలా చట్టంలో వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. ఒప్పందం లేకుండా మొక్కజొన్న పంట వేయవద్దని ప్రచారం చేసినప్పటికీ కొంత మంది రైతులు నమ్మి పంట సాగు చేశారని అన్నారు. కంపెనీ ఏజెంట్లకు ఎటువంటి అర్హత ఉండటం లేదని, దీనిని మార్చాలని అన్నారు. అనంతరం పలు రైతులు మాట్లాడుతూ, ప్రభుత్వం విత్తనాల విక్రయాల కోసం ప్రత్యేకంగా సాఫ్ట్ వేర్ తయారు చేసి విత్తనాల ప్యాకేట్ సంబంధించి సర్టిఫికెట్ రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. విత్తనాల డిస్టిబ్యూటర్ లు నిబంధనలు పూర్తి స్థాయిలో పాటించేలా కఠిన పర్యవేక్షణ తీసుకుని రావాలని అన్నారు. ఖమ్మం డీలర్ల అసోసియేషన్ ప్రతినిధి మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన లైసెన్స్ ఉన్న కంపెనీల నుంచి విత్తనాలు తెచ్చి డీలర్లు అమ్ముకుంటున్నా రని, అవి సరిగ్గా పనిచేయని పక్షంలో డీలర్ల పాత్ర ఏం ఉంటుందని, లైసెన్సింగ్ విధానం సరిగ్గా లేదని అన్నారు. కంపెనీ నుంచి కాకుండా బయట నుంచి ఎక్కడైనా విత్తనాలు కొనుగోలు చేసి రైతులకు అమ్మితే అప్పుడు డీలర్లపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బీన, ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యవసాయ అధికారి వి. బాబు రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకున్న కేసులకు శాశ్వత పరిష్కారం....

## -జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజగోపాల్

## -లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి




ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), జూన్ 14:లోక్ అదాలత్ లో కేసును ఇరుపక్షాలు రాజీ చేసుకుంటే శాశ్వత పరిష్కారం లభిస్తుందని,అంతిమ తీర్పుపై ఎటువంటి అప్పీల్ కు అవకాశం వుండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజగోపాల్ తెలిపారు.శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయ ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి. చంద్రశేఖర్ రావు అధ్యక్షతన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో అదనపు జిల్లా సెషన్స్ జడ్జ్ కె. ఉమా దేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి. వెంకటేశ్వర్ రావు లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. రాజగోపాల్ మాట్లాడుతూలి లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని సివిల్, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు రాజీ చేసుకోవాలని, ఎటువంటి రుసుము, సమయం వెచ్చించాల్సిన అవసరం లేదని తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసులు సత్వర పరిష్కారమే కాకుండా ప్రీ లిటిగేషన్ (భార్య భర్తల కేసులు, డబ్బు సంబంధించిన కేసులు, సివిల్ తగాదాలు) కూడా పరిష్కారం అవుతాయని అన్నారు. చెక్ బౌన్స్ కేసులు చర్చల ద్వారా లోక్ అదాలత్ లో పరిష్కారం చేసుకోవచ్చని అన్నారు. మోటార్ వాహన ప్రమాద కేసులు, అక్క చెల్లెల్లు, అన్నదమ్ముల కేసులు, భార్య భర్తల మధ్య వివాద కేసులను లోక్ అదాలత్ ద్వారా సెటిల్మెంట్ చేసుకోవాలని అన్నారు. న్యాయ సేవా సంస్థ కోర్టు దగ్గర రెగ్యులర్ గా అందుబాటులో ఉంటుందని, మన దగ్గర స్పెషల్ మీడియేషన్ సెంటర్, శిక్షణ పొందిన మీడియేటర్స్ కూడా ఉన్నారని, వారి సహకారంతో కేసులు పరిష్కరించుకోవచ్చని అన్నారు.లోక్ అదాలత్ ద్వారా ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 3 వేల 500 సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసామని తెలిపారు. 62 మోటార్ వెహికల్ ప్రమాద కేసులలో రాజీ ద్వారా 2 కోట్ల 80 లక్షల పరిహారం ఇప్పించడం జరిగిందని అన్నారు. లోక్ అదాలత్ లో కక్షిదారులు, భీమా కంపెనీలు కూర్చొని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.న్యాయవాదులు వ్యవస్థలో ఒక భాగమని, వారి సహకారంతో కక్షిదారులకు మంచి తీర్పు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. లోక్ అదాలత్ ను కక్షిదారులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి. వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ ప్రజల హక్కులను కాపాడే పవిత్ర బాధ్యత న్యాయవాదులకు ఉంటుందని అన్నారు. న్యాయవాద సేవలను ప్రతి ఒక్కరు గుర్తించాలని అన్నారు. లోక్ ఆదాలత్ ద్వారా ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, అనవసరంగా ప్రైవేట్ సెటిల్మెంట్స్ చేసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు.రోడ్డు ప్రమాదంలో కుమారుడిని కోల్పోయిన వృద్ధ మహిళ గొడ్ల రత్తమ్మ తరపున న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ కేసు దాఖలు చేయగా సత్వర పరిష్కారం చేసి హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంకు ద్వారా 11 లక్షల 50 వేల రూపాయలకు అవార్డ్ అందజేశారు. భవాని, వీరభద్రం భార్య భర్తల వివాదానికి సంబంధించిన కేసు రాజీ ద్వారా పరిష్కరించడం జరిగింది. అనంతరం పాత్రికేయులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కోర్టు పరిధి లోనే కాకుండా సత్తుపల్లి, మధిర కోర్టులలో కూడా జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ సూచనలు, సలహా మేరకు జాతీయ లోక్ అదాలత్ జరుపుకుంటున్నామని అన్నారు. సివిల్ కేసుల పరిష్కారానికి వీటిని వినియోగించుకోవచ్చని అన్నారు. మనకు సమయం ఆదా అవుతుందని అన్నారు. రాజీ చేసుకోవాల్సిన క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులకు కూడా సెటిల్ చేయడం జరుగుతుందని అన్నారు. లోక్ అదాలత్ వల్ల ప్రజలలో మంచి వాతావరణం ఏర్పడుతుందని, వివాదాలు తగ్గిపోతాయని అన్నారు. ప్రశాంత వాతావరణం ఉంటే అభివృద్ధి వేగవంతం అవుతుందని, రాజీ మార్గమే రాజ మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కర్రి ఉమాదేవి, దేవినేని రామప్రసాదరావు, వి. శీనయ్య, యం.అర్చన కుమారి, యం. కల్పన, టి.మురళి మోహన్, కే.వి. చంద్ర శేఖర్ రావు, కాసరగడ్డ దీప, బెక్కమ్ రజని, ఏపూరి బిందు ప్రియ, వి.మాధవి, బి. నాగ లక్ష్మి, బార్ అసోసియేషన్ గద్దల దిలిప్ కుమార్, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెని న్యాయవాదులు బండారుపల్లి గంగాధర్, పి. సంధ్య రాణి, కొత్తపల్లి రామారావు, స్వర్ణ రాంబాబు, మందడపు శీనివాసరావు, న్యాయ శాఖ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.


# గోశాలలో సిబ్బంది నియామకానికి ఇంటర్వ్యూలు

## 40 పోస్టులకు 200 మందిని ఇంటర్వ్యూ చేసిన కలెక్టర్



వేములవాడ,జూన్ 14( భారత శక్త) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన గోశాలలో సిబ్బంది నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాజన్న ఆలయానికి సంబంధించిన వేములవాడ సమీపంలోని తిప్పాపూర్ గోశాలలో సిబ్బంది నియమాకానికి ఇటీవల అధికారులు నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ పోస్టులకు దాదాపు 250 మంది దరఖాస్తు చేసుకోగా, శనివారం జిల్లా కార్యాలయాల సముదాయంలో ఇంటర్వ్యూలు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ అధికారులు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్హత, పని అనుభవం తదితర వివరాలను అభ్యర్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు.40 మందిని ఎంపిక చేసి త్వరలో వారికి నియామక పత్రాలు అందజేయనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. నూతన సిబ్బంది నియామకంతో గోశాలలో కోడెల సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత తదితర సమస్యలు పరిష్కారం కానున్నాయని వివరించారు.

# కేకే3 ఫిల్టర్ బెడ్ కి గంగ నీటి సరఫరా



మందమర్రి, జూన్ 14 (భారత శక్తి) : మందమర్రి ఏరియా జి ఎల్ ఎస్ ఆర్ ఫిల్టర్బెడ్ నుండి కేకే3 ఫిల్టర్ బెడ్ కి గంగ నీటి సరఫరా చేయడం కొరకు నూతనంగా నిర్మించిన పైప్ లైన్ పనులు పూర్తి చేసుకొని శనివారం రోజు కొత్త పైప్ లైన్ మీదుగా కెకె 3 ఫిల్టర్ బెడ్ కి గంగ నీటి సరఫరా ప్రారంభం చేయడం జరిగింది.ఈ గంగ నీటి సరఫరా ప్రారంభం కావడంతో కెకె 3 ఫిల్టర్ బెడ్ లో నీటి కొరత లేకుండా ఉంటుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సివిల్ డి వై యస్ ఈ జయప్రకాష్ అన్నారు.ఈ కార్యక్రమం లో సివిల్ సూపర్వైజర్ జెట్టి రాకేష్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి కలువల శ్రీనివాస్, సీనియర్ పంప్ ఆపరేటర్ బోనాల మహేందర్, సీనియర్ ఫిట్టర్ లు బాలాజీ రవీందర్, కాసవేన శ్రీనివాస్, కాంట్రాక్టర్ మరియు కాంట్రాక్ట్ కార్మిక సోదరులు పాల్గొన్నారు.

# ప్రపంచంపై యుద్ధ మేఘాలు

## -పెరుగుతున్న పరస్పర దాడులు

## -ప్రమాదకరంగా మోడీ విధానాలు

## -హామీల అమలుపై ప్రజల్లో నిరాశ

## -సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బాగం హేమంతరావు



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), జూన్ 14: ప్రపంచంపై యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయని వివిధ దేశాల మధ్య జరుగుతున్న పరస్పర దాడులతో నిత్యావస వస్తువుల ధరలు ముఖ్యంగా క్రూడాయిల్ ధరలు పెరిగి ప్రజలపై పెనుభారం పడే అవకాశం ఉందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు స్పష్టం చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం మధిరలోని రిక్రియేషన్ క్లబ్లో శనివారం బెజవాడ రవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ ట్రంప్ సామ్రాజ్యవాద విధానాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రతిబంధకంగా మారాయని దేశాల మధ్య దాడులు, ఉద్రిక్త పరిస్థితులు పేద, మధ్యతరగతి ప్రజలపై పెను ప్రభావం చూపుతాయని ఆయన తెలిపారు. భారత దేశంలో మోడీ విధానాలు అత్యంత ప్రమాదకరంగా మారాయని మోడీ ప్రధానిగా కాగా సంపన్న వర్గాల ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని హేమంతరావు ఆరోపించారు. కార్పొరేట్లకు దేశ సంపదను దోచి పెడుతున్నారని సామాన్యమైన కోటీశ్వరులుగా ఉన్న అదానీ మోడీ 11 ఏళ్ల పాలనలో ప్రపంచ కోటీశ్వరులలోనే 10వ స్థానాన్ని ఆక్రమించాడని ఆయన తెలిపారు. రైతాంగ రుణాలను మాఫీ చేయడానికి మోడీ - మనస్కరించడం లేదని కానీ రూ. 15 లక్షల కోట్ల పారిశ్రామిక వేత్తల సొమ్మును రద్దు చేసేందుకు మాత్రం వెనుకాడ లేదన్నారు. మోడీ -విధానాలు పేద, మధ్యతరగతి ప్రజలకు శాపంగా మారాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఇప్పుడు ఆ హామీలను విస్మరించి పాలన సాగిస్తుందని హేమంతరావు తెలిపారు. హామీల అమలుకు సంబంధించి ప్రజల్లో తీవ్ర నిరాశ నిస్పృహాలు ఉన్నాయని ప్రజల ఆశలకు అనుగుణంగా పని చేయక పోతే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా పేదలకు -ఇస్తానన్న ఇందిరమ్మ భరోసా అమలుపై ప్రజల్లో తీవ్ర గందరగోళం నెలకొందని ఇంత వరకు పేదల ఖాతాల్లో రూపాయి జమ కాలేదని రైతు భరోసా, రైతు రుణమాఫీ పై రైతుల్లో ప్రభుత్వం పై అప నమ్మకం ఏర్పడుతుందన్నారు. హామీల అమలుకు ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం పని చేయాలని హేమంతరావు సూచించారు. వ్యవసాయ రంగానికి ఊతమిస్తేనే రైతాంగం ముందుకు సాగుతుంది తప్ప లేకపోతే వ్యవసాయ -రంగం మరింత సంక్షోభంలోకి కూరుకుపోతుందని ఆయన తెలిపారు.

ప్రజా సమస్యలపై చర్చింకుని భవిష్యత్తు కార్యాచరణ -రూపొందించుకునేందుకు మహాసభలను నిర్వహించుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు మాట్లాడారు. ప్రజా సంఘాల మహాసభలను జిల్లా మహాసభల లోపు నిర్వహించాలని అన్ని మండల మహాసభలను సకాలంలో పూర్తి చేయాలని సమావేశం తీర్మానించింది.

# యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ థీమ్

## రికార్డు కోసం యత్నాలు

విశాఖపట్టణం, జూన్ 14

ఈసారి జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సాగర తీరంలో గ్రాండ్‌లో సెలబ్రేట్ చేసుకునేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ థీమ్‌తో నిర్వహించే యోగా కోసం ఏర్పాట్లలో అధికారులు తలమునకలై ఉన్నారు. ఇప్పటివరకు యోగా దినోత్సవం సందర్భంగా ఈ సంవత్సరం 100 రోజుల్లో 700 కార్యక్రమాలు నిర్వహించింది. మెయిన్ కార్యక్రమం మాత్రం 21న వైజాగ్‌లో నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూన్ 21న నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ యోగా డేలో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్నారు. దీనితో పాటు దేశవ్యాప్తంగా 1 లక్ష ప్రదేశాల?లో కార్యక్రమాలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకుంది కేంద్రం. ఇప్పటివరకు 65 వేల కార్యక్రమాలకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. శుక్రవారం ఒక్క రోజులోనే 10 వేల రిజిస్ట్రేషన్లు జరిగాయి.ఈసారి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని యోచిస్తున్నారు. ఈసారి థీమ్ 'యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ 'గా ఉంటుంది. జూన్ 21న ఈసారి ప్రధాన కార్యక్రమం విశాఖపట్నంలో జరగనుంది. ఇందులో ప్రధానమంత్రి పాల్గొంటారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో దీనికి సంబంధించిన పెద్ద ప్రణాళిక రూపొందించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగా ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఒకేసారి 5 లక్షల మంది యోగా చేయడానికి వీలుగా? వేదికను సిద్ధం చేస్తున్నారు. ఉదయం 6:30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. అనేక ప్రముఖ యోగా గురువులు, యోగా అభ్యాసకులు వస్తారు. దీనితో పాటు 1000 యోగా పార్కులు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. యోగా దినోత్సవం సందర్భంగా 45 నిమిషాల ప్రోటోకాల్‌లో దాదాపు 20 ఆసనాలు ప్రధానమంత్రి చేస్తారు. ఇవి మొదటిసారి యోగా చేసేవారు కూడా సులభంగా చేయగలిగే ఆసనాలు.ఈ కార్యక్రమంపై కేంద్ర మంత్రి ప్రతాప్ రావు జాధవ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసారి యోగా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన అన్నారు. ప్రధాన కార్యక్రమం ఈసారి విశాఖపట్నంలో జరుగుతుంది. 5 లక్షల మందికి పైగా పాల్గొంటారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. అనేక దేశాల ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

# ప్రపంచ కుబేరుల జాబితా.. రెండో స్థానం కోల్పోయిన జెఫ్ బెజోస్



అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ( ప్రపంచ కుబేరుల జాబితాలో రెండో స్థానాన్ని కోల్పోయారు. ఆ స్థానాన్ని ఒరాకిల్ సహ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్ సొంతం చేసుకున్నారు. 243 బిలియన్ డాలర్ల సంపదతో ఎల్లిసన్ రెండో ధనవంతుడిగా నిలిచారు. ఈ విషయాన్ని ఫోర్బ్స్ వరల్డ్ బిలియనీర్స్ జాబితాలో తెలిపింది.

మేతో ముగిసిన త్రైమాసికంలో ఒరాకిల్ అంచనాలను మించి ఆదాయం, లాభాలు సాధించింది. మెరుగైన వృద్ధిని సొంతం చేసుకుంది. దీంతో కంపెనీ షేర్లు పుంజుకున్నాయి. గురువారం ట్రేడింగ్ సెషన్‌లో ఏకంగా 13 శాతం పెరిగి, మొదటిసారిగా 200 డాలర్లకు చేరాయి. ఒక్క రోజులో ఎల్లిసన్ సంపద 26 బిలియన్ డాలర్లు పెరిగింది. దీంతో ఆయన మొత్తం సంపద 243 బిలియన్ డాలర్లకు చేరింది.

ఫోర్బ్స్ వరల్డ్ బిలియనీర్స్ జాబితా ప్రకారం.. బెజోస్ సంపద 228 బిలియన్ డాలర్లు, మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ సంపద 239 బిలియన్ డాలర్లుగా ఉంది. వీరిని అధిగమించి ఎల్లిసన్ రెండో స్థానం సొంతం చేసుకున్నారు. ఈ జాబితాలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ( 407 బిలియన్ డాలర్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.

# బీమా పరిహారం ఎంత?



అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానం కొద్ది క్షణాల్లోనే కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో పైలట్లు, సిబ్బందితో పాటు 229 మంది ప్రయాణికులు దుర్మరణం పాలవ్వడం ప్రపంచాన్ని షాక్‌కు గురి చేసింది. ఈ నేపథ్యంలో విమాన ప్రమాదాల్లో ప్రమాద బీమా పరిహారాన్ని ఎలా లెక్కిస్తారు అనేది చర్చనీయాంశమైంది. విమాన ప్రమాదాల్లో బీమా పరిహారం అంతర్జాతీయ నిబంధనలు, దేశీయ చట్టాలు, బీమా పాలసీల ఆధారంగా నిర్ణయిస్తారు. మనదేశం 2009లో సంతకం చేసిన మాంట్రియల్ కన్వెన్షన్-1999 పరిహారం గణనలో ప్రధాన పాత్ర పోషిస్తుంది.

ఇదీ లెక్క

ఈ ఒప్పందం ప్రకారం విమాన ప్రమాదంలో మరణించిన ప్రతి ప్రయాణికుడి కుటుంబానికి ఎయిర్ ఇండియా కనీసం 1,51,880 స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్స్) పరిహారం చెల్లించాలి. ప్రస్తుత లెక్కల ప్రకారం ఒక్కో ఎస్‌డీఆర్ విలువ రూ.120గా ఉంది. దీని ప్రకారం చూస్తే.. మరణించిన ఒక్కో వ్యక్తి పేరిట రూ.1.8 కోట్లు బీమా పరిహారం అతని/ఆమె కుటుంబానికి లభిస్తుంది. ఎస్‌డీఆర్ అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) నిర్వహించే కరెన్సీ యూనిట్. దీని విలువ డాలర్, యూరో, యెన్ వంటి కరెన్సీల ఆధారంగా మారుతూ ఉంటుంది. విమానయాన సంస్థ నిర్లక్ష్యమే కారణంగా తేలితే బాధిత కుటుంబాలు కోర్టులను ఆశ్రయించి, అధిక పరిహారం కోసం డిమాండు చేసే అవకాశాలున్నాయి. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే.. ఇది ప్రయాణికులకు మాత్రమే వర్తిస్తుంది. సిబ్బంది (క్రూ) కోసం కార్మిక చట్టాలు, బీమా పాలసీలు, ఇతర ఒప్పందాల ఆధారంగా పరిహారాన్ని నిర్ణయిస్తారు.

పరిహారానికి అదనంగా..: విమాన ప్రమాదంలో మరణించిన ఒక్కో బాధిత కుటుంబానికి టాటా గ్రూపు రూ.కోటి పరిహారం ప్రకటించింది. బీమా పరిహారంతో దీనికి సంబంధం లేదు.

ధ్రువీకరణ తర్వాతే: ప్రమాదంలో మరణించిన ప్రయాణికుల వివరాలను ధ్రువీకరించుకున్నాక, వారి కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తారు. విమాన ప్రమాదంలో మరణించిన వారిని గుర్తు పట్టడంలో డీఎన్ఏ పరీక్షలే కీలకం అవుతాయి. ఇవి ప్రాథమికంగా కుటుంబ సభ్యులను గుర్తించేందుకు సాయపడతాయి. కానీ, పరిహారం అందుకునేందుకు చట్టబద్ధ వారసులు, ఇతర అంశాలు కొన్నింటిని పూర్తి చేయాల్సి వస్తుంది.

జాతీయత ఆధారంగా

మాంట్రియల్ కన్వెన్షన్ ప్రకారం వివిధ దేశాల చట్టాలు, బీమా నిబంధనలు, కరెన్సీ విలువను బట్టి పరిహారం అందుతుంది. విమాన ప్రమాదానికి గల కారణాలను బట్టి, బీమా మొత్తం కొంత మారేందుకు అవకాశం ఉంది. కానీ, కనీస పరిహారం తగ్గదు.

ముందుగా కొంత..

మరణించిన ప్రతి ప్రయాణికుడి/ప్రయాణికురాలి కుటుంబానికి విమానయాన సంస్థ ముందుగా 16,000 ఎస్‌డీఆర్‌లు (సుమారు రూ.19.20 లక్షలు) చెల్లించాల్సి ఉంటుంది. విచారణ ప్రక్రియతో దీనికి సంబంధం లేదు. ఇది బాధిత కుటుంబానికి తక్షణ అవసరాలను తీర్చేందుకు అంటే అంత్యక్రియల నిర్వహణ, ఇతర ఖర్చులకు ఉపయోగపడుతుంది.

క్లెయిము సెటిల్‌మెంట్ల ప్రక్రియను సడలించిన ఎల్ఐసీ

విమాన ప్రమాద బాధితుల కుటుంబాలకు క్లెయిము సెటిల్‌మెంట్ ప్రక్రియ విషయంలో సడలింపులు ఇస్తున్నట్లు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) ప్రకటించింది. క్లెయిము సెటిల్‌మెంట్లను వేగవంతం చేయడానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. విమాన ప్రమాదంలో మరణించిన వారి, మరణ ధ్రువీకరణ పత్రాలకు బదులుగా పాలసీదారుకు చెందిన ఏదైనా ప్రభుత్వ రికార్డు లేదా కేంద్ర/రాష్ట్ర/విమాన వర్గాలు అందించిన పరిహార పత్రాన్నీ ధ్రువీకరణగా అంగీకరిస్తామని తెలిపింది. తమ కాల్‌సెంటర్/సమీప కార్యాలయాన్నీ సంప్రదించొచ్చని వివరించింది.

ప్రమాదంలో ఎయిరిండియాకు చెందిన ఏఐ171 (బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్) నామరూపాల్లేకుండా పోయింది. ఇది 2013లో తయారైన విమానం. ఈ విమానం బీమా విలువ రూ.630-980 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఎయిరిండియా తన మొత్తం విమానాలకు ఏవియేషన్ ఇన్సూరెన్స్ ప్రోగ్రామ్ కింద దాదాపు 20 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.72 లక్షల కోట్ల)కు బీమా తీసుకుంది. ఇందులో విమానాలు, ప్రయాణికుల బాధ్యత, మూడో పక్ష బాధ్యత (థర్డ్ పార్టీ), వస్తువులు, సిబ్బంది వ్యక్తిగత ప్రమాద బీమాలాంటివి ఉంటాయి. టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ ప్రధాన బీమా సంస్థగా ఉంది. న్యూ ఇండియా అస్యూరెన్స్, ఐసీఐసీఐ లాంబార్డ్, కొన్ని ఇతర బీమా సంస్థలూ ఇందులో భాగస్వాములుగా ఉన్నాయి. ఈ బీమా సంస్థలు జరిగిన నష్టాన్ని దామాషా పద్ధతిలో చెల్లిస్తాయి. విమానానికి జరిగిన నష్టం, మరణించిన ప్రయాణికులు- మెడికోలకు పరిహారం, ఆస్తులకు వాటిల్లిన నష్టంలాంటివన్నీ కలిపి చెల్లించాల్సిన మొత్తం రూ.1,000 కోట్ల నుంచి రూ.1,500 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. భారత విమానయాన చరిత్రలోనే ఇది అతిపెద్ద బీమా పరిహారంగా నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రీమియం పెరిగే వీలు

భారత ఏవియేషన్ ఇన్సూరెన్స్ ప్రీమియం వసూలు ఏడాదికి రూ.900-1,000 కోట్ల వరకూ ఉంటుంది. ఈ క్లెయిం నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరంలో బీమా సంస్థలు కఠినమైన నిబంధనలు అమలు చేయడం, లేదా ప్రీమియం పెంచడం లాంటి చర్యలు తీసుకోవచ్చని భావిస్తున్నారు.

టాటా గ్రూప్ చరిత్రలో చీకటి రోజు: చంద్రశేఖరన్

ప్రస్తుత కష్ట సమయంలో, తమ బాధ్యతలు నెరవేర్చడంలో వెనకడుగు వేయబోమని టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ పేర్కొన్నారు. 'గురువారం నాటి ప్రమాదంతో మేం దిగ్భ్రాంతికి గురయ్యాం. ఒక వ్యక్తిని కోల్పోవడమే విషాదం. ఒకేసారి ఇన్ని మరణాలు సంభవించడం అత్యంత విచారకరం. టాటా గ్రూప్ చరిత్రలో చీకటి రోజు ఇది. బాధిత కుటుంబాలను ఎంత ఓదార్చినా తక్కువే. వారికి మేం అన్ని విధాలా అండగా ఉంటాం' అని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. 'వాస్తవంగా ఏం జరిగిందో తెలుసుకోవాలని మీతో పాటూ మాకూ ఉంది. ప్రస్తుతానికైతే స్పష్టత లేదు. విపత్తు సమయంలో పలు ఊహాగానాలు వస్తుంటాయి. దర్యాప్తు సంస్థలు తమ పని పూర్తి చేసి, ఏం జరిగిందో చెబుతాయి. ఈ విషాదం ఎలా జరిగిందన్న విషయంలో ఏ సమాచారం ఇవ్వడంలో అయినా పూర్తి పారదర్శకత పాటిస్తామ'ని స్పష్టం చేశారు.



# ఆర్థిక ఫలితాలు, వార్షిక నివేదికల మధ్య సమయాన్ని తగ్గించండి

ముంబయి: ఆర్థిక ఫలితాలు, పూర్తి వార్షిక నివేదికల ప్రచురణకు మధ్య కాలవ్యవధిని తగ్గించాల్సిందిగా కంపెనీల ముఖ్య ఆర్థిక అధికారుల (సీఎఫ్‌ఓల)ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ శుక్రవారం కోరింది. మదుపర్ల విశ్వాసం పెంచడమే లక్ష్యంగా సెబీ ఈ ఆదేశాలిచ్చింది. ఆడిట్ కమిటీలు, ఆడిటర్లతో సీఎఫ్‌ఓలు తమ సంబంధాలను మరింత పెంచుకోవాలని, ఫలితంగా ఆర్థిక వివరాల వెల్లడిలో జవాబుదారీతనం పెరుగుతుందని సెబీ పూర్తి స్థాయి సభ్యుడు అనంత్ నారాయణ్ పేర్కొన్నారు. కంపెనీల ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి, ప్రజల్లో విశ్వాసం నెలకొనేలా చూడటంలో సీఎఫ్‌ఓల పాత్ర చాలా కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈటీసీఎఫ్‌ఓ నెక్ట్స్‌జెన్ 2025 కార్యక్రమంలో పాల్గొన్న నారాయణ్.. మూలధన సమీకరణలో ఇటీవలి ధోరణులు, అవకాశాలు, ఎదురవుతున్న ముప్పులు, స్థిరమైన మూలధన వృద్ధి కోసం నిబంధనలను అనుసరించాల్సిన ప్రాముఖ్యతను వివరించారు. 'ప్రస్తుతం వార్షిక ఫలితాలు, పూర్తి ఆర్థిక సంవత్సర నివేదిక ప్రచురణ మధ్య 70-140 రోజుల అంతరం ఉంటోంది. పూర్తి నివేదికలో ఉండే ఖాతాల వివరాలు, ఇంటర్నల్ కంట్రోల్ నివేదిక, ఆడిట్ అంశాలు, కరో (కంపెనీస్ ఆడిటర్స్ రిపోర్ట్ ఆర్డర్) వివరాలు చాలా సమాచారాన్ని అందిస్తాయి. అందువల్ల ఫలితాల వెల్లడికి, నివేదిక ప్రచురణకు మధ్య సమయాన్ని తగ్గిస్తే మదుపర్లకు మరింత పారదర్శకంగా సమాచారం అందుతుంది' అని నారాయణ్ వివరించారు.

ఏడాదిలో అవసరమైన ఆడిట్ ప్రణాళిక రూపొందించేందుకు ఆడిట్ కమిటీలు, ఆడిటర్లతో సీఎఫ్‌ఓలు కలిసి పనిచేయాలని సూచించారు. సీఎఫ్‌ఓలు తమకు అవసరమైన అంశాల గురించి చర్చించడం కోసం మాత్రమే కాకుండా, ఆడిట్ కమిటీ సమావేశాల్లో పాల్గొనాలని అన్నారు. తద్వారా వాటాదార్లకు నమ్మకం పెరుగుతుందని, మరింత సమాచారం అందుతుందని తెలిపారు. సీఎఫ్‌ఓలు ఒకప్పుడు సమాచారాన్ని భద్రపరిచే స్థాయి నుంచి ప్రస్తుతం విలువను పెంచే సృష్టికర్తగా మారారని వెల్లడించారు.



# పుంజుకున్న ఉద్యోగ ప్రకటనలు


ఈ ఏడాది మేలో దేశీయంగా ఉద్యోగ నియామక ప్రకటనలు 8.9% పుంజుకున్నాయి. వరుసగా 8 నెలల పాటు క్షీణించిన ఉద్యోగ ప్రకటనలు, గత నెలలో మళ్లీ పెరిగాయి. సంఘటిత ఆర్థిక వ్యవస్థ దిశగా మన దేశం అడుగులు వేస్తుండటంతో, ఇతర దేశాలతో పోలిస్తే ఉద్యోగాల సృష్టి అధికంగా ఉందని అంతర్జాతీయ ఉద్యోగ ప్లాట్‌ఫామ్ ఇండీడ్ నివేదిక వెల్లడించింది. గత ఏడాది మేతో చూస్తే మాత్రం.. దేశంలో ఉద్యోగ ప్రకటనలు 1.8% తగ్గాయి. తిరోగమన ధోరణులు ఉన్నప్పటికీ.. కొవిడ్ పరిణామాల ముందు స్థాయుల కంటే దాదాపు 80% ఎగువనే ఉద్యోగ ప్రకటనలు ఉన్నాయని, ఇతర ప్రధాన దేశాలతో పోలిస్తే ఇవి అధికమని ఇండీడ్ స్పష్టం చేసింది. బ్రిటన్, న్యూజిలాండ్, స్విట్జర్లాండ్ సహా పలు దేశాలు కొవిడ్ మునుపటి స్థాయిల కంటే దిగువనే వృద్ధి నమోదుచేశాయని, భారత గణాంకాలు మెరుగ్గా ఉన్నాయని వివరించింది. 2020 (కొవిడ్ సమయం), 2024, 2025లో గణాంకాల విశ్లేషణ ఆధారంగా రూపొందించిన ఈ నివేదికలోని పలు అంశాలు ఇలా..

గత మూడు నెలల్లో భారత్‌లో దాదాపు 80% వృత్తుల్లో ఉద్యోగ ప్రకటనలు పెరిగాయి. ప్రధానంగా శిశు సంరక్షణ (27%), వ్యక్తిగత సంరక్షణ, హెూమ్ హెల్త్ (25%), విద్య (24%), ఉత్పత్తి, తయారీ (22%)ల్లో ఉద్యోగ ప్రకటనలు అధికమయ్యాయి. గత మూడు నెలల్లో పంటి వైద్యం రంగంలో అవకాశాలు 10.2% తగ్గాయి. ఆ తర్వాతి స్థానాల్లో వ్యవసాయం, అటవీ (8.6%), కమ్యూనిటీ, సామాజిక సేవ (6.8%), సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ (4.2%) ఉన్నాయి.

భారత ఉద్యోగ ప్రకటనల్లో 1.5% జెనరేటివ్ ఏఐ గురించి ప్రస్తావించారు. గతేడాదితో పోలిస్తే ఇది రెట్టింపునకు పైగా అధికం. దాదాపు 12.5% డేటా ఎనలిటిక్స్ ఉద్యోగాలకు జెనరేటివ్ ఏఐ నైపుణ్యాలు కోరుకుంటున్నారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ (3.6%), సైంటిఫిక్ రీసెర్చ్ (3.1%) కంటే ఇది ఎక్కువ. మన దేశాల్లో ప్రాంతాల వారీగా చూస్తే.. జెనరేటివ్ ఏఐను ప్రస్తావించిన ఉద్యోగ ప్రకటనల్లో కర్ణాటక (2.4%), తెలంగాణ (2.3%) ఉన్నాయి.

# రూ.42.5 లక్షల కోట్లకు ఏఐ చిప్ మార్కెట్

శాన్ జోస్: కృత్రిమ మేధ(ఏఐ) ప్రాసెసర్ల మార్కెట్ 2028 కల్లా 500 బి. డాలర్ల (దాదాపు రూ.42.5 లక్షల కోట్ల) స్థాయికి చేరుకోవచ్చని అడ్వాన్స్‌డ్ మైక్రో డివైజెస్(ఏఎమ్‌డీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ లీసా సు అంచనా వేస్తున్నారు. 2023లో 45 బి. డాలర్ల స్థాయిలో ఉన్న ఈ మార్కెట్, ఏటా 60 శాతానికి పైగా వృద్ధితో ఈ స్థాయికి చేరగలదని పేర్కొన్నారు. కంపెనీ నిర్వహించిన 'అడ్వాన్సింగ్ ఏఐ 2025' సదస్సులో ఎమ్ఐ350 సిరీస్ జీపీయూ (గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్)లను ఏఎమ్‌డీ ఆవిష్కరించింది. ఎన్‌విడియాకు పోటీగా తీసుకొచ్చిన ఈ చిప్‌లు వినియోగదార్లకు మరింత ప్రయోజనకరంగా ఉంటాయని లీసా అన్నారు. ఏఐ వినియోగదార్లలో అతిపెద్ద 10 సంస్థల్లో 7 కంపెనీలు ఏఎమ్‌డీ ఇన్‌స్టింక్ట్



యాక్సెలరేటర్లనే వాడుతున్నాయని లీసా అన్నారు. ఇందులో రిలయన్స్ జియో కూడా ఉందని తెలిపారు. అంతక్రితం తరం చిప్‌లతో పోలిస్తే ఎమ్ఐ350 చిప్‌లు నాలుగు రెట్ల వేగంతో కంప్యూట్ చేయగలవని ఏఎమ్‌డీ ప్రకటించింది. మూడో త్రైమాసికం నుంచి కొత్త చిప్‌లు అందుబాటులో వస్తాయని లీసా తెలిపారు.




# డబ్ల్యూటీసీ ఫైనల్స్..
# బీసీసీఐ ఆశలకు ఐసీసీ బ్రేక్..

సుదీర్ఘ ఫార్మాట్‌లో డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ ఎంతో ప్రతిష్మాత్మకం. అందుకే, విశేష ప్రేక్షకాదరణ ఉండే ఈ ఉత్కంఠ పోరుకు ఆతిథ్యమిచ్చేం దుకు బీసీసీఐ కూడా ఆసక్తి చూపిస్తోంది. కానీ, భారత్ ఆశలకు ఐసీసీ బ్రేక్ వేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్నట్లుగానే వచ్చే మూడు సీజన్లలోనూ డబ్ల్యూటీసీ ఫైనల్‌ను ఇంగ్లాండ్‌లోనే నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనిపై వచ్చే నెలలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

2021 నుంచి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌ను నిర్వహిస్తున్నారు. 2023-25 సైకిల్‌లో భాగంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య ప్రస్తుతం డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ లార్డ్స్ వేదికగా జరుగుతోంది. తాజా సీజన్‌తో కలిపి ఇప్పటివరకు మూడు ఎడిషన్ల ఫైనల్ మ్యాచ్‌లను (సౌతాంప్టన్, ఓవల్, లార్డ్స్) ఇంగ్లాండ్‌లోనే నిర్వహించారు. అయితే, భారత్‌లోనూ ఈ ఫార్మాట్‌కు ఆదరణ పెరుగుతుండటంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే అవకాశం కల్పించాలని బీసీసీఐ తమ ఆసక్తిని వ్యక్తంచేసింది. అయితే, ఐసీసీ మాత్రం ఇందుకు సుముఖత చూపలేదని సమాచారం.


2027, 2029, 2031లో జరిగే డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్‌ల కోసం ఇంగ్లాండ్‌కే ఆతిథ్య హక్కులు ఇవ్వాలని ఐసీసీ నిర్ణయించిందట. ఇప్పటికే దీనిపై ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. జులైలో సింగపూర్ వేదికగా జరిగే ఐసీసీ వార్షిక సదస్సులో దీన్ని అధికారికంగా ఆమోదించి ప్రకటన విడుదల చేయనున్నారని క్రీడా వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొన్నాయి.

ప్రస్తుతం జరుగుతున్న డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ నాలుగో రోజుకు చేరుకుంది. ఈ పోరులో దక్షిణాఫ్రికా విజయానికి మరింత చేరువైంది. ఇక, 2025-27 సైకిల్ కూడా ఇంగ్లాండ్‌లోనే ప్రారంభం కానుంది. జూన్ 20 నుంచి భారత్, ఇంగ్లాండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. ఇప్పటివరకు టీమ్‌ఇండియా రెండుసార్లు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరినా విజయాన్ని అందుకోలేకపోయింది.

# 51 బంతుల్లో 151
# గేల్ రికార్డు బద్దలు కొట్టిన అలెన్



ఓక్లాండ్: మేజర్ క్రికెట్ లీగ్ (ఎంఎల్‌సీ) ఆరంభం అదిరిపోయింది. శుక్రవారం ప్రారంభమైన ఈ లీగ్‌లో శాన్‌ఫ్రాన్సిస్కో యునికార్న్స్ బ్యాటర్ ఫిన్ అలెన్ (151బీ 51 బంతుల్లో 5ఐ4, 19ఐ6) రికార్డుల పంట పండించాడు. వాషింగ్టన్ ఫ్రీడమ్‌తో జరిగిన మ్యాచ్‌లో అలెన్ కేవలం 51 బంతుల్లోనే 296 స్ట్రైక్‌రేట్‌తో 151 పరుగులు సాధించాడు. 4 బౌండరీలు, 19 సిక్సర్లు బాదాడు. ఈ క్రమంలో టీ20 క్రికెట్లో అత్యంత వేగంగా 150 పరుగులు సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 49 బంతుల్లోనే అతను ఈ ఘనత అందుకున్నాడు. కేవలం 34 బంతుల్లోనే సెంచరీతో టీ20 క్రికెట్లో అత్యంత వేగంగా శతకం సాధించిన న్యూజిలాండ్ బ్యాటర్‌గా రికార్డు అందుకున్నాడు. టీ20 ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు (19) బాదిన ఆటగాడిగా ఘనత సాధించాడు. గతంలో క్రిస్ గేల్ (వెస్టిండీస్), సాహిల్ చౌహాన్ (ఎస్తోనియా) ఒక్కొక్కరు 18 సిక్సర్లు కొట్టారు. నిరుడు నవంబరులో జరిగిన ఐపీఎల్ వేలంలో అలెన్‌ను ఎవరూ కొనుక్కోకపోవడం గమనార్హం. రూ.2 కోట్ల కనీసం ధరతో వేలం బరిలో దిగినా ఫ్రాంచైజీలు ఆసక్తి చూపలేదు. ఇక ఈ మ్యాచ్‌లో యునికార్న్స్ 123 పరుగుల ఆధిక్యంతో వాషింగ్టన్‌పై విజయం సాధించింది. మొదట యూనికార్న్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 269 పరుగులు చేసింది. బదులుగా వాషింగ్టన్ 13.1 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది.



## తల్లికి అనారోగ్యం..
## స్వదేశానికి గంభీర్

బెకెన్‌హామ్ (ఇంగ్లాండ్): భారత జట్టు చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ శుక్రవారం స్వదేశానికి తిరిగొచ్చాడు. ఆరోగ్య అత్యవసర పరిస్థితి కారణంగా తల్లి సీమా గంభీర్‌ను దిల్లీలోని ఆసుపత్రిలో చేర్పించడంతో అతను భారత్‌కు వచ్చినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. గంభీర్ తల్లికి గుండెపోటు రావడంతో ఆమెను ఐసీయూలో ఉంచి వైద్యం అందిస్తున్నారు. తల్లి ఆరోగ్యం కుదుటపడితే వారం రోజుల్లో గంభీర్ మళ్లీ ఇంగ్లాండ్‌కు వెళ్లే అవకాశముంది. గంభీర్ గైర్హాజరీలో సహాయక కోచ్ ర్యాన్ టెన్ డస్కాటె పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ఇంగ్లాండ్‌తో అయిదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఈనెల 20న ప్రారంభంకానుంది.

# సురుచి సంచలనం
# వరుసగా మూడో ప్రపంచకప్‌లో స్వర్ణం




మ్యూనిచ్: ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్‌లో భారత యువ సంచలనం సురుచి సింగ్ జైత్రయాత్ర కొనసాగుతోంది. వరుసగా మూడో అంచెలోనూ పసిడిని గెలుచుకుని హ్యాట్రిక్ సాధించింది. మ్యూనిచ్ టోర్నీ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో 19 ఏళ్ల సురుచి 241.9 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతక విజేత కామిలె జెడ్రెజివిస్కి (241.7)ను రెండో స్థానానికి పరిమితం చేసింది. యో కియన్‌జువన్ (221.7) కాంస్యం నెగ్గింది. అంతకుముందు క్వాలిఫికేషన్‌లో సురుచి 588 పాయింట్లతో మను బాకర్ పేరిట ఉన్న జాతీయ రికార్డును సమం చేసింది. ఈ విభాగంలో బాకర్ 574 పాయింట్లతో 21వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు దూరమైంది. ఈ టోర్నీ కంటే ముందు బ్యూనస్ ఎయిర్స్, లిమాలో జరిగిన ప్రపంచకప్‌లలోనూ సురుచి స్వర్ణం సొంతం చేసుకుంది. ఆమె బరిలో దిగిన అన్ని ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ దశల్లోనూ పసిడి నెగ్గడం విశేషం. "నేను ఆడిన అన్ని ఫైనల్స్‌లో అత్యంత కఠిన పోరు ఇదే. కొంత ఒత్తిడికి లోనయ్యా" అని విజయానంతరం సురుచి చెప్పింది. మ్యూనిచ్ ప్రపంచకప్‌లో భారత్‌కు ఇదే తొలి స్వర్ణం. అంజుమ్ మౌద్గిల్, సిఫ్ట్ కౌర్ శర్మ కాంస్య పతకాలు నెగ్గిన సంగతి తెలిసిందే.

# మళ్లీ అవకాశం అదృష్టం

%బెకెన్‌హామ్: భారత టెస్టు జట్టులో రెండో సారి అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు మిడిలార్డర్ బ్యాటర్ కరుణ్ నాయర్ అన్నాడు. "చాలా ప్రత్యేకంగా అనిపిస్తోంది. మళ్లీ అవకాశం లభించడాన్ని అదృష్టంగా భావిస్తున్నా. ఈ అవకాశాన్ని రెండు చేతులతో అందిపుచ్చుకోవడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని కరుణ్ తెలిపాడు. ఇంగ్లాండ్ లయన్స్‌తో అనధికార టెస్టులు ఆడిన కరుణ్ నాయర్ గురువారం జట్టుతో కలిశాడు. ఈ సందర్భంగా కరుణ్‌కు చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్వాగతం పలికాడు. "పునరాగమనం ఎల్లప్పుడూ సులువు కాదు. కరుణ్ పరుగులు సాధించిన విధానం.. మొక్కవోని పట్టుదల జట్టు మొత్తానికి స్ఫూర్తిదాయకం. కరుణ్‌కు తిరిగి స్వాగతం" అని గౌతమ్ పేర్కొన్నాడు.




## జోరుగా ప్రాక్టీస్

లండన్: ఇంగ్లాండ్‌తో తొలి టెస్టులో జట్టు కూర్పు ఎలా ఉండాలి? పేసర్లలో ఎవరిని ఆడించాలి? ఓపెనర్లుగా వచ్చేదెవరు? నాలుగో స్థానంలో దిగేదెవరు? ఈ అన్ని ప్రశ్నలకు సమాధానం కోసం టీమ్‌ఇండియా ఆఖరి సన్నాహక మ్యాచ్‌పై ఆధారపడనుంది. టీమ్‌ఇండియా, భారత్-ఎ మధ్య నాలుగు రోజుల మ్యాచ్‌లో ఆటగాళ్ల ప్రదర్శన ఆధారంగా టీమ్ మేనేజ్‌మెంట్ తొలి టెస్టు కూర్పుపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశముంది. ఈ మ్యాచ్‌లో ఆటగాళ్లు రెండు జట్లుగా విడిపోయి ఆడుతున్నారు. అయితే పూర్తిగా ఓ మ్యాచ్‌లా కాకుండా కీలక ఆటగాళ్లందరికీ సరైన ప్రాక్టీస్ లభించేలా.. భిన్న పరిస్థితులను కల్పించి మ్యాచ్‌ను ఆడిస్తున్నారని సమాచారం. టెస్టు జట్టులో ఉన్న బౌలర్లందరూ కనీసం పదిహేను ఓవర్లు వేసేలా.. బ్యాటర్లు కఠిన సవాళ్లకు సిద్ధమయ్యేలా టీమ్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక సిద్ధం చేసింది. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారికి భారత ఆటగాళ్లు సంతాపం తెలిపారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు ఒక నిమిషం మౌనం పాటించి నివాళులు అర్పించారు. భుజాలకు నల్ల రిబ్బన్లు ధరించి మ్యాచ్‌లో పాల్గొన్నారు.

# అర్జున్ బృందానిదే ప్రపంచ ర్యాపిడ్ టైటిల్

FONT SIZE




లండన్: ప్రపంచ ర్యాపిడ్ టీమ్ టైటిల్‌ను ఎంజీడీ-1 జట్టు కైవసం చేసుకుంది. శుక్రవారం 12వ రౌండ్లో 3.5-2.5తో మాల్కమ్స్ మేట్స్‌పై ఎంజీడీ-1 గెలిచింది. మొత్తం 21 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఆఖరి రౌండ్లో అర్జున్ ఇరిగేశి, ప్రణవ్ విజయాలు సాధించగా.. డేవిడ్ గుజారియో (స్పెయిన్), లియోన్ ల్యూక్, స్టావ్‌రౌలా (స్కాట్‌లాండ్) గేమ్‌లు డ్రా అయ్యాయి. వరుసగా 11 గేమ్‌లు నెగ్గిన అథర్వ చివరి గేమ్‌లో మాత్రం ఓడిపోయాడు. ఎంజీడీ-1 జట్టులో పెంటేల హరికృష్ణ కూడా సభ్యుడు. హెక్సామైండ్ జట్టు 20 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. వివిధ దేశాల ఆటగాళ్లు జట్లుగా విడిపోయి ఈ టోర్నీలో ఆడారు.

# మెగాఫోన్ పట్టనున్న టాలీవుడ్ కమెడియన్



హైదరాబాద్: టాలీవుడ్ కమెడియన్ రాహుల్ రామకృష్ణ దర్శకుడిగా మారనున్నారు. త్వరలోనే ఆయన మెగాఫోన్ పట్టి ఒక చిత్రాన్ని చిత్రీకరించనున్నారు. ఈ మేరకు ఆయన ప్రయత్నాలు మొదలుపెట్టారు. తాను దర్శకత్వం వహించనున్న తొలి ప్రాజెక్ట్‌కు సంబంధించి నటీమణుల ఎంపిక ప్రారంభించారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ఎక్స్ వేదికగా శనివారం ఉదయం ఆయన పోస్ట్ పెట్టారు. "దర్శకుడిగా నా తొలి ప్రాజెక్ట్.. మీలో ఎవరికైనా ఆసక్తి ఉంటే దయచేసి మీ షోరీల్స్, ఫొటోలను నా మెయిల్‌కు పంపించగలరు" అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఆయనే నిర్మాతగానూ వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది.

షార్ట్ ఫిల్మ్స్‌తో నటుడిగా మారిన రాహుల్ రామకృష్ణ..'జయమ్ము నిశ్చయమ్మురా'తో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఈ చిత్రానికి డైలాగ్ రైటర్‌గానూ వర్క్ చేశారు. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి' ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ సినిమా తర్వాత ఆయన తెలుగులో 'భరత్ అనే నేను', 'చి.ల.సౌ.', 'గీత గోవిందం', 'కల్కి', 'బ్రోచేవారెవరురా', 'అల.. వైకుంఠపురములో..', 'జాతిరత్నాలు', 'ఓం భీమ్ బుష్' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు.

# ఇండస్ట్రీలో ఇలాంటివి సహజం: నాగార్జున



'కుబేర' సినిమాతో పలకరించడానికి సిద్ధమయ్యారు నటుడు నాగార్జున (%ఛీఝస్త్రుతీయబఋ%). ఆయన, ధనుష్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా జూన్ 20న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని ప్రచారంలో భాగంగా వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు. తాజాగా ఇండస్ట్రీల్లో పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని ఒడుదొడుకులు సహజమన్నారు. బాలీవుడ్, టాలీవుడ్.. ఏ పరిశ్రమ కూడా ఎప్పటికీ అగ్రస్థానంలో ఉండదన్నారు. దక్షిణాదితో పోలిస్తే బాలీవుడ్ వెనకపడిపోతుందా? అనే ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఎప్పటికప్పుడు పరిస్థితులు మారిపోతుంటాయని తెలిపారు.

"నటుడు, దర్శకులకు వారి కెరీర్‌లో 4, 5 సంవత్సరాలు బ్యాడ్ టైమ్ ఉంటుంది. వారి సినిమాలు విజయం సాధించకపోవచ్చు. అప్పుడు సినిమా పరిశ్రమ మొత్తం పడిపోయిందని భావిస్తే పొరపాటు అవుతుంది. ప్రేక్షకుల అంచనాలు ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటాయి. ఇప్పుడు 'టూరిస్ట్ ఫ్యామిలీ', 'కోర్టు', ఓటీటీలో 'అనగనగా' సినిమాలు ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్నాయి. వారి అభిరుచికి తగినట్లే దర్శక నిర్మాతలు కథలు రూపొందించాలి. భవిష్యత్తును దృష్టిలోపెట్టుకొని సినిమాలు తెరకెక్కించాలి" అని అన్నారు.

ప్రస్తుతం నాగార్జున వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. శేఖర కమ్ముల దర్శకత్వంలో కుబేరలో నటించారు. రజనీకాంత్ (%=ఖయఅఅఎఖత్ష్త్ర%) హీరోగా నటిస్తోన్న 'కూలీ' )లోనూ కీలకపాత్రలో కనిపించనున్నారు. ఇందులో తన లుక్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఉంటుందని ఆయన అన్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రానున్న ఈ సినిమాలో బాలీవుడ్ హీరో ఆమిర్‌ఖాన్ కూడా అతిథి పాత్రలో నటించారు.

# నాకు రాసిపెట్టిలేదని సర్దిచెప్పుకున్నా అంతే



'ఎన్నో హిట్ చిత్రాల్ని తిరస్కరించినప్పటికీ.. విజయాలబాటలోనే నా ప్రయాణం సాగింద'ని అంటోంది బాలీవుడ్ సీనియర్ కథానాయిక కాజోల్ ( . ఆమె ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'మా' ఈ హారర్ థ్రిల్లర్ చిత్రానికి విశాల్ ఫ్యూరియా దర్శకత్వం వహించారు. అజయ్ దేవగణ్ ( నిర్మించారు. ఇందులో శక్తిమంతమైన తల్లి పాత్రలో కనిపించనుంది కాజోల్. ఈ సినిమా ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కాజోల్ కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది.

"నేను నటించిన 'సలాం వెంకీ' తర్వాత నా నుంచి వస్తోన్న చిత్రమిది. మూడేళ్ల తర్వాత నా సినిమా థియేటర్‌లో విడుదలవడం సంతోషంగా ఉంది. ఎన్నో ప్రేమకథలతో అలరించిన నన్ను ఈ హారర్ చిత్రంలో సరికొత్తగా చూస్తారు. నేను ఎప్పుడూ ఇలాంటి సినిమా చేస్తానని అనుకోలేదు. కానీ కథలు ఎంచుకున్న ప్రతీసారి నన్ను నేను కొత్తగా తిరిగి ఆవిష్కరించుకోవాలని నిర్ణయించుకున్నా. ఈ విషయం ఈ వృత్తిలో ఉన్నవాళ్లందరికీ తెలుసు. ప్రయోగాత్మక సినిమాల్ని ఎంపిక చేసుకుంటూ తెరపై మనమేంటో నిరూపించుకోవాలని అనుకుంటారు. నాలో ఉన్న మరో కోణాన్ని తెరపై తీసుకురావాలనే ఉద్దేశంతోనే మొదటి సారి హారర్ సినిమాని అంగీకరించా".

ఎన్నింటిని తిరస్కరించినా...!

"నా సినీ ప్రయాణంలో నేను చాలా చిత్రాలను తిరస్కరించాను. అవి బాక్సాఫీసు వద్ద భారీ విజయాల్ని కూడా అందుకున్నాయి. ఎప్పుడూ సినిమాల్ని తిరస్కరించినందుకు బాధపడలేదు. అవి నాకు రాసిపెట్టిలేవని సర్దిచెప్పుకున్నా. ఉదాహరణకు.. ఆమిర్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన 'త్రీ ఇడియట్స్'నే తీసుకుందాం. ఈ చిత్రం నా దగ్గరికి వచ్చినప్పుడు నో అని చెప్పా. నా దృష్టిలో తలరాతపై రాసిపెట్టిందే జరుగుతుంది. ఆమిర్, కరీనా కపూర్ లాంటి వాళ్లు మాత్రమే ఇందులో నటించాలని ముందే నిర్ణయించాడు ఆ దేవుడు. ఇలా నేను ఎన్ని సినిమాలను తిరస్కరించినప్పటికీ.. నా కెరీర్‌లో గొప్ప గొప్ప విజయాల్ని అందుకుంటూనే ఉన్నా".

షారుక్‌తో నటించాలనుకుంటున్నా

"నేను, షారుక్ ఖాన్ ( నటించిన 'దిల్‌వాలే దుల్హానియా లే జాయేంగే', 'కుఛ్‌కుఛ్ హోతా హై' లాంటి ఎన్నో ప్రేమకథలు ఇప్పటికీ ప్రేక్షకుల మనసుల్లో పదిలంగా ఉన్నాయి. ఎవర్‌గ్రీన్ జోడీగా నిలిచిన మా కలయికలో సినిమా వస్తుందంటే కచ్చితంగా అభిమానులకు ఆసక్తే. నాకు కూడా షారుక్‌తో మరోసారి పనిచేయాలనుంది. ఆయనతో కలిసి నేటి కాలాన్ని, భావోద్వేగాలను ప్రతిబింబించే ఓ ప్రేమకథలో నటించాలనుకుంటున్నా. కానీ భవిష్యత్తులో ఏం జరుగుతుందో చూద్దాం".

ఒక సెలబ్రిటీగా ఓపికగా ఉంటున్నా

"ప్రస్తుతం చాలా మంది సెలబ్రిటీలకు ఎదురవుతోన్న సమస్య 'పపరాజీ కల్చర్'. ఈ ఫొటోగ్రాఫర్ల గురించి నాకు కొంత అవగాహన ఉంది. వారు ఉండకూడని కొన్ని ప్రదేశాలు ఉన్నాయని నేను అనుకుంటున్నా. ఓ సెలబ్రిటీ అంత్యక్రియలలో పాల్గొనడానికి వచ్చినా కూడా వారి వెంట పరుగెత్తి ఫొటోలు తీసినప్పుడు నాకు వింతగా అనిపిస్తుంటుంది. వీళ్లు నేను ఎక్కడికి వెళుతున్నానో.. ఏ వేడుకలో పాల్గొంటున్నానో.. చూడటానికి కిలోమీటర్ల దూరం నుంచి నన్ను అనుసరిస్తుంటారు. ఇది నాకు ఇబ్బందికరంగా ఉంటుంది. నేను ఒక సాధారణ వ్యక్తి అయితే నన్ను ఇలా ఫాలో అవుతున్నందుకు పోలీసులకు ఫిర్యాదు చేసేదాన్ని. కానీ ఒక సెలబ్రిటీగా ఇలాంటి పనులను చూస్తూ ఓపికగా ఉంటున్నా. వీళు వ్యక్తిగత జీవితాల్లో కూడా మమ్మల్ని ప్రశాంతంగా ఉండనివ్వకపోవడం బాధగా ఉంది".

# సక్సెస్ అంటే.. స్వేచ్ఛగా ఉండడమే: సమంత



: స్వేచ్ఛను పొందడమే విజయమన్నారు అగ్ర కథనాయిక సమంత (%ాఖఎఖత్ష్ఖు%). సమంత ప్రధాన పాత్రలో సినిమా వచ్చి రెండేళ్లు అవుతోంది. విరామం తీసుకోవడం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. విరామం తీసుకున్న తర్వాత విజయానికి నిర్వచనం మారిందని అర్థమైందన్నారు.

"విజయానికి నిర్వచనం ఏంటంటే.. స్వేచ్ఛ అని వెంటనే చెబుతాను. అభివృద్ధి చెందడం, పరిణితి సాధించడం, బందీగా ఉండకపోవడమే నా దృష్టిలో స్వేచ్ఛ. అదే విజయం. రెండేళ్లుగా నా సినిమా విడుదల కాలేదు. ఈ విరామం సమయంలో నేను స్వేచ్ఛగా ఉన్నాను. నా చుట్టూ ఉన్న వాళ్లు గతంతో పోలిస్తే నేనిప్పుడు విజయం సాధించానని భావించడం లేదు. కానీ, నా దృష్టిలో నేను గతం కంటే ఎక్కువ సక్సెస్‌ఫుల్‌గా ఉన్నాను. నేను చేస్తోన్న ఎన్నో పనులు నాకు ఉత్సాహానిస్తున్నాయి. వాటిని పూర్తిచేయడం కోసం ప్రతిరోజు ఎంతో ఆనందంగా నిద్ర లేస్తున్నాను" అని సమంత చెప్పారు.

ఇక సినిమా విషయానికొస్తే.. సమంత బిగ్‌స్క్రీన్‌పై పూర్తిస్థాయిలో కనిపించి రెండేళు అవుతోంది. ఇటీవల వచ్చిన 'శుభం'లో మాతాజీ అనే అతిథి పాత్రలో మెరిశారు. తొలిసారి నిర్మాణరంగంలోకి అడుగుపెట్టి 'శుభం'తో ప్రశంసలు అందుకున్నారు. అలాగే 'మా ఇంటి బంగారం' అనే సినిమాను ప్రకటించారు. ఈ నెలలో ఈ చిత్రం ప్రారంభం కానుంది. దీని తర్వాత వరుస చిత్రాలతో అలరిస్తానని ఇటీవల తెలిపారు.

# లిప్ కిస్.. నేనెంతో ఇబ్బందిపడ్డా: నటి



'రోజా'తో సినీ ప్రియుల హృదయాలు గెలుచుకున్న నటి మధుబాల. ప్రస్తుతం సహాయ నటి పాత్రల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోన్న ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న పలు ఇబ్బందుల గురించి మాట్లాడారు. ముఖ్యంగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పుడు నటిగా తాను కొన్ని షరతులు పెట్టుకున్నానని తెలిపారు. ఒక సినిమా కోసం తాను ఆ రూల్ బ్రేక్ చేయాల్సి వచ్చిందన్నారు. తీరా చూస్తే ఆ సన్నివేశాన్ని తొలగించారని వెల్లడించారు.

ల

"స్కిన్ షో లేదా ముద్దు సన్నివేశాల్లో నటించడం నాకు నచ్చేది కాదు. అందుకే కథానాయికగా ఎంట్రీ ఇచ్చిన సమయంలోనే ఆయా సన్నివేశాల్లో నటించకూడదని నిర్ణయించుకున్నా. ఆ కారణంతోనే చాలా సినిమాలు వదులుకున్నా. అయితే, ఓ సినిమా కోసం నేను ఆ రూల్ బ్రేక్ చేయాల్సి వచ్చింది. సెట్‌లోకి అడుగుపెట్టిన తర్వాత కిస్ సీన్ చేయాలని టీమ్ చెప్పింది. నేను అందుకు అంగీకరించలేదు. కాకపోతే, ఆ సీన్ ముఖ్యమని టీమ్ చెప్పడంతో చేసేది లేకపోయింది. దాంతో లిప్ కిస్ సీన్‌లో యాక్ట్ చేశా. అది నన్నెంతో ఇబ్బందిపెట్టింది. తీరా చూస్తే ఎడిటింగ్ సమయంలో ఆ సన్నివేశం అవసరం లేదని టీమ్ భావించింది. దాంతో సీన్‌ను తొలగించేశారు. ఆ విషయంలో దర్శకుడితో నేను ఏమీ గొడవ పడలేదు. సినిమా కోసం ఎలాంటి సన్నివేశాల్లోనైనా యాక్ట్ చేయాల్సి ఉంటుందని కొంతమంది సీనియర్ నటీమణులను చూశాక నాకు అర్థమైంది" అని మధుబాల చెప్పారు.


సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్ చిత్రాల్లో నటించే అవకాశం తనకు వచ్చిందని.. ఆడిషన్స్‌లోనూ తాను పాల్గొన్నానని ఆమె తెలిపారు. అయితే, ఆయా సినిమాలు చివరకు వేరే వాళ్లను వరించాయన్నారు. 'బాజీగర్'లో నటించే అవకాశం మొదట తనకే వచ్చిందని మధు చెప్పారు. పాత్రకు సరైన ప్రాధాన్యం లేదనే ఉద్దేశంతో తాను ఆ ఆఫర్ వదులుకున్నానన్నారు. అదే రోల్‌లో శిల్పాశెట్టి యాక్ట్ చేశారని వివరించారు. మధుబాల ప్రస్తుతం 'కన్నప్ప' కోసం వర్క్ చేస్తున్నారు.

# 'ఆల్ఫా' అమ్మాయిల ఆటాపాటా



'ఆల్ఫా' చిత్రంతో మరోసారి దేశం కోసం పోరాటం చేయడానికి సిద్ధమైంది బాలీవుడ్ కథానాయిక అలియా భట్. ఆమె, శార్వరీ వాఘ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో రాబోతున్న మొదటి మహిళా గూఢచారి సినిమా. శివ్ రావేల్ తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. ఇందులో భాగంగానే భారీ బడ్జెట్‌తో ఈ సినిమాకి కీలకంగా నిలిచే ఒక పాటను తీర్చిదిద్దనున్నట్లు తెలుస్తోంది. అలియా, శార్వరీ.. ఇప్పటికే ఈ గీతం కోసం రిహార్సల్స్ ప్రారంభించారని, ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు ఆకర్షణగా కనిపించేలా వీరిద్దరి ఆటాపాటా ఉంటుందని సమాచారం. త్వరలో ఈ పాటకు సంబంధించిన పూర్తి వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నట్లు అలియా సన్నిహిత వర్గాలు తెలిపాయి. అనిల్ కపూర్, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఆస్థమా శాపం కాదు



ఆస్థమా దీర్ఘకాల సమస్యే కావొచ్చు. జీవితాంతం వేధించేదే కావొచ్చు. అంతమాత్రాన భయపడాల్సిందేమీ లేదు. శాపంగా భావించాల్సిన పనీ లేదు. దీనికిప్పుడు మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. వీటిని క్రమం తప్పకుండా వాడుకుంటే ఆస్థమాను చాలావరకు నియంత్రణలో ఉంచుకోవచ్చు. అయితే మనదేశంలో మందులపై సరైన అవగాహన లేకపోవటం.. జబ్బు మీద అపోహలు, భయాలు నెలకొనటం పెద్ద సమస్యగా పరిణమిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆస్థమా బాధితులతో పోలిస్తే మనదేశంలో 13% మంది దీంతో బాధపడుతుండగా.. ఆస్థమా మరణాల్లో 42% మనదగ్గరే సంభవిస్తుండటం గమనార్హం. ఇలాంటి వ్యత్యాసాలను తగ్గించే ఉద్దేశంతోనే 'ఆస్థమా చికిత్స అందరికీ' అని వరల్డ్ ఆస్థమా డే నినదిస్తోంది. ఈ నేపథ్యంలో ఆస్థమా ఎందుకు వస్తుంది? ఎలా నియంత్రణలో ఉంచుకోవచ్చు? అనేవి తెలుసుకొని ఉండటం మంచిది.

ఆస్థమా ప్రధానంగా ఊపిరితిత్తుల్లోని గాలి గొట్టాల సమస్య. దీనికి మూలం అలర్జీ. కంట్లో నలుసు పడితే దురద పుడుతుంది కదా. కన్ను ఎరుపెక్కటం, నీరు కారవటమూ మొదలవుతాయి. సరపడని పదార్థాలు తగిలినపుడు ఊపిరితిత్తుల్లోనూ ఇలాగే జరుగుతుంది. మనం ముక్కుతో పీల్చుకునే గాలి శ్వాసనాళం ద్వారా ఊపిరితిత్తుల లోపలికి చేరుకుంటుంది. ఈ శ్వాసనాళం పైనుంచి రెండుగా చీలుతూ వచ్చి.. మళ్లీ చిన్నచిన్న గొట్టాలుగా విడిపోతూ.. అతి సూక్ష్మమైన గాలిగదుల్లోకి గాలిని చేరవేస్తుంది. సాధారణంగా దుమ్ము ధూళి ఉన్న ప్రాంతాలకు వెళ్లినప్పుడు దగ్గు రావటం మామూలే. ఇది హాని కారకాలు లోపలికి ప్రవేశించకుండా, వాటిని బయటకు నెట్టివేయటానికి శరీరం చేసే ప్రయత్నమే. అయితే ఆస్థమా వచ్చే స్వభావం (అటోపీ) గలవారికి ఇలాంటి మామూలు విషయాలే పెద్ద సమస్యగా మారతాయి. దుమ్మూ ధూళి, పుప్పొడి, రసాయనాల వంటివి తగిలినప్పుడు లోపల అలర్జీ ప్రేరేపితమై గాలిగొట్టాలు విపరీతంగా స్పందిస్తుంటాయి. ఆస్థమాకు మూలం ఇదే. గాలిగొట్టాలకు అలర్జీ కారకాలు తగిలినప్పుడు రోగనిరోధక కణాలు అతిగా స్పందిస్తాయి. దీంతో వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) మొదలవుతుంది. అప్పుడు గాలిగొట్టాల గోడలు ఉబ్బి, లోపలి మార్గం సన్నబడుతుంది. గాలి గొట్టాల్లో జిగురుద్రవం ఉత్పత్తీ పెరుగుతుంది. ఇది లోపలే చిక్కుకు పోతుంది. చుట్టుపక్కలా వాపు మాదిరి మార్పులు మొదలవుతాయి. దీంతో శ్వాస తీసుకోవటం, వదలటం కష్టమైపోతుంది. ఫలితంగా దగ్గు, పిల్లికూతలు, ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరి అవటం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. ఈ లక్షణాలు కొందరిలో కొద్దిసేపే ఉండొచ్చు. ఒకట్రెండు లక్షణాలే ఉండొచ్చు. కొందరికి ప్రత్యేకించి కొన్ని సమయాల్లోనే తలెత్తొచ్చు. కొందరికి నిరంతరం వేధిస్తుండొచ్చు. కొందరికి ఎలాంటి లక్షణాలు లేకుండానూ ఆస్థమా ఉండొచ్చు (సైలెంట్ చెస్ట్).

ఎవరికి? ఎందుకు?

పిల్లల దగ్గర్నుంచి వృద్ధుల వరకూ ఎవరికైనా ఆస్థమా రావొచ్చు. అయితే ఆస్థమా బాధితుల్లో సుమారు సగం మందికి పదేళ్ల వయసులోపే తొలి లక్షణాలు మొదలవుతుంటాయి. ఆస్థమాతో బాధపడే పిల్లల్లో చాలామందిలో ఆరేళ్లలోపే తొలిసారి ఆస్థమా దాడి చేయటం చూస్తుంటాం. దీనికి ప్రధాన కారణం వంశపారంపర్యంగా సంక్రమించే జన్యువులు. అయితే తల్లిదండ్రులకు ఆస్థమా ఉన్నంత మాత్రాన పుట్టే పిల్లలకు తప్పకుండా రావాలనేమీ లేదు. తల్లిదండ్రులిద్దరికీ ఆస్థమా ఉంటే పిల్లలకు 70% వరకు రావొచ్చు. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరికే ఆస్థమా ఉంటే 30% వరకు వచ్చే అవకాశముంది. అదేపనిగా అలర్జీ కారకాలకు గురవుతున్నప్పుడు జన్యువులు లేకపోయినా ఆస్థమా దాడి చేయొచ్చు. ఆస్థమా బాధితుల్లో సుమారు 6% మంది ఇలాంటివారే. పుట్టుకతో ఆస్థమా జన్యు స్వభావం ఉన్నా అందరికీ సమస్యలు తెచ్చిపెట్టకపోవచ్చు. చాలావరకు నిద్రాణంగానే ఉంటుంది. అలర్జీ కారకాల ప్రభావానికి గురైనప్పుడు ఈ జన్యు స్వభావం బయటపడుతుంది. ఎండుగజ్జి లేదా ఆహార అలర్జీ గల పిల్లలకు ఆస్థమా ముప్పు ఎక్కువ. మానసిక ఆందోళన, ఒత్తిడి, కొన్నిరకాల వృత్తులు, ఇన్‌ఫెక్షన్ల వంటివీ ఆస్థమాను ప్రేరేపించొచ్చు.

లక్షణాలేంటి?

దగ్గు.. ముఖ్యంగా పడని వాతావరణంలో దగ్గు వస్తుంటుంది. శ్వాస తీసుకోవటం, వదలటంలో ఇబ్బంది కలుగుతుంది. ఛాతీ బరువుగా, బిగుతుగానూ అనిపించొచ్చు. శ్వాసిస్తున్నప్పుడు, దగ్గినప్పుడు పిల్లికూతలు వస్తుంటాయి. అయితే అందరిలో అన్ని లక్షణాలూ ఉండాలనేమీ లేదు. కొందరికి దగ్గు ఒక్కటే ఉండొచ్చు. పిల్లికూతలు, ఆయాసం అంతగా ఉండకపోవచ్చు. దీని లక్షణాలూ వస్తూ పోతుంటాయి కూడా. కొందరికి ఉన్నట్టుండి తలెత్తొచ్చు. తీవ్రంగానూ ఉండొచ్చు. ఇలాంటి సమయంలో శ్వాస తీసుకోవటం చాలా కష్టమైపోతుంది.

ఇన్‌హేలర్లపై అనుమానాలొద్దు

ఇన్‌హేలర్లు సురక్షితం. ఆందోళన, అనుమానాలు వద్దు. ఆస్థమా చాలా తీవ్రంగా ఉంటేనే, చివరిదశలోనే ఇన్‌హేలర్లు వాడుతారని అనుకోవద్దు. ఇవి ప్రాథమిక, ఉత్తమ చికిత్స సాధనాలని తెలుసుకోవాలి. వీటితో తీసుకునే మందు మోతాదు మైక్రోగ్రాముల్లో ఉంటుంది. నేరుగా శ్వాసమార్గాల్లోకే చేరుకుంటుంది. కాబట్టి పెద్దగా నష్టమేమీ ఉండదు. ఈ మందులకు అలవాటు పడటమనేది ఉండదు.

ఆస్థమా పిల్లల విషయంలో- 'పెరిగే వయసు కదా. ఇప్పట్నుంచే ఇన్‌హేలర్లు ఎందుకు?' అని కొందరు వెనకాడుతుంటారు. స్టిరాయిడ్ల వాడకంతో ఎదుగుదల కుంటుపడుతుందని భయపడుతుంటారు. ఇది తప్పు. ఆస్థమా నియంత్రణలో లేకపోతేనే ఎదుగుదల దెబ్బతింటుంది. డాక్టర్ సూచించిన మోతాదులో మందు వాడితే ఎలాంటి దుష్ప్రభావాలూ ఉండవు.

ఇన్‌హేలర్లు ఖరీదైనవని మరికొందరి అభిప్రాయం. మాత్రలతో పోలిస్తే వీటి ధర ఎక్కువే కావొచ్చు. కానీ వీటిని సరిగా వాడకపోవటం వల్ల ఆసుపత్రిలో చేరితే అయ్యే ఖర్చుతో పదేళ్లకు సరిపడిన ఇన్‌హేలర్ మందులు కొనుక్కోవచ్చు.

బయటి ఊళ్లకు వెళ్లినా వెంట ఇన్‌హేలర్లు తీసుకెళ్లాలి. వీటి వాడుకోవటాన్ని నామోషీగా భావించొద్దు. ఇన్‌హేలర్ వాడకంలో తప్పులు చేయొద్దు. దీన్ని నొక్కుతూనే మందును లోనికి పీల్చుకోవాల్సి ఉంటుంది. ఇన్‌హేలర్‌కు స్పేసర్‌ను జోడించి మందు పీల్చుకోవటం అన్ని విధాలా మంచిది.

# కాలుష్యంతో గర్భిణుల్లో ఫ్లూ

వాయు కాలుష్యం బారినపడకుండా గర్భిణులను కాపాడుకోవటం ఎంతైనా అవసరమని తాజా అధ్యయనం సూచిస్తోంది. గాలిలోని అతి సూక్ష్మ రేణువుల (యూఎఫ్‌పీలు) మూలంగా గర్భిణుల్లో శ్వాసకోశ వైరల్ ఇన్‌ఫెక్షన్ ముప్పు పెరుగుతున్నట్టు తేలటమే దీనికి కారణం. వాయు కాలుష్యం



ఊపిరితిత్తుల్లోని రక్షణ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. ఫలితంగా వైరల్ ఇన్‌ఫెక్షన్ల ముప్పూ పెరుగుతుంది. మామూలుగానే గర్భిణులకు తీవ్ర ఫ్లూ ముప్పు ఎక్కువ. అయినా కూడా వాయు కాలుష్యం, ఇన్‌ఫ్లుయెంజా మధ్య సంబంధంపై ఇప్పటివరకూ పెద్దగా అధ్యయనాలు జరగలేదు. దీనిపై లోతుగా దృష్టి సారించాలని.. తల్లుల ఆరోగ్యం మీద స్వల్పకాలంలో, దీర్ఘకాలంలో పడే ప్రభావాలను నివారించటానికిది అవసరమని పరిశోధకులు చెబుతున్నారు. గర్భిణుల్లో రక్తం మరింత ఎక్కువగా పంప్ కావటం.. శ్వాసించేటప్పుడు ఎక్కువ మొత్తంలో గాలిని తీసుకోవటం, వదలటం.. పిండాన్ని రక్షించటానికి తోడ్పడే కొన్ని రోగనిరోధక కణాల్లో మార్పులు సంభవించటం వంటివన్నీ వీరిలో వైరల్ ఇన్‌ఫెక్షన్ ముప్పు పెరగటానికి దోహదం చేస్తున్నాయని వివరిస్తున్నారు. ఫ్లూ టీకా సమర్థమైంది, సురక్షితమైంది అయినప్పటికీ గర్భిణుల్లో దీని సామర్థ్యం 50% కన్నా తక్కువగానే ఉంటుంది. అందువల్ల టీకా తీసుకున్నప్పటికీ వీరికి శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ ముప్పు ఎక్కువగానే ఉంటుందని పరిశోధకులు గుర్తుచేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి పది అకాల మరణాల్లో తొమ్మిదింటికి కాలుష్యమే కారణమవుతోంది. వాయు మిశ్రమాలు, అతి సూక్ష్మ రేణువులు ఎంతోమందికి ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాయు కాలుష్యంతో ప్రమాదం ఎక్కువగా గలవారిని గుర్తించి, కాపాడుకోవాల్సిన అవసరముందని పరిశోధకులు చెబుతున్నారు. ముఖ్యంగా ఫ్లూ, యూఎఫ్‌పీలు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాల్లో గర్భిణులను కాపాడుకోవటానికి కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# పాత జలుబు కొత్తగా..

ఇదిగో జలుబు అంటే అదిగో కరోనా అన్నట్టుగా మారింది పరిస్థితి. ఏ కొత్త వైరస్ విజృంభించినా మహమ్మారిలా మారుతుందేమోననే వణికిపోతున్నాం. కొవిడ్ అంతలా భయపెట్టింది! అందుకేనేమో మామూలుదైన హెచ్3ఎన్2 వైరస్‌కూ ఇప్పుడు బెంబేలెత్తిపోతున్నాం. నిజానికి అంత ఆందోళన అవసరం లేదు. కొవిడ్‌లా ఇదేమీ కొత్తది కాదు. ఏటా వచ్చే సీజనల్ ఫ్లూనే. అలాగని అసలే ప్రమాదం లేదనుకోలేం. కొందరికి తీవ్రంగానూ పరిణమించొచ్చు. కాబట్టి జాగ్రత్త అవసరం.

ఏటా కాలాల వారీగా వచ్చే ఫ్లూ మనదేశంలో అంత ప్రమాదకరమైంది కాదు. దీన్ని అంతగా పట్టించుకునేవారూ కాదు. స్వైన్‌ఫ్లూ రాకతో ఇదెంత ప్రమాదకరమైందో తెలిసొచ్చింది. అది కొందరిలో న్యూమోనియాకు దారితీయటం, ప్రాణాంతకంగా పరిణమించటం తెలిసిందే. అప్పటి నుంచీ ఫ్లూ విషయంలో నిర్లక్ష్యం తగదనే అవగాహన పెరిగింది. ఆసుపత్రుల్లోనూ ప్రత్యేకించి దీనిపై దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం హెచ్3ఎన్2 కొత్తగా విజృంభిస్తుండటంతో కలకలం మొదలైంది. కాలాల వారీగా వచ్చే ఫ్లూలో ఇదొకరకం.

# ఎండకు బాల గుండెలు జాగ్రత్త



ఎండ వేడిని తట్టుకోవటం ఎవరికైనా కష్టమే. గుండెలో రంధ్రాలతో పుట్టిన పిల్లలకైతే మరీ కష్టం. పుట్టిన తర్వాత గుండెజబ్బుల బారినపడే చిన్నారులకూ ఇబ్బందే. అందువల్ల వేసవిలో ఇలాంటి పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవటం తప్పనిసరి.

సాధారణంగా ఆక్సిజన్‌తో కూడిన 'మంచి' రక్తం, ఆక్సిజన్‌ను కణాలు వాడుకున్నాక మిగిలే 'చెడు' రక్తం ధమనుల్లో, సిరల్లో వేర్వేరుగా ప్రవహిస్తుంటుంది. గుండెలోనూ వేర్వేరు గదులు ఇవి కలిసిపోకుండా చూస్తాయి. అయితే గుండె గదుల మధ్య గోడలకు రంధ్రాలు గల పిల్లల్లో మంచి, చెడు రక్తం కలిసిపోతుంటాయి. దీంతో రక్తంలో ఆక్సిజన్ మోతాదు తగ్గిపోతుంది. ఫలితంగా అవయవాలకు తగినంత ఆక్సిజన్ అందదు. అప్పుడు రక్తం సరిపోవటం లేదనే ఉద్దేశంతో శరీరం మరింత ఎక్కువగా రక్తం ఉత్పత్తయ్యేలా చేస్తుంది. దీంతో ఎర్ర రక్తకణాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. వీటి సంఖ్య మరీ ఎక్కువైతే రక్తం బాగా చిక్కగా అవుతుంది. ఎండాకాలంలో దీని ముప్పు మరింత ఎక్కువవుతుంది.

రక్తం చిక్కబడితే ప్రమాదం

వేసవిలో వాతావరణ ఉష్ణోగ్రత బాగా పెరుగుతుంది. వేడిని తట్టుకోవటానికి ఒంట్లోని నీరు చెమట రూపంలో ఎక్కువగా బయటకు పోతుంది. దీంతో ఒంట్లో నీటిశాతం తగ్గి, రక్తం చిక్కబడే ముప్పు తలెత్తుతుంది. ఒకవేళ వాంతులు, విరేచనాలు అవుతుంటే ఇది మరింత ఎక్కువవుతుంది కూడా. రక్తం చిక్కబడినప్పుడు తలనొప్పి, తీవ్రమైన అలసట, మగ వంటి లక్షణాలు (హైపర్ విస్కాసిటీ సిండ్రోమ్) తలెత్తుతాయి. రక్తం సిరల్లో గడ్డకట్టే ప్రమాదమూ (వీనస్ థ్రాంబోసిస్) ఉంటుంది. తలలోని సిరల్లో రక్తం గడ్డలు ఏర్పడితే మెదడులో చీము పట్టి పరిస్థితి తీవ్రమవుతుంది. కాబట్టి గుండె లోపాలతో పుట్టిన పిల్లల విషయంలో వేసవిలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

జాగ్రత్తగా ఉండాలి

గుండె లోపాలు గల పిల్లలను ఎండలో ఎక్కువగా తిరగనీయొద్దు. వీరిని చెమట ఎక్కువగా పట్టే బీచ్‌ల వంటి చోట్లకు తీసుకెళ్లటం మంచిది కాదు.

నీరు, ద్రవాలు ఎక్కువగా తాగించాలి. పండ్ల రసాలు కూడా మంచివే.

వాంతులు, విరేచనాలు అవుతుంటే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. అవసరమైతే సెలైన్ ఎక్కించాల్సి ఉంటుంది.

గుండెలో రంధ్రం గల పిల్లలు తలనొప్పి వస్తుందన్నా, రోజూ జ్వరం వస్తున్నా, కళ్లు సరిగా కనిపించటం లేదన్నా తాత్సారం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లాలి. అవసరమైతే సీటీ స్కాన్ చేయించాలి. మెదడులో చీము, మెదడు సిరల్లో రక్తం గడ్డలుంటే తక్షణం చికిత్స చేయించాలి.

తలనొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు.. మగత, ఆయాసం, అలసట ఉన్నప్పుడు రక్తం చిక్కదనాన్ని తెలిపే పీసీవీ పరీక్ష చేయించాలి. చిక్కదనం మరీ ఎక్కువైతే కొన్నిసార్లు కొంత రక్తాన్ని బయటకు తీయాల్సి రావొచ్చు.

రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గటం వల్ల కొందరు పిల్లలు నీలంగా మారుతుంటారు (బ్లూ బేబీస్). బిగ్గరగా ఏడ్చినా కూడా పెదవులు, గోళ్లు, ముఖం వంటివి నీలంగా మారుతుంటాయి. ఇలాంటి పిల్లలకు చిన్నప్పుడు షంట్ ఆపరేషన్ చేసి, కొద్ది సంవత్సరాల తర్వాత పెద్ద ఆపరేషన్ చేస్తుంటారు. వీరి విషయంలో వేసవిలో ఇంకాస్త ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే రక్తం చిక్కబడి, షంట్ మూసుకుపోయే ప్రమాదముంది. వీరికి అవసరాన్ని బట్టి డాక్టర్లు ఆస్ప్రిన్ మాత్రలు సూచిస్తుంటారు. వీటిని క్రమం తప్పకుండా వేసుకునేలా చూడాలి.

పుట్టిన తర్వాత- గుండె వైఫల్యం (కార్డియో మయోపతీ) తలెత్తిన పిల్లలకు దీర్ఘకాలం వైద్యం అవసరం. వీరికి డాక్టర్లు ఒంట్లోంచి నీరు ఎక్కువగా బయటకు పోవటానికి మందులు సూచిస్తుంటారు. ఈ మందులు వేసుకునేవారికి ఎండాకాలంలో మరింత ఎక్కువగా ఒంట్లోంచి నీరు బయటకు పోయి, ఖనిజ లవణాలు తగ్గిపోవచ్చు. దీంతో బాగా నీరసిస్తారు. కొన్నిసార్లు గుండె లయ తప్పొచ్చు. ఇది చాలా ఇబ్బందులకు దారితీయొచ్చు. కాబట్టి వీరి విషయంలో ముందే డాక్టర్‌ను సంప్రదించి, మందుల మోతాదులో అవసరమైన మార్పులు చేసుకోవాలి. పల్మనరీ హైపర్‌టెన్షన్‌తో బాధపడే పిల్లల విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. ఎండలో ఎక్కువగా తిరిగితే వీరికి వేసోవేగల్ సింకోప్ సమస్య తలెత్తొచ్చు. ఇందులో ఉన్నట్టుండి రక్తపోటు తగ్గిపోయి, పిల్లలు కింద పడిపోవచ్చు. కొన్నిసార్లు మరణించే ప్రమాదమూ ఉంటుంది. కాబట్టి పల్మనరీ హైపర్‌టెన్షన్ గల పిల్లలను ఎండలో ఎక్కువగా తిరగనీయకూడదు.

# సురక్షిత క్యాన్సర్ మందుల దిశగా..

సురక్షిత క్యాన్సర్ మందుల ఆవిష్కరణ దిశగా మరో ముందడుగు పడింది. కొన్ని క్యాన్సర్ చికిత్సలు గుండెను దెబ్బతీయటానికి గల కారణాన్ని యూసీఎల్ పరిశోధకులు గుర్తించారు మరి. క్యాన్సర్ చికిత్సలో అధునాతన ఔషధాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మరణాల నుంచి కాపాడుతున్నాయి. జీవనకాలాన్ని పెంచుతున్నాయి. అయితే కొన్ని క్యాన్సర్ చికిత్సలు గుండెను దెబ్బతీస్తుంటాయి. ఇది రకరకాల రూపాల్లో ఉండొచ్చు. కొందరిలో గుండె పంపింగ్ సామర్థ్యం తగ్గితే.. కొందరిలో గుండె వైఫల్యం సంభవించొచ్చు. కానీ ఈ మందులు గుండెను ఎలా దెబ్బతీస్తున్నాయనేది తెలియకుండానే ఉండిపోయింది. దీని విషయంలో యూసీఎల్ పరిశోధకులు ఓ కొత్త విషయాన్ని గుర్తించారు. గుండెజబ్బు ముప్పు పెరగటానికి దోహదం చేసే రక్తంలోని ప్రొటీన్లు క్యాన్సర్ చికిత్సలో వాడే మందులతోనూ ప్రభావితమవుతున్నాయని కనుగొన్నారు. ఈ మందులు గుండెను ఎలా దెబ్బతీస్తున్నాయో విశ్లేషించటానికి, గుండెజబ్బు ముప్పు గలవారిని గుర్తించటానికి తమ అధ్యయన ఫలితాలు తోడ్పడగలవని పరిశోధకులు చెబుతున్నారు. మున్ముందు సురక్షిత క్యాన్సర్ మందుల ఆవిష్కరణకూ దారితీయగలవని ఆశిస్తున్నారు. గుండె వైఫల్యం వంటి గుండె జబ్బుల చికిత్సకు కొత్త మందుల రూపకల్పనకూ



ఈ అధ్యయనం దారులు తెరచింది. గుండెజబ్బు ముప్పుతో ముడిపడిన ప్రొటీన్లను అడ్డుకోవటం లేదా ముప్పును తగ్గించే ప్రొటీన్లను ప్రేరేపితం చేయగలిగే మందులతో మంచి ఫలితం కనిపించొచ్చని భావిస్తున్నారు.

# ఇదేం కడుపునొప్పి?

మీరు ఎండోస్కోపీ, కొలనోస్కోపీ చేయించుకున్నారు. పెద్దగా సమస్యలేమీ బయటపడలేదు. కాబట్టి ప్రమాదకరమైన జబ్బేదీ లేకపోవచ్చు. మీరు వాడుతున్న మందులతో అన్నవాహికలోకి జీర్ణరసాలు ఎగదన్నుకొని రావటం (రిఫ్లక్స్), డ్యుయోడినమ్ అల్సర్ సమస్యలు ఇప్పటికే తగ్గిపోయి ఉండాలి. అయినా నొప్పి, మంట తగ్గలేదంటే ఇతరత్రా సమస్యలేవైనా ఉన్నాయేమో చూడాల్సి ఉంటుంది. మీరు తెలిపిన లక్షణాలను బట్టి ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ (ఐబీఎస్) లేదా నాన్ అల్సర్ డిస్‌పెప్సియాలో ఏదో ఒకటి ఉండొచ్చని అనిపిస్తోంది. ఐబీఎస్‌లో రకరకాల లక్షణాలుంటాయి. వీటిల్లో ఒకటి తరచూ నొప్పి రావటం. విరేచనాలు, మలబద్ధకం కూడా ఉండొచ్చు. కొందరిలో ఇవి రెండూ కలిసి ఉండొచ్చు. నాన్ అల్సర్ డిస్‌పెప్సియాలో పుండు లేకపోయినా అజీర్ణం, మంట వంటివి వేధిస్తుంటాయి. కాబట్టి ఆయా లక్షణాలను బట్టి చికిత్స చేయాల్సి ఉంటుంది. నొప్పి, మంట తగ్గటానికి ఒమిప్రాజోల్ ఒక్కటే కాదు.. ఇతరత్రా మందులూ ఉన్నాయి. ముఖ్యంగా ప్రొకైనటిక్స్ రకం మందులు మేలు చేస్తాయి. ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ అయితే పేగుల కదలికలను నియంత్రించే మందులు ఉపయోగపడతాయి. వీటిని వైద్యుల పర్యవేక్షణలో ఆరంభించాల్సి ఉంటుంది. ముందుగా ఏ మందు పనిచేస్తుందో గుర్తించి, వాటిని వాడుకోవాల్సి ఉంటుంది. కొన్నిసార్లు మానసిక ఒత్తిడితోనూ నొప్పి, మంట వంటివి తలెత్తొచ్చు. కాబట్టి యోగా, ధ్యానం వంటి వాటితో మానసిక ప్రశాంతత సాధించేందుకు ప్రయత్నించాలి. ఏవైనా పదార్థాలు తిన్నప్పుడు ప్రత్యేకించి నొప్పి, మంట వస్తున్నట్టు గుర్తిస్తే ఆపెయ్యాలి. ఐబీఎస్ గలవారికి త్వరగా జీర్ణం కాని పిండి పదార్థాలు



తక్కువగా ఉండే లో ఫాడ్‌మ్యాప్ ఆహార పద్ధతి ఉపయోగపడుతుంది. దీని గురించి డాక్టర్‌ను అడిగి తెలుసుకోవాలి. కొన్ని జబ్బులు పరీక్ష చేసినప్పుడు చిన్నగా ఉండటం వల్ల కనిపించకపోవచ్చు. కొంతకాలం తర్వాత బయటపడొచ్చు. కాబట్టి మీరు క్రమం తప్పకుండా వైద్యుడిని సంప్రదిస్తూ ఉండటం మంచిది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy